thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 219 | కరీంనగర్ గురువారం, 16 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సొంత ప్రజలపైనే పాక్ బాంబుల దాడి

ఇస్లామాబాద్ : ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా పాకిస్థాన్ వైమానిక దళం జరిపిన బాంబుల దాడిలో ఆ దేశ ప్రజలు బలయ్యారు. ఖైబర్ పక్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వాయుసేనకు చెందిన జేఎఫ్–17 ఫైటర్ జెట్లు ఎనిమిది ఎల్ఎస్–6 బాంబులు జారవిడవడంతో కనీసం 30 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. వేకువజామున 2 గంటల సమయంలో తిరా లోయలోని మాత్రె దారా అనే గ్రామంపై దాడులు చేసింది. ఈ దాడుల్లో చాలామంది గాయపడ్డారని స్థానిక మీడియా వెల్లడించింది. కాగా క్షతగాత్రుల పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదు. సంఘటనా స్థలంలో మరణించిన చిన్నారులు సహా పలువురి మృతదేహాలు పడి ఉన్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి.




# త్రిముఖ పోరులో నెగ్గేదెవరు!?

## రసవత్తరంగా మారిన జూబ్లీహిల్స్ ‘ఉప’ రాజకీయం!!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక రసవత్తరంగా మారబోతోంది. ఎందుకంటే బీజేపీ కూడా తన అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని ప్రకటించింది. కాంగ్రెస్ తరపున వల్లాల నవీన్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత పోటీచేస్తున్న విషయం తెలిసిందే. వల్లాల, మాగంటి కొద్దిరోజులుగా ప్రచారం కూడా చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి ప్రకటనతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చేసింది. అయితే ఇక్కడ ఇంట్రెస్టింగ్ పాయింట్ ఏమిటంటే ప్రస్తుతం తెలంగాణలో బీసీ వాదన చాలా బలంగా వినబడుతోంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ మాత్రమే బీసీ అభ్యర్థిని పోటీలోకి దింపింది. మిగిలిన ఇద్దరు అభ్యర్థులు అగ్రవర్ణాలకు చెందిన వాళ్ళే. పైగా కొన్ని బీసీ సంఘాల్లో రెడ్డి సామాజికవర్గంపై తీవ్రవ్యతిరేకత కనబడుతోంది. రెడ్లకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న పోస్టులే ఇందుకు ఉదాహరణ. రెడ్లపై ఒక్కసారిగా బీసీల్లో వ్యతిరేకత పెరిగిపోవటానికి కారణం ఏమిటి ? ఏమిటంటే బీసీలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తు జీవో జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఆ జీవోను సవాలు చేస్తు రెడ్డిజాగృతి అనే సంస్థ అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి హైకోర్టులో కేసు వేశాడు. కేసు ఫలితంగా జీవో అమలును నిలిపేస్తు హైకోర్టు స్టే ఇచ్చింది. ఎప్పుడైతే హైకోర్టు రిజర్వేషన్ల అమలుపై స్టే విధించిందో అప్పటినుండి బీసీ సంఘాలు బాగా మండిపోతున్నాయి. జీవో అమలును సవాలు చేయటంతో ఆగని బుట్టెంగారి సోషల్ మీడియాలో బీసీలను కించపరుస్తు పోస్టులు పెడుతున్నాడు. అలాగే బీసీలకు వ్యతిరేకంగా ప్రకటనలు కూడా చేస్తున్నాడు. బుట్టెంగారి పోస్టులన్నీ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. దాంతో బీసీ సంఘాలు బుట్టెంగారి మీదనే కాకుండా రెడ్డి సామాజికవర్గం మీద తీవ్రస్థాయిలో మండుతున్నాయి. ఇలాంటి సమయంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ తరపున మాత్రమే బీసీ అభ్యర్థి నవీన్ పోటీలో ఉన్నారు. కాబట్టి నియోజకవర్గంలోని బీసీల ఓట్లు ఎవరికి పడతాయి ? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. కారణం ఏమిటంటే బీసీ అభ్యర్థి కాబట్టి నవీన్ కు బీసీలు ఓట్లేస్తారా ? లేకపోతే రేవంత్ ను వ్యతిరేకిస్తు అభ్యర్థిని కూడా బీసీలు వ్యతిరేకిస్తారా అన్నది అర్థంకావటంలేదు. అలాగే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరు అగ్రవర్ణాలకు చెందిన వారే. వీరిలో మాగంటి సునీత దివంగత ఎంఎల్ఏ, భర్త మాగంటిగోపీనాథ్ మరణం తాలూకు సింపథి ఓట్లపైనే ఎక్కువగా ఆధారపడినట్లు అర్ధమవుతోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని రేవంత్ ప్రభుత్వం ఏమీ డెవలప్ చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీష్ రావు తదితరులు చేస్తున్న ఆరోపణలు విచిత్రంగా ఉన్నాయి. విచిత్రం ఎందుకంటే రేవంత్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదంటే అంతకుముందున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఏమీ డెవలప్ చేయలేదనే కదా అర్థం ? తొమ్మిదిన్నరేళ్ళు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్సే. పైగా గోపీ హ్యాట్రిక్ ఎంఎల్ఏ కూడా. అంటే గోపి మూడుసార్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎంఎల్ఏగా ఉన్నా ఎలాంటి డెవలప్ చేయలేదనే కదా అర్థం ? మూడోసారి ఎంఎల్ఏ అయిన కొద్దినెలలకే చనిపోయినా అంతకుముందు తొమ్మిదిన్నరేళ్ళు గోపీనే కదా ఎంఎల్ఏగా పనిచేసింది. ఏకోణంలో చూసినా రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్, హరీష్ చేస్తున్న ఆరోపణలు తిరిగి వాళ్ళకే రివర్సు కొడతాయనటంలో సందేహంలేదు. తాము కూడా నియోజకవర్గాన్ని డెవలప్ చేయలేదు కాబట్టే బీఆర్ఎస్ నేతలు సింపథీ ఓట్లపైనే ఎక్కువగా ఆధారపడినట్లు అర్థమవుతోంది. చివరగా లంకల దీపక్ విషయం చూస్తే పోయిన ఎన్నికల్లో కూడా బీజేపీ తరపున పోటీచేసి ఓడిపోయాడు. 2023 ఎన్నికల్లో దీపక్ కు సుమారు 18 వేల ఓట్లొచ్చాయి. పోయిన ఎన్నికల్లో ఓడిపోయాడు కాబట్టి ఆ సింపథితో జనాలు ఉపఎన్నికలో ఓట్లువేసి గెలిపిస్తారనే అంచనాతో బీజేపీ మళ్ళీ దీపక్ కే టికెట్ ఇచ్చినట్లుంది. అంతేకాకుండా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దీపక్ కు గట్టి ప్రత్యామ్నాయం కూడా దొరకలేదేమో. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే నియోజకవర్గంలో సుమారు 3.99 లక్షల ఓట్లున్నాయి. ఇందులో బీసీల ఓట్లు సుమారుగా 2 లక్షలున్నాయి. 2 లక్షల బీసీ ఓట్లలో యాదవుల ఓట్లు ఎన్ని అన్నవిషయంలో క్లారిటిలేదు. తర్వాత ముస్లిం మైనారిటి ఓట్లు సుమారు 98 వేలదాకా ఉన్నాయి. సామాజికవర్గాల ఓట్లను బట్టిచూస్తే బీసీ, ముస్లింల ఓట్లే గెలుపును నిర్ణయిస్తుంది. వీటి తర్వాత రెడ్డి, కమ్మ, ఎస్టీ, ఇతర సామాజికవర్గాల ఓట్లున్నాయి. ఒకవేళ సామాజికవర్గాల పరంగా ఓట్లలో చీలికవస్తే బీసీ ఓట్లు నవీన్ కు, రెడ్డి ఓట్లు లంకలకు, కమ్మ ఓట్లు మాగంటికి పోలవుతాయా అనే సందేహాలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుత బీసీవాదన కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు ఎంతవరకు సహకరిస్తుందో చూడాలి.

## నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా.. కవిత సంచలన ప్రకటన




హైదరాబాద్ : జాగృతి జనం బాట పేరుతో కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నాడు యాత్రపై మీడియాతో కవిత మీట్లాడుతూ.. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని.. ప్రతి జిల్లాల్లో రెండు రోజులు ఉంటామన్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని వర్గాల ప్రజలతో కలిసి మాట్లాడతామని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం ఏం చేయాలనే విషయాలను ప్రజల నుండే తెలుసుకుంటామన్నారు. సామాజిక తెలంగాణ అంటే నినాదం కాదు విధానమని వివరించారు. తాము ఉన్నన్ని రోజులు సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే గురువులన్నారు. పెద్ద పెద్ద నాయకులను కూడా ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారని గుర్తుచేశారు. ప్రజల దగ్గరికి వెళ్ళి సమస్యలు తెలుసుకుంటామని కవిత అన్నారు.

**అది కరెక్ట్ కాదు...** కేసీఆర్ ఫోటో లేకుండానే యాత్ర చేస్తామన్నారు కవిత. కేసీఆర్ లేకుండా తెలంగాణ రాలేదని.. అయితే కేసీఆర్ ఫోటో పెట్టుకుంటే నైతికంగా కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు. ‘నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా’ అని అన్నారు కవిత. జాగృతి పెట్టినప్పుడు కూడా కేసీఆర్ ఫోటో పెట్టలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాగృతి పెట్టినప్పుడు జయశంకర్ ఫోటో పెట్టామన్నారు.

కేసీఆర్‌కు పుట్టడం తన అదృష్టమని.. ‘మా దారులు వేరే అయినప్పుడు నా లైన్ నేను తీసుకోవడం కరెక్ట్’ అని అన్నారు. కేసీఆర్ ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారని.. ఆ పార్టీ నుండి తనను సస్పెండ్ చేశారని తెలిపారు. నైతికంగా కరెక్ట్ కాదనే కేసీఆర్ ఫోటో తీసేస్తున్నట్లు వెల్లడించారు. దుర్మార్గుల నుంచి చెట్టును కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశానని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

**కుట్రతో బయటకు పంపారు...** జాగృతి మొదటి నుంచి స్వతంత్రంగా పని చేసిందని.. కేసీఆర్ నుంచి ఒక్క ఆలోచన తీసుకోలేదన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత పార్టీతో జాగృతి అనుసంధానంగా పని చేసిందని వివరించారు. తన సస్పెన్షన్‌కు కారణాలను విశ్లేషించుకున్నానని తెలిపారు. పేగులు తెగేదాక తెలంగాణ కోసం కొట్లాడానని అన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నామని.. సామాజిక తెలంగాణ సాధించుకోలేకపోయామని వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం మాట్లాడడం తప్పా అని ప్రశ్నించారు. ఏదో తప్పు మాట్లాడినట్టు చూపించి కుట్ర చేసి బయటకి పంపారని మండిపడ్డారు.

**ప్రభుత్వంపై విమర్శలు..** ఈ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్న రంగం లేదన్నారు. అనేక సమస్యలు తెలంగాణను పట్టి పీడిస్తున్నాయన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారాన్ని పక్కన పెట్టి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్క రూపాయి కూడా తేలేకపోతున్నారని విమర్శించారు. పది సంవత్సరాల్లో తెచ్చిన ఫలితాలు ఇప్పుడు అందడం లేదని కవిత వ్యాఖ్యలు చేశారు.

**రాజీనామాపై...** ‘పార్టీ వద్దనుకున్నాక పదవి ఎందుకు. చాలా క్లారిటీతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశా. రాజీనామా చేసిన తర్వాత కూడా ఆమోదించడం లేదు. రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ రాజకీయం ఏంటో? పార్టీ పెట్టాలో లేదో ఇప్పటికీ క్లారిటీ లేదు. ప్రజలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాను. ప్రజలే గురువులు. కాబట్టి ఏం చేయాలో వారినే అడుగుతా. కేసీఆర్‌కు మచ్చ రాకుండా ఉండాలనే ప్రయత్నం చేశాను. కానీ నన్ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దారులు వేసినప్పుడు ధైర్యం ఉండాలి. బనకచర్ల, గోదావరి జలాలు లాంటి అన్ని అంశాలను మాట్లాడుతాం. యూరియా నుండి బస్సుల దాకా అన్ని రంగాల్లో సమస్యలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ చిన్న విషయం. ఉపఎన్నికతో జాగృతికి సంబంధం లేదు’ అని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

**యాత్ర పోస్టర్ విడుదల...** జాగృతి జనం బాట పోస్టర్‌ను కవిత విడుదల చేశారు. పోస్టర్‌పై తెలంగాణ తల్లి, జయశంకర్ ఫోటోలు ఉన్నాయి. కేసీఆర్ ఫోటో లేకుండానే కవిత పోస్టర్‌ను విడుదల చేశారు. అంతేకాకుండా కేసీఆర్ ఫోటో తీసేయడానికి కారణాలు కూడా కవిత మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు.




## అభివృద్ధి పాలనకు, అరాచక పాలనకు జరుగుతున్న ఉపఎన్నిక: కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణలో మరోసారి గులాబీ పార్టీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కాబోతున్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ స్పష్టం చేశారు. తమ అభ్యర్థి మాగంటి సునీతకు అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల మద్దతు, అండతో తమ పార్టీ అభ్యర్థి సునీత ఘన విజయం సాధించబోతున్నదని వ్యాఖ్యానించారు. రెండు సంవత్సరాల ఈ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రతి ఒక్కరూ మాగంటి సునీతకు మద్దతు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీల మధ్యలో జరుగుతున్న ఎన్నిక కాదని.. ఈ ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల ఎన్నిక కాదని చెప్పారు. ఈ ఎన్నిక పదేండ్ల అభివృద్ధి పాలనకి.. రెండు సంవత్సరాల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఉపఎన్నిక అని పేర్కొన్నారు. పదేండ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్‌కు వెళ్ళేముందు ఈ మేరకు బుధవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈమె గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. లక్షల మంది రైతన్నలు సునీత గెలుస్తుందని ఆశిస్తున్నారని అభిప్రాయపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎన్నికలో కాంగ్రెస్ ను ఓడించేందుకు చూస్తున్నారని విమర్శించారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు చూస్తున్నారని అన్నారు. మూతపడుతున్న బస్తీ దవాఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విషయాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ హైదరాబాద్‌లో నిర్మించిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తున్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని అభిప్రాయపడ్డారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, ఈ అంశంలో గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ రాజకీయ పార్టీలకు

# ఎన్నికల సంఘం దిమ్మతిరిగే షాక్!

## ఎన్నికల నియమావళి కట్టుదిట్టం!




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం హోరా హోరీగా పోరు కొనసాగుతుంది. జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో అన్ని రాజకీయ పార్టీలు అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తూ తమ పార్టీని ఆదరించాలని ఎవరికివారు ప్రజలను విజ్ఞప్తి చేస్తున్నారు. తమదైన పందాలో ప్రత్యర్థి పార్టీల పైన విరుచుకుపడుతున్నారు.

**ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు...** సోషల్ మీడియా వేదికగా ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్న క్రమంలో ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియాను ప్రధాన వాహికగా వాడుతున్నారు.

ఒక జూబ్లీహిల్స్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కాకుండా, బీహార్, జమ్మూ కాశ్మీర్ తో పాటు ఐదు రాష్ట్రాలలోని ఎనిమిది సెగ్మెంట్లలో ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

**ప్రతి ప్రకటనకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి....** ఎన్నికలు జరిగే ప్రతి చోట ఎన్నికల ప్రచారంలో పారదర్శకతను పెంచే విధంగా చర్యలు తీసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, సోషల్ మీడియా, వెబ్సైట్లు, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇచ్చే ప్రతి ప్రకటనకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రకటనల కంటెంట్ ను పరిశీలించి అనుమతులు ఇచ్చేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.

**ఎన్నికలు ముగిసిన 75 రోజులలోగా సమర్పించాలి...** ఈ కమిటీల నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత పార్టీలు, అభ్యర్థులు తమ ప్రకటనలను ప్రసారం చేయవలసి ఉంటుంది. నిబంధన కేవలం ప్రకటనలకే పరిమితం కాదు. నామినేషన్ దాఖలు చేసే సమయంలోనే అభ్యర్థులు, పార్టీలు తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాలు, అంతేకాకుండా ప్రకటనల రూపకల్పన కోసం ఆయన ఖర్చుతో సహా ప్రచారానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను ఎన్నికలు ముగిసిన 75 రోజులలోగా సమర్పించాలని పేర్కొంది.

**పెయిడ్ న్యూస్ అని అనుమానం వస్తే కఠిన చర్యలు...** డిజిటల్ ప్రచారం పైన పూర్తి నియంత్రణను తీసుకురావాలని ఎన్నికల సంఘం భావిస్తున్న క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ మీడియా మాధ్యమాలలో వచ్చే వార్తలను MCMC బృందాలు నిశితంగా గమనిస్తాయని, పెయిడ్ న్యూస్ అని అనుమానం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరికలు జారీ చేసింది.




హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న BRS ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా మాగంటి సునీత నామినేషన్ దాఖలు చేశారు.

షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఆమె నామపత్రాలు సమర్పించారు. ఆమె వెంట పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, నేతలు, కార్యకర్తలు ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు భారత రాష్ట్ర సమితి బీఫామ్ ఇచ్చింది. నవంబర్ 11న పోలింగ్, 14న కౌంటింగ్ ఉండనుంది.

## కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ సమీక్ష.. ధాన్యం కొనుగోళ్లపై దిశా నిర్దేశం




హైదరాబాద్: సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్ టైం రికార్డ్ సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ వానాకాలంలో రికార్డ్ స్థాయిలో 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. అధిక దిగుబడి, అధిక కొనుగోళ్ల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలులో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకార్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న రవాణా వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రైతులు ఎక్కడ కుడా నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన అంశంలో అత్యవసరం అనుకుంటే అదనపు ఖర్చులకు వెనకాడ వద్దని వివరించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సత్వరమే నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. నమోదు అయిన కొనుగోళ్లకు 48 గంటలలో చెల్లింపులు జరగాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు అందరూ.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ముందుకు వెళ్లాలని సూచించారు. మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపులకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

## బీసీ సమాజాన్ని మోసం చేస్తున్నారు.. కిషన్ రెడ్డిపై రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు




హైదరాబాద్: తాజాగా మరోసారి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం. తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడల్లా లేదా ప్రముఖ నాయకుడు వచ్చినప్పుడల్లా, భవిష్యత్తులో ఒక బీసీ తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అంటారు. తెలంగాణలో చిన్న ఎన్నికల గాని పెద్ద ఎన్నికల గాని వస్తే బీసీలనే మర్చిపోతారు.' అని రాజాసింగ్ ఆరోపించారు. 'బీసీలు మన తెలంగాణ భారతీయ జనతా పార్టీ లోపట ఎక్కడున్నారో కొద్ది చెప్తారా కిషన్ రెడ్డి. నేను ఇంతకు ముందు ఎప్పుడూ ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు లేదా ఓబీసీల గురించి మాట్లాడలేదు. నేను హిందూత్వం గురించి మాత్రమే మాట్లాడుతాను. కానీ నేను ఈరోజు దాని గురించి మాట్లాడటానికి కారణం మీరు ప్రతి ఎన్నికల్లో బీసీ కార్డును ప్లే చేసి, బీసీ సమాజానికి మీరు మోసం చేస్తారు. అందుకే నేను ఈరోజు చెప్పాల్సి వచ్చింది.' అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ మరోసారి తన మాటల తూటాలను వదిలారు. అయితే తాజాగా నిన్న(మంగళవారం) కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపణలు చేశారు. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిజీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీరు ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారు? జూబ్లీ హిల్స్ ప్రజలు మిమ్మల్ని అడుగుతున్నారు. బీఆర్ఎసను గెలిపిస్తారా? కాంగ్రెస్‌ను గెలిపిస్తారా..? అని సోషల్ మీడియాలో మిమ్మల్ని జనాలు అడుగుతున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. మీ గౌరవం ప్రమాదంలో ఉందా ?' అని రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు.

## మంత్రుల మధ్య వివాదాలు లేవు: శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబరు15 : మంత్రుల మధ్య వివాదాలపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రుల మధ్య వివాదాలు లేవని స్పష్టం చేశారు. తాను సీన్సియర్ కాంగ్రెస్ వాదినని చెప్పుకొచ్చారు. తనకి నీచ రాజకీయం చేసే శక్తి లేదు.. యుక్తి అంతకన్న లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

తాను పార్టీని నమ్ముకొని ఉన్నానని క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఇవాళ(బుధవారం) మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. పార్టీని నమ్మకోకుండా అటు ఇటు పోయే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు. తాను పార్టీని బలోపేతం చేసే వ్యక్తినని చెప్పుకొచ్చారు. దేశంలో ఓట్ల చోరీ జరిగిందని చెప్పిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిపోతామనే బీఆర్ఎస్ నేతలు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా తయారు చేసిందే గత బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రామరాజ్యమని.. ప్రజలందరూ రామరాజ్యాన్ని కోరుకుంటున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.




## రాజేంద్రనగర్‌లో ఆక్రమణలు తొలగించిన హైడ్రా.. రూ.139 కోట్ల భూమికి విముక్తి!

రాజేంద్రనగర్: హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ పరిధిలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బద్వేల్–ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లో కబ్జాకు గురైన 4 పార్కులకు విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ 1, 2 హుడా అప్రూవల్ పేరుతో ఏర్పాటు చేసిన లేఔట్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జా జరిగినట్లు నిర్ధరించారు. ఈ క్రమంలో బుధవారం ఆక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ప్రహరీలు నిర్మించుకుని వేసిన షెడ్‌లు, రూమ్‌లను తొలగించారు. అనంతరం ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టారు.

## మాగంటి సునీతని అవమానిస్తారా.. మంత్రులపై హరీశ్‌రావు ధ్వజం




హైదరాబాద్, అక్టోబరు 15 : భర్తను కోల్పోయి దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్ చనిపోయారని... ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్‌కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు హరీశ్‌రావు.

**చిల్లర రాజకీయాలు చేస్తున్నారు..** భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు.

మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు. ఇవాళ (బుధవారం) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి నేతలు భారీగా చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసింది అనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావు.

**పేదల ఇళ్లు కూలగొడుతున్నారు..** కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి..?.. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ..? అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదు..? అని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని... జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు హరీశ్‌రావు.

## సామాజిక చైతన్యం కోసమే 'జాగృతి జనం బాట': కవిత



హైదరాబాద్: సామాజిక చైతన్యం కోసమే 'జాగృతి జనం బాట' యాత్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. హైదరాబాద్‌లో యాత్ర పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. పోస్టర్‌పై తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దారులు వేరైనప్పుడు కేసీఆర్ ఫొటో వాడటం సరికాదని భావించినట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే బాగుంటుందనే అనేక మంది ప్రాణత్యాగం చేశారన్నారు. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చాలా తెలివైన వాళ్లని.. వారికన్నీ తెలుసని చెప్పారు. యువత, మహిళలను మరింత చైతన్యవంతులను చేస్తామన్నారు.





ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. తాజా రౌండ్‌లో హెచ్‌ఆర్ (మానవ వనరుల విభాగం)లో 15 శాతం సిబ్బందిని తగ్గించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ విషయాన్ని ఫార్చ్యూన్ పత్రిక తన కథనంలో వెల్లడించింది. ఆ కథనం ప్రకారం.. అమెజాన్ తాజా లేఆఫ్‌లు దాని హెచ్‌ఆర్ యూనిట్‌లో అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కోతలు మరిన్ని విభాగాల్లోని ఉద్యోగులపై కూడా ప్రభావం చూపనుంది. ఈ లేఆఫ్‌లు ఎప్పటినుంచి ఉంటాయి, దీని ప్రభావం ఎంతమందిపై ఉంటుంది అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెజాన్ ప్రతినిధి కెల్లీ నాంటెల్ తాజా కోతలపై స్పందించేందుకు నిరాకరించారు. కృత్రిమమేధను అందిపుచ్చుకోవడంతో పాటు క్లౌడ్ కార్యకలాపాలకు అమెజాన్ బిలియన్లు కుమ్మరిస్తుంది. ఈ ఏడాది మూలధన పెట్టుబడుల్లో భాగంగా 100 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేయాలని నిర్ణయించుకుంది. దానిలో ఎక్కువ భాగం తరువాతి తరం డేటా సెంటర్‌లను నిర్మించేందుకు కేటాయించింది.

**టాటా మోటార్స్ షేరు నిజంగానే 40% తగ్గిందా?...** అమెజాన్ సీఈవో యాండీ జెస్సీ(%ూఅఎఎ జీుంంఎ%) బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి లేఆఫ్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది. కంపెనీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా అనేకమందిని ఇంటికి పంపుతున్నారు. 2022-23లో ఏకంగా 27 వేల మంది ఉద్యోగులను ఈ సంస్థ తొలగించింది. ప్రస్తుతం ఉన్నది ఏఐ శకం అని జెస్సీ పలుమార్లు పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా కొనుగోలుదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఏఐను విస్తృతం చేయడం ద్వారా.. ఉద్యోగులను కోల్పోవాల్సి ఉంటుందనే విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఇదిలాఉండగా.. అమెజాన్ ఓవైపు ఉద్యోగ కోతలు ప్రకటిస్తూనే.. మరోవైపు సీజనల్ ఉద్యోగుల నియామకాలకు సన్నాహాలు చేస్తోంది. పండుగ సీజన్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని యూఎస్ గిడ్డంగులు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లో 2,50,000 మంది సీజనల్ ఉద్యోగుల నియామకానికి సంబంధించిన ప్రణాళికలను కంపెనీ ప్రకటించింది.




**హైదరాబాద్, అక్టోబరు15 : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకి అరుదైన గౌరవం దక్కింది. మెల్‌బోర్న్‌లో ఆస్‌బయోటెక్ ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌లో కీలకోపన్యాసం చేయనున్నారు మంత్రి శ్రీధర్‌బాబు. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మేక్‌గీచీ నుంచి ఆయనకి ప్రత్యేకంగా ఆహ్వానం అందింది. దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్‌బాబు కావడం గమనార్హం. అయితే, ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆస్‌బయోటెక్ ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్ జరుగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన డెవలప్‌మెంట్ గురించి వివరించనున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కల్పించిన అవకాశాలను తెలపనున్నారు.**




అమరావతి, అక్టోబర్ 15: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం నాడు కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఖరారైంది. అధికారిక సమాచారం ప్రకారం.. ప్రధాని మోదీ గురువారం ఉదయం 10 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంట వెళ్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ ఫ్రెషప్ అయి.. ఉదయం 11.15 గంటలకు శ్రీ భమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుంటారు. స్వామివార్ల దర్శనం అనంతరం మధ్యాహ్నం 12.10 గంటలకు శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని ప్రధాని సందర్శిస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత ప్రధాని మోదీ మళ్లీ సున్నిపెంటకు చేరుకుంటారు. అటునుంచి హెలికాప్టర్‌లో నన్నూరు రాగ మయూరి గ్రీన్ హిల్స్ ఎలిప్యాడ్ వద్దకు వెళ్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత మధ్యాహ్నం 3 గంటలకు అక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. ఈ సభ అనంతరం 4.50 నిమిషాలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు వెళ్లి.. అక్కడి నుంచి ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు.

## ప్రధాని మోదీ పర్యటనపై రవాణాశాఖ అధికారులతో మంత్రుల సమీక్ష



కర్నూలు: ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లపై ఏపీ మంత్రులు సమీక్షించారు. కర్నూలులోని ఓ ప్రైవేటు హోటల్‌లో రవాణాశాఖ అధికారులతో మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమావేశమయ్యారు. బస్సుల ఫిట్‌నెస్, సభా ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాట్లు, సభకు భారీగా తరలివచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా పికప్, డ్రాపింగ్ వంటి అంశాలపై దృష్టిసారించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా సకాలంలో సభావేదికకు బస్సులు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, కర్నూలు రీజినల్ ఆర్టీసీ ఛైర్మన్ నాగరాజు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పదేళ్లలో ఏపీ రూపురేఖలు మారిపోతాయ్: మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ, అక్టోబర్ 15: ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 16 సీట్లు టీడీపీకి పట్టం కట్టారని.. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అంతా కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలతో పాటు, ఏపీలోనూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌కు విశాఖ వేదిక కావడం గొప్ప విషయమని.. అమెరికా తర్వాత ఏపీకే ఈ డేటా సెంటర్ రాబోతుందని తెలిపారు. సముద్ర గర్భం ద్వారా కేబుల్ వేసి, ప్రపంచం మొత్తం లింక్ చేయబోతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి వల్ల తెలుగు వాడి ప్రతిష్ట విశ్వ వ్యాప్తం అవుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐటీ విప్లవం తీసుకు వచ్చినప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారని గుర్తుచేశారు. ఇరవై ఏళ్లల్లో హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో అందరూ చూశారన్నారు. ఇప్పుడు పదేళ్లల్లో ఏపీ స్వరూపం మొత్తం మారిపోతుందని తెలిపారు. రాయలసీమలోని అనేక ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటుకు అనేక మంది ముందుకు వస్తున్నారన్నారు. చంద్రబాబు సారథ్యంలో అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తుంటే... ఏపీకి పెట్టుబడులు పెట్టడం జగన్‌కు నచ్చడం లేదని విమర్శించారు. అందుకే



వారి పార్టీల నాయకులతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కోడి గుడ్డు పెట్టాలి, పొదగాలి అన్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు అసలు మాట్లాడే అర్హత ఉందా అని అన్నారు. నవంబర్ 15న ఇన్వెస్ట్‌మెంట్ మీట్ విశాఖలో జరగబోతోందని.. ఆర్థిక రాజధానిగా విశాఖ ఆదర్శంగా నిలవబోతుందని అన్నారు మంత్రి. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల సంక్షేమానికి సీఎం పెద్ద పీట వేశారన్నారు. ఇవన్నీ చూడలేక రాష్ట్రంలో అస్థిరిత పరిస్థితిని తీసుకువచ్చేందుకు వైసీపీ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. నకిలీ మద్యం విషయంలో జనార్ధన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ అందరూ చూశారని.. తప్పకుండా త్వరలోనే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.


## ప్రధాని మోదీ ఏపీ పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి: డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

కర్నూలు జిల్లా, అక్టోబరు15 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటనలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. పోలీసు అధికారులు ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటన పై కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇవాళ(బుధవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అడిషనల్ డీజీ ఎన్.మధుసూదన్ రెడ్డి, ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, ఫక్కీరప్ప కాగినెల్లి, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ప్రధాని మోదీ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల ఏర్పాట్లపై డీజీపీ పలు సూచనలు చేశారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రధాని పర్యటనలో



ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా గట్టి చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. సామాన్య ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వీవీఐపీలు వెళ్లేంతవరకు ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

## షర్మిల మతి తప్పి మాట్లాడటం మానుకో.. యామిని శర్మ స్ట్రాంగ్ కౌంటర్



విజయవాడ, అక్టోబరు15 : ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకి బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. షర్మిల మతి తప్పి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. GST 2.0 అనేది గబ్బర్ సింగ్ ట్యాక్స్" కాదని.. గ్రేట్ సిస్టమ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అని అభివర్ణించారు. ఇవాళ(బుధవారం) విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో యామిని శర్మ మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ GST 2.0 భారత్ ఆర్థిక స్వావలంబనకు పునాది అని ఉద్ఘాటించారు. షర్మిల మాట్లాడింది అర్థం లేని రాజకీయ పిచ్చి ప్రచారం మాత్రమేనని ధ్వజమెత్తారు. GST 2.0 సామాన్య ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించి.. చిన్న వ్యాపారాలకు సులభతరం చేస్తూ, రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వాతంత్ర్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ఇవి ఎందుకు కనిపించవని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకి అభివృద్ధి కన్నా అబద్ధాల మీద రాజకీయాలు చేయడం అలవాటని విమర్శించారు. ప్రత్యేక హోదా పేరు చెప్పి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్‌నేనని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్‌కి ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కు లేదని ఫైర్ అయ్యా రు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి హోదాని ఆచరణలో చూపిస్తున్నారని స్పష్టం చేశారు. కర్నూల్‌లో జరుగబోయే GST 2.0 ఉత్సవం కేవలం సభ కాదని .. ఇది రాష్ట్ర ఆర్థిక శక్తి పునరుద్ధరణ వేడుక అని అభివర్ణించారు. ఈ షభలో ప్రజలతో కలిసి ఆర్థిక సంస్కరణల సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు.




అమరావతి: గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చిందని.. ఇప్పుడు గూగుల్ పెట్టుబడులతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు.. ఏఐకి సంబంధించిన అనేక కంపెనీలు విశాఖకు వస్తున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయి. గూగుల్ పెట్టుబడితో లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. సెప్టెంబర్ 2024లో గూగుల్ ప్రతినిధులు విశాఖ వచ్చినప్పుడు వారితో సమావేశమయ్యాను. వారికి డేటా సెంటర్ స్థలాన్ని చూపించాం. ఇది జరిగిన నెల రోజుల్లో యూఎస్ వెళ్లి గూగుల్ క్లౌడ్ నాయకత్వాన్ని కలిశా. నవంబర్‌లో గూగుల్ ప్రతినిధులు సీఎంను కలిశారు. ఇదే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు అనేకసార్లు భేటీ అయ్యారు. అనేక చర్చల తర్వాత ఇంత పెద్ద పెట్టుబడి సాధ్యమైంది. భారీ పెట్టుబడులపై అన్ని చోట్లా చర్చలు జరుగుతున్నాయి.

**అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం...** ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం. అనంతపురం, కర్నూలుకు పంప్డ్ స్టోరేజ్, సిమెంట్ ఫ్యాక్టరీలు వస్తున్నాయి. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. శ్రీసిటీ గ్రేటర్ ఎకోసిస్టమ్‌లో అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. డైకెన్, బ్లూస్టార్, ఎల్జీ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ తీసుకొస్తున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. ఉత్తరాంధ్రలో టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. అన్ని ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. ఎంవోయూలపై సంతకాలు కాదు.. ఆచరణలో చేసి చూపిస్తున్నాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం. ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఛాలెంజ్‌గా తీసుకున్నాం. ఏ ఒక్క కంపెనీ కూడా మన రాష్ట్రం నుంచి వెళ్లే పరిస్థితి రాదు. గత ఐదేళ్లలో ఏపీలో విధ్వంసం జరిగింది. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్నాయి.. ఏపీలో మాత్రం డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ఉంది. దిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం చంద్రబాబు కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది.

**నవంబర్‌లో మరిన్ని శుభవార్తలు...** చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబుతోనే సాధ్యం. ఆనాడు కియా ఏర్పాటుతో చరిత్ర సృష్టించాం. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెడుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అతిపెద్ద విజయం. నవంబర్‌లో మరిన్ని శుభవార్తలు ఉంటాయి. వైకాపా పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. డేటా సెంటర్ అంటే ఏంటో గతంలో పనిచేసిన మంత్రికి తెలుసా? నవంబర్ నుంచి విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు 13 పైసలు తగ్గేలా చర్యలు తీసుకుంటాం" అని నారా లోకేశ్ తెలిపారు.

## గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం.. ఆంధ్రప్రదేశ్‌లో నవశకం: మంత్రి పార్థసారథి

అమరావతి: గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చరిత్రాత్మకమని మంత్రి పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నవశకం ఆరంభమైందని చెప్పారు. ఏపీలో డేటా సెంటర్ రావడం యువతకు ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఇది యువనేత, మంత్రి లోకేశ్ అకుంఠిత దీక్షకు నిదర్శనమని వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లోకేశ్ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎంతోమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధికి అవకాశం లభిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం యువత కలలు నిజం చేయడానికి నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.

**పెద్ద కంపెనీలను జగన్ తరిమేశారు: డీబీవీ స్వామి...** కూటమి పాలనలో భారీ పెట్టుబడులు, దిగ్గజ ఐటీ కంపెనీలు విశాఖ నగరానికి క్యూ కడుతున్నాయని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికమన్నారు. ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి, శ్రమతో విశాఖ నగరం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని వెల్లడించారు. 16 నెలల్లోనే విశాఖకు 6.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఒప్పందాలు, భూకేటాయింపులు పూర్తయిన సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైకాపా హయాంలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. పెద్ద కంపెనీలను విశాఖ నుంచి జగన్ తరిమేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఐదేళ్లలో విశాఖ కేంద్రంగా యువతకు భారీగా ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారని వెల్లడించారు.

**అసలైన వికేంద్రీకరణ సాధకుడు చంద్రబాబు: ఎమ్మెల్సీ పంచుమర్తి...** ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి వల్లే రాష్ట్రానికి గూగుల్ క్లౌడ్ వచ్చిందని, ఇది చరిత్రాత్మక విజయమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. గూగుల్ సంస్థ రాష్ట్రానికి రావడంతో లక్షకు పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయన్నారు.

చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీకి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, 'స్వర్ణాంధ్ర 2047'కు గూగుల్ క్లౌడ్ ఓ మైలురాయి అని అభివర్ణించారు. తండ్రి మైక్రోసాఫ్ట్, తనయుడు గూగుల్ సంస్థను తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అసలైన వికేంద్రీకరణ సాధకుడు చంద్రబాబు అని కొనియాడారు.

## కలాం అణు, శాస్త్ర సాంకేతిక రంగాలకు సరికొత్త దిశను చూపారు: సీఎం చంద్రబాబు




అమరావతి: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు ఘన నివాళి అర్పించారు. అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగానే కాకుండా అరుదైన గొప్ప వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. దేశ అణు, శాస్త్ర సాంకేతిక రంగాలకు సరికొత్త దిశను చూపించారని కొనియాడారు. పరిణతి, మానవతా విలువలను సమన్వయం చేసిన అసాధారణ వ్యక్తిత్వం ఆయన సొంతమని పేర్కొన్నారు.

**సామాన్య కుటుంబం నుంచి శాస్త్రవేత్తగా ఎదిగారు: లోకేశ్...** అబ్దుల్ కలాం సామాన్య కుటుంబం నుంచి దేశం గర్వించదగిన శాస్త్రవేత్తగా ఎదిగారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తి గడించారని పేర్కొన్నారు.

రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చారని.. తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తి నింపారన్నారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన అబ్దుల్ కలాం సేవలను స్మరించుకోవాలన్నారు.

## చెవిరెడ్డి బెయిల్‌పై విచారణ.. సుప్రీం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: మద్యం కేసు వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్‌పై సుప్రీంకోర్టు క్లారిఫికేషన్ ఇచ్చింది. మద్యం కేసులో మిగతా నిందితులతో సంబంధం లేకుండా వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్‌పై నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకునేంత వరకు ట్రయల్ కోర్టు మిగతా వారి బె యిల్ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. దీంతో హైకోర్టు నిర్ణయంపై సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కరరెడ్డి సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఆ క్రమంలో చెవిరెడ్డి బెయిల్ పై విచారించి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.




## మొలకలచెరువు నకిలీ మద్యం కేసులో మరో కీలక పరిణామం



చిత్తూరు, అక్టోబరు15 : మొలకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసు లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అరెస్టై మదనపల్లి జైల్లో రిమాండ్‌లో ఉన్న పదిమంది నిందితులను ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి అనుమతించింది తంబళ్లపల్లి కోర్టు. అయితే, మూడు రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కోర్టు అనుమతితో రేపు(గురువారం) ఉదయం తమ కస్టడీలోకి తీసుకోనున్నారు ఎక్సైజ్ పోలీసులు. కాగా, నకిలీ మద్యం తయారీ కేసులో పదిమంది నిందితులని ఈనెల 5వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. వీరిని సమగ్ర విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని వారం రోజులకు ముందే తంబళ్లపల్లె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు ఎక్సైజ్ పోలీసులు. ఇవాళ(బుధవారం) విచారణ అనంతరం మూడు రోజుల కస్టడీకి అనుమతించింది న్యాయస్థానం. ఇప్పటివరకు మొత్తం 23 మందిపై కేసు నమోదు చేయగా.. 15 మంది నిందితులని అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ కేసులో మరో 8 మంది నిందితులు అరెస్ట్ కావాల్సి ఉంది.

# చురకలు సంపాదకీయం

## ఆఫ్ఘనిస్తాన్‌తో దోస్తీ వెనుక వ్యూహమేంటి? భారత్ పర్యటన వెనుక రాజకీయం!

ఇన్నాళ్లుగా పాకిస్తాన్‌కు మిత్రదేశంగా ఉన్న ఆఫ్ఘనిస్తాన్ ఇప్పుడు తన వైఖరి మార్చుకోవడం, భారత్‌తో బంధం బలోపేతం చేసుకోవడానికి ఆసక్తి చూపడం ఆసియా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఇటీవల తాలిబన్ విదేశాంగ మంత్రి భారత్ పర్యటన "భారత్ అంటే ప్రాణం ఇస్తాం" అంటూ తాలిబన్ వర్గాలు చేసిన ప్రకటనలు రెండు దేశాల సంబంధాలపై కొత్త ఊహాగానాలకు తెరలేపాయి. ఇది కేవలం మైత్రా? లేక సుదీర్ఘ వ్యూహాత్మక ఎత్తుగడలో భాగమా? అనేది చర్చనీయాంశంగా మారింది.

**భారత్ పెట్టుబడుల రక్షణే కీలకం!...** గత రెండు దశాబ్దాల్లో భారత్ ఆఫ్ఘనిస్తాన్‌లో సుమారు $3 బిలియన్లకు పైగా భారీగా పెట్టుబడులు పెట్టింది. మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, నీటి వనరుల అభివృద్ధి వంటి రంగాలకు భారత్ అండగా నిలిచింది. సల్మా డ్యామ్, జారంజ్–డెలారమ్ హైవే, ఆఫ్ఘాన్ పార్లమెంట్ భవనం వంటి కీలక ప్రాజెక్టులు ఆఫ్ఘాన్ నిర్మాణంలో భారత్ పాత్రను చాటుతున్నాయి. తాలిబన్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, ఈ భారీ పెట్టుబడుల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో తాలిబన్‌తో కనీస అవగాహన కుదుర్చుకోకపోతే ఈ పెట్టుబడులు, నిర్మాణాలు వృథా అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే, ఈ పెట్టుబడులను రక్షించుకోవడం భారత్‌కు తక్షణ ప్రాధాన్యతగా ఉంది.

**తాలిబన్ వైఖరిలో మార్పుకు కారణాలేంటి?...** సాంప్రదాయకంగా భారత్‌పై శత్రుత్వ ధోరణిలో ఉన్న తాలిబన్ ఇటీవల తన వైఖరిని మార్చుకోవడం ఆసక్తికరమైన పరిణామం. చైనా, పాకిస్తాన్‌లతో బంధాలను కొనసాగిస్తూనే భారత్‌తో సానుకూల సంభాషణలు జరుపుతోంది. దీని వెనుక రెండు ప్రధాన కారణాలు ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు: ప్రపంచ దేశాల నుంచి, ముఖ్యంగా భారత్ వంటి కీలక ప్రాంతీయ శక్తి నుంచి అంతర్జాతీయ గుర్తింపు పొందాలనే ప్రయత్నం. భారత్ సహకారంతో గతంలో ఆగిపోయిన వాణిజ్య మార్గాలు మరియు అభివృద్ధి ప్రాజెక్టులు తిరిగి ప్రారంభించాలన్న లక్ష్యం. అయితే, తాలిబన్ వైఖరిలో ఈ మార్పు నిజంగా అంతర్గత మార్పా? లేక కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం తాత్కాలికంగా అనుసరిస్తున్న దౌత్య వ్యూహమా? అన్నది కాలమే నిర్ణయించాలి.

**భారత్‌కు దొరికే వ్యూహాత్మక అవకాశాలు...** తాలిబన్‌తో సంబంధాలను మెరుగుపడటం భారత్‌కు అనేక వ్యూహాత్మక లాభాలను అందించే అవకాశం ఉంది. ఆఫ్ఘనిస్తాన్‌లోని తన కీలక ప్రాజెక్టులను కాపాడుకోవడం. మధ్య ఆసియా దేశాలతో వాణిజ్యాన్ని విస్తరించడానికి కీలకమైన ఆఫ్ఘనిస్తాన్ మార్గాన్ని తిరిగి ఉపయోగించుకునే అవకాశం.

**ఉగ్రవాద నియంత్రణ...** ఆఫ్ఘాన్‌ను భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలకు వేదికగా ఉపయోగించకుండా నిరోధించే దౌత్యపరమైన అవకాశం. అయితే, ఈ దౌత్యంలో భారత్ మానవ హక్కులు, మహిళా స్వేచ్ఛ, విద్య వంటి అంశాలపై తన చిత్తశుద్ధిని, నిబద్ధతను కొనసాగించాల్సిన బాధ్యత ఉంది.

**ఆసియా శక్తిగా భారత్ పాత్ర బలోపేతం...** తాలిబన్‌తో భారత్ సంభాషణ ప్రారంభించడం, ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్‌లో చైనా–పాకిస్తాన్ కూటమి ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన వ్యూహాత్మక అడుగు కావొచ్చు. అలాగే, రష్యా, ఇరాన్, మధ్య ఆసియా దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, ప్రాంతీయ రాజకీయాల్లో భారత్ తన స్థానం మరింత బలోపేతం చేసుకోవచ్చు.

ఆఫ్ఘాన్‌తో మైత్రి కేవలం ఒక దౌత్యపరమైన సంకేతం మాత్రమే కాదు. ఇది ఆసియా భౌగోళిక రాజకీయాల్లో భారత్ తన వ్యూహాత్మక స్థిరత్వాన్ని, ప్రాంతీయ శక్తిగా తన ప్రాభావాన్ని నిర్ధారించుకునే కీలక ప్రయత్నం. అయితే, వ్యూహాత్మక ప్రయోజనాలు, మానవ విలువల మధ్య సమతుల్యం సాధించడమే ప్రస్తుతం భారత విదేశాంగానికి అత్యంత క్లిష్టమైన పరీక్షగా మారింది.


## తెలుగు సాహిత్యంపై తెన్నేటి చెరగని సంతకం - అక్టోబర్ 16...తెన్నేటి సూరి వర్ధంతి



తెలుగులో ప్రముఖ కవులు, రచయితలలో ఒకరు తెన్నేటి సూరి. అభ్యుదయ కవి. నవలాకారుడు, అనువాదకుడు. తన భావజాలాన్ని ఆవిష్కరించడానికి ఆయన... కధ, వ్యాసం, కవిత, గేయం, నాటకం, నవల, అన్ని సాహిత్య ప్రక్రియలను ప్రజల గుండె తలుపులను తట్టే సాధనాలుగా వాడుకున్నాడాయన. అలనాటి మేటి పత్రికలు భారతి, ఆంధ్ర పత్రికల సహాయ సంపాదకునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన సాహితీ క్షేత్రం సుసంపన్నం చేయ గలిగిగారు. తెన్నేటి సూరి పేరుతో మొట్టమొదట స్ఫురించేది ఆయన చారిత్రక నవల...ఛంఘిజ్‌ఖాన్. 12, 13 శతాబ్దాలలో మంగోల్‌లో జన్మస్థలంగా, ఎడారిలో ఒక మహా సామ్రాజ్యాన్నే నిర్మించిన విజేత చంఘిజ్‌ఖాన్. అది కత్తి మీద సాములాంటి రచనలో చరిత్రలో జరిగిన సంఘటనలను వక్రీకరించకుండా, హెన్రీ హౌవర్త్ దంపతులు రచించిన మంగోల్ చరిత్రను ఆధారంగా చేసుకొని, లోతుగా అధ్యయనం చేసి, చేయి తిరిగిన నవలాకారునిగా అద్భుత రచనతనదైన శైలిలో రచించారు. ఆ ప్రచురణ విశేష ప్రజాదరణ పొందింది. తెన్నేటి సూరి చెంఘిజ్ ఖాన్ తొలిగా ఆంధ్రపత్రిక, 1950 సెప్టెంబరు నుంచి ధారావాహికంగా ప్రచురింప బడింది. సెప్టెంబరు 1998) రేడియో నాటకంగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుసరించి ప్రసారం చేశారు. ఆంధ్ర పత్రికలో ఆయన వ్రాసిన ధారావాహికను నవలా రూపంలో విశాలాంధ్ర వారు ప్రచురించగా, 1956 లో ప్రచురించబడిన ఒక నవల ఎనిమిది పునర్ముద్రణలు జరుపుకోవడం రచయిత గొప్పతనమే. తెన్నేటి సూరి (1911 - 1958 అక్టోబరు 16) తెలుగు రచయిత. అభ్యుదయ కవి, కథారచయిత, నాటకకర్త. ఛంఘిజ్ ఖాన్ నవలా రచయితగా సుప్రసిద్ధుడు. భారతి, ఆంధ్ర పత్రికలలో 1945-1957లలో పత్రికా రచయితగా పనిచేశాడు. సూరి 1911లో కృష్ణా జిల్లా తెన్నేరులో వెంకట లక్ష్మమ్మ, తండ్రి తిరుమలరావు దంపతులకు జన్మించాడు. పుట్టిన ఊళ్లోనే ప్రాథమిక విద్య పూర్తిచేసి, పై చదువులకి బందరు వెళ్లాడు. అక్కడే సాహిత్య రచనా వ్యాసంగానికి అంకురార్పణ జరిగింది. కొందరు పత్రికాధిపతులతో పరిచయం ఏర్పడింది. వారి మద్దతుతో ఓ ప్రెస్ లో ఉగ్యోగం లభించింది. 1940 దశకంలో స్వాంతంత్ర ఉద్యమం వువ్వెత్తున ఎగసిపడుతున్న సమయంలో , తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనలో, భుస్వామ్య వ్యవస్థలో, అణచివేతల నేపథ్యంలో చెలరేగిన రైతాంగ పోరాటం చోటు చేసుకున్న తరుణంలో , తన సొంత ఇంట్లో అందరూ కాంగ్రెస్ వాదులుగానే ఉన్నా, నిరంకుశత్వం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝుళిపించడం తక్షణ కర్తవ్యమని భావించారయన. ఇతర పత్రికల రచనలకు భిన్నంగా, తమ కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా రచన ప్రారంభించాడు. తాను పని చేసే ప్రెస్సే ఒక సాహిత్య వేదికగా, ఒక చర్చా వేదికగా మలుచు కున్నారు. ప్రెస్ లో పని చేస్తూనే ఆయా పత్రికలకి వ్యాసాలు రాయడం మొదలు పెట్టాడు. పనిచేసే ప్రెస్సే సాహిత్య వేదికగా, కార్మిక కర్షక కూడలిగా మారింది. మహిళా చైతనం కోసం పాటలు రాసాడు. ఫాసిజాన్ని ఖండించాడు. పిల్లల కోసం వారి బాణీల్లో పాటలు, బాల గేయాల రాసేవాడు. "గొడ్లకాడ" అనే నాటకం కూడా రాసి ప్రదర్శించాడు. తెలంగాణ రైతాంగ పోరాటం గురించి ఆంధ్ర ప్రాంతంలో సానుభూతి సంపాదించడం కోసం పాటలు రాసాడు. పని చేస్తున్న ప్రెస్సు మూత పడ్డాక ఆంధ్రపత్రికలో చేరాడు. రచయితగా మన్ననలను పొందాడు. ఆంధ్ర పత్రిక సారస్వతాను బంధం సంపాదక బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహించాడు. ప్రజానాట్య మండలికి ఎన్నో పాటలు రాసి వారికి అందించగా, సూరి రాసిన పాటల్ని బుర్రకథల్లో, ఇతర ప్రదర్శన కళారూపాల్లో ఉపయోగించి, కళాకారులు ఎన్నో పాటలు, కళారూపాల ద్వారా ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేశారు. సూరి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఎంతో ప్రభావితుడయ్యాడు. కలంతోనే కాకుండా గళంతో పాడే పాటల రచయితగా తెలంగాణ పోరాటానికి నోటి పాటలను కంపోజ్ చేసేవాడు. ఆంధ్ర పత్రిక నైజాంలోకి ప్రవేశించేది కాదు. కానీ నోటి పాటలు నిరాఘాటంగా వెళ్ళి వ్యాప్తి పొందేవి. ఆయన పాటలు ప్రజల నోళ్ళలో చిరకాలం నిలిచాయి. సూరి 1958, అక్టోబరు 16న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన పాడిన పాటలు, కూర్చిన బాణీలు నిత్య ఆయన్ని సజీవంగా ఉంచాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## మిస్టర్ ఆసియా బిరుదు పొందిన తొలి తెలుగు వాడు దండమూడి - అక్టోబర్ 16...దండమూడి రాజగోపాలరావు జయంతి

దండమూడి రాజగోపాలరావు (అక్టోబరు 16, 1916 – ఆగష్టు 6, 1981) భారత దేశ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు. అసమాన బలశాలి, అసాధారణ శక్తి సంపన్నుడు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఆయన 'ఆంధ్రభీమ, ఇండియన్ టార్జాన్', ఇండియన్ హెర్క్యులస్, జాయింట్ ఆఫ్ ఇండియన్ బిరుదులను పొందారు. శరీర సౌష్టవ పోటీలో మిస్టర్ ఆసియా బిరుదును పొందిన తొలి ఆంధ్రుడే కాక తొలి భారతీయుడు. కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని గండిగుంటలో 1916 అక్టోబర్ 14న రైతు కుటుంబంలో జన్మించిన ఆయన కోడి రామ్మూర్తి నాయుని స్ఫూర్తితో బరువులు ఎత్తడంపై ఆసక్తి కలిగి, పెదపారుపూడి మండలం వాన పాములలో వెయిట్‌లిఫ్టింగ్ సాధన ప్రారంభించారు. 1938లో తొలిసారిగా పోటీల్లో పాల్గొని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ 1940లో మొదటిసారిగా రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా గెలుపొందారు. 1943 లండన్ ఒలింపిక్స్ ఆదిగా ... మూడు పర్యాయాలు దేశం పక్షాన విశ్వ క్రీడలకు ప్రాతినిధ్యం వహించారు. 1945లో జాతీయ స్థాయిలో 320 పౌండ్ల బరువు ఎత్తి విజేతగా నిలిచారు. 1948లో కోల్‌కతా వేదికగా జరిగిన ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని...



'మిస్టర్ ఆసియా'గా గుర్తింపు పొందిన తొలి భారతీయుడు, అదీ తెలుగు వారు కావడం విశేషం. అలా 1948లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో పాల్గొన్న తొలి ఆంధ్రుడుగా నిలిచారు. 1945 నుంచి 1958 వరకు 13 ఏళ్లపాటు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌గా గెలుపొందుతూ వచ్చారు. ఆయన 1951లో ఢిల్లీలో జరిగిన ప్రథమ ఆసియా క్రీడోత్సవాలలో వెయిట్ లిఫ్టింగ్ పురుషుల సూపర్ హెవీ వెయిట్ (౦105 కేజీలు) వర్గములో కాంస్య పతకాన్ని గెలుచు కున్నారు. రాజగోపాలరావు అనేక రాష్ట్రాలు, దేశాలలో ప్రదర్శనలిచ్చారు. తెలుగు రంగస్థల, సినిమా నటుడుగా 1963లో విడుదలైన నర్తనశాల సినిమాలోనూ, 1965లో విడుదలైన వీరాభిమన్యు సినిమాలోనూ, భీముని పాత్ర సమర్థ వంతంగా పోషించారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం వ్యవస్థాపకుడిగా, వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చాలా ఏళ్లపాటు ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. విజయవాడలో సొంతంగా వ్యాయామశాల నెలకొల్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జిమ్‌ల ఏర్పాటుకు కృషి చేశారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో స్థలం విరాళంగా ఇచ్చి... ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కారకులయ్యారు. ఆయన పేరు మీద ఉన్న ఇండోర్ క్రీడా ప్రాంగణానికి "దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం" అని నామకరణం చేశారు. దాన్ని నాట రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ప్రారంభించారు. రాజగోపాలరావు 1981, ఆగష్టు 6న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**


## పోషకాహార లోపం...వ్యాధులకు మూలం - అక్టోబర్ 16... ప్రపంచ ఆహార దినోత్సవం




ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. 1945 అక్టోబర్ 16న ఐరాస ఆహార మరియు వ్యవసాయక సంస్థ స్థాపించ బడింది. అయితే ఈ కార్యక్రమాన్ని మొదటిసారి 1981లో జరుపు కున్నారు. ఈ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే ఆహారాన్ని వృధా చేయరాదు. ప్రజల్లో ఈ విషయంలో చైతన్యం నింపాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 1945 అక్టోబర్ 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ' ను ప్రారంభించారు. ఈ సంస్థను ఆంగ్లంలో %ఖీూూ% అంటారు. అంటే ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్. ఈ సంస్థ గౌరవార్థం ఈ సంస్థ ఏర్పడిన అక్టోబరు 16 తేదిని ప్రపంచ ఆహార దినోత్సవంగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఇదే రోజున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటులోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## వైద్య శాస్త్రంలో అద్భుతం అనస్థీషియా ఆవిష్కరణ - అక్టోబర్ 16... ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి. పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు. అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫ్యూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు. 1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన




తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి. ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి. ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషియాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్దిష్ట ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది. బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను నిరంతరం పర్యవేక్షించడానికి సాయం చేస్తున్నాయి. రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్తీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవిం చి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటిల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

చురకలు



# కిన్నెరసానికి మొసళ్ల బెడద!

పాల్వంచ : మొసళ్ల సంచారంతో కిన్నెరసాని కాల్వ ప్రమాదకరంగా మారింది. గత వారం వ్యవధిలో నాలుగు మొసళ్లు సంచరించి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేశాయి. కరకవాగు సమీపంలో ఓ మొసలి ఒడ్డుకు రావడంతో కుక్కలు చూసి అరిచాయి. స్థానికులు పరిశీలించగా మొసలి కనిపించింది. మనుషులను గమనించిన మొసలి కాల్వలోకి జారుకుంది. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి గమనించినప్పటికీ అది కనిపించలేదు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటం, నీటిరంగు మారడంతో మొసలిని పట్టుకునే అవకాశం లేదని అటవీశాఖ అధికారులు తెలిపారు.

**కాల్వల్లో సంచారంతో బెంబేలు..**

కిన్నెరసానికి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో కేటీపీఎస్ అధికారులు గేట్లు ఎత్తారు. ఆ గేట్ల నుంచి మొసళ్లు బయటకు వస్తున్నాయి. కిన్నెరసాని రిజర్వాయర్ నిర్మాణం అనంతరం డ్యాంకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 1974లో అధికారులు 32 మొసళ్లను వదిలారు. ప్రస్తుతం అవి వందల సంఖ్యకు చేరాయి. గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో బయటకు వస్తున్నాయి. కొన్ని మొసళ్లు నీటిలో కొట్టుకెళ్లి గోదావరిలో కలుస్తుండగా మరికొన్ని ఒడ్డుకు చేరి ఇళ్లల్లోకి వస్తున్నాయి.



ఇటీవల పూసలతండా సమీపంలో ఓ మొసలి నీటిలో కనిపించిందని స్థానికులు భయాందోళన వ్యక్తం చెందుతున్నారు. ఇటీవల ఓ మొసలి కిన్నెరసాని పాఠశాలల సమీపంలో కనిపించింది. కేటీపీఎస్ కాల్వల్లో పెద్ద మొసలి, చిన్న పిల్లలు సైతం తిరుగుతున్నాయి. కేటీపీఎస్ కాల్వ పక్కనున్న కరకవాగు, పూసలతండా తదితర గ్రామాల ప్రజలు కాల్వ నీటిలోనే దుస్తులు శుభ్రం చేసుకుంటారు. కొందరు పిల్లలు ఆ కాల్వలోనే ఈత కొడతారు. రైతులు కాల్వ పక్కనే ఉన్న పొలాల్లో పనులు చేసుకుంటారు. మొసళ్ల సంచారంతో అందరూ భయాందోళనకు గురవుతున్నారు. ఇదేకాక కిన్నెరసాని గురుకుల పాఠశాలల పిల్లలు సైతం బహిర్భూమికి ఆ కాల్వ వద్దకే వెళ్తారు. అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ అంశంపై అటవీశాఖ అధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటంతో మొసళ్లు కనిపించట్లేదని తెలిపారు. ఒడ్డున కనిపిస్తే వాటిని బెదరకొట్టకుండా తక్షణం సమాచారమిస్తే వచ్చి పట్టుకుంటామన్నారు.


# పరిశోధన మెరుగైతేనే పంట వైవిధ్యం

జగిత్యాల : యాసంగి.. వానాకాలం.. సీజన్ ఏదైనా వరి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. కూలీల కొరత, మార్కెటింగ్ ఇబ్బందులు, కోతులు, అడవిపందుల బెడద వంటి కారణాలతో ఆరుతడి పంటలకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ పంటల వైవిధ్యం కనుమరుగవుతోంది. ఈ నెల ఆరంభం నుంచి యాసంగి సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఈసారైనా ఆరుతడి పంటల సాగుకు ప్రభుత్వం నుంచి పరిశోధనపరమైన ప్రోత్సాహం పెరగాల్సిన అవసరం ఉంది.

**ఉమ్మడి జిల్లా అవసరాలివీ..**

జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, నువ్వులపై ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి. వేరుశనగ, పత్తి, కంది, చెరకు తదితర ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపడితే ఇక్కడి నేలలకు అనువైన వంగడాల రూపకల్పన సాధ్యమవుతుంది. ఇటీవలి కాలంలో జగిత్యాల జిల్లాలో ఆవాల సాగు గణనీయంగా పెరిగినందున పొలాస పరిశోధన స్థానంలో ఐసీఏఆర్ ఆధ్వర్యంలో ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో పూర్తి స్థాయి పత్తి పరిశోధనలను అందుబాటులోకి తేవాలి. శనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితర పంటల్లో మేలైన వంగడాలను అందుబాటులోకి తెస్తే నల్లరేగడి నేలలున్న పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఏరువాక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కూనారం వరి పరిశోధన స్థానంలో ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపట్టాలి. కరీంనగర్‌లో కేవలం మొక్కజొన్నపైనే పరిశోధనలు సాగుతుండగా స్థానిక నేలలకు అనువైన పంటలపై చేయాల్సి ఉంది. జగిత్యాల సమీపంలోని చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేస్తే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, సీతాఫలం, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూల



సాగు చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నందున ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలి. ముత్యంపేట చెరకు కర్మాగారాన్ని తెరిస్తే చెరకు సాగు గణనీయంగా పెరుగుతుంది. పాలీహౌస్‌ల రాయితీని పునరుద్ధరించాలి. పంటల బీమాను యాసంగి నుంచి అమలు చేయాలి.

**పంట మార్పిడితో లాభాలు**

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుతో దిగుబడి, నేల స్థితిగతులు మెరుగుపడతాయి. నేలలో పోషకాలు, నీటి లభ్యత, కూలీల అందుబాటు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ వసతి చూసుకొని రైతులు పంట మార్పిడి పాటించాలి.

డా.ఎస్.హరీష్ కుమార్‌శర్మ, ఏడీఆర్, పొలాస పరిశోధన స్థానం

# కోస్తున్నారు.. ఆరబోస్తున్నారు..!



నల్గొండ: వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబోస్తున్నారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి బుధవారం ప్రారంభించారు. దొడ్డు ధాన్యం క్వింటాల్‌కు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2,389, బీ గ్రేడ్ రకానికి 2,369 చెల్లించనున్నారు. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మరోవారం రోజుల్లో కేంద్రాలు ప్రారంభం కానున్నాయి.

సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని త్వరితగతిన ఏర్పాటు చేయకుంటే మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్ లాంటి ప్రాంతాల్లో రైతులు మిల్లర్లను ఆశ్రయించి పెట్టుబడి ఖర్చుల కోసం నిలువు దోపిడికైనా సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో దొడ్డురకం- 14 లక్షలు, సన్నరకం-10 లక్షలు.. రెండు కలిపి మొత్తం 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వం తెరిచే కొనుగోలు కేంద్రాలకు 13.60 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం తీసుకువచ్చే అవకాశాలున్నాయని పౌరసరఫరాల, మార్కెటింగ్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

పెట్టుబడి ఖర్చుల కోసం అమ్ముతున్నాను

**గుగులోతు రాములు, సూర్యాపేట**

నేను పది ఎకరాలలో వరిసాగు చేస్తే వంద బస్తాల ధాన్యం తిరుమలగిరి మార్కెట్‌కు తెచ్చాను. వర్షాకాలం పంట రక్షించుకునే పరిస్థితులు లేవు. అక్టోబరు 1 నుంచే గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని అనుకున్నా.. కానీ, చేయలేదు. దీంతో చేతికొచ్చిన పంటను అమ్మడానికి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ఎంత ధర వచ్చినా అమ్మిపోతాను. మిగిలిన పంట నూర్పిడికి, పెట్టుబడి ఖర్చులకు డబ్బులు అవసరం ఉన్నాయి.

కొర్రీలు విధించకుండా కొనుగోలు చేయాలి

తండు కొండయ్య, గంగన్నపాలెం, తిప్పర్తి, నల్గొండ

కేంద్రాల్లో అధికారులు కొర్రీలు విధించకుండా మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలి. ఎన్నిసార్లు శుభ్రం చేసినా తేమ,తాలు పేరిట బస్తాకు గతంలో గరిష్ఠంగా కిలోన్నర ధాన్యం వరకు కోతలు పెట్టారు. ఈసారి కొర్రీల కిరికిరి పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలి. నాకున్న పదకొండు ఎకరాల్లో దొడ్డువి ఐదెకరాలు, మిగిలిన ఆరు ఎకరాల్లో సన్నధాన్యం సాగు చేశా. దొడ్డుధాన్యం కోతల అనంతరం 180 క్వింటాళ్ల మేర వస్తే వాటిని ఈ యార్డుకు తీసుకువచ్చా.

# గని ఆలస్యం.. ఉపాధి సంక్షోభం





ఇల్లెందు : కార్మికులు, వారి కుటుంబాలతో కళకళలాడే సింగరేణికి పుట్టినిల్లైన ఇల్లెందు (బొగ్గుట్ట) నేడు వెలవెలబోతోంది. గనులు అంతరించిపోవడంతో ఇక్కడి ప్రజలకు ఉపాధి లేక నగరాలకు వలసపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్న ఒక్క జేకే-5 ఉపరితల గనిలో బొగ్గు నిల్వలు అడుగంటడంతో గనిపై ఆధారపడిన వేల మంది ఉపాధి కోల్పోయారు. సెప్టెంబర్ నాటికే నూతన జేకే కోల్‌మైన్ ప్రారంభిస్తామని యాజమాన్యం ప్రకటించినా.. ఇప్పటికీ ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో సింగరేణి శాశ్వత ఉద్యోగులతో పాటు, ఒప్పంద, రోజువారీ కార్మికులు, ఇతర వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**గని ఏర్పాటైతేనే బొగ్గుట్టకు భవిష్యత్తు..**

ఇల్లెందులో గతంలో పదుల సంఖ్యలో భూగర్భ గనులు ఉండేవి. బొగ్గు తవ్వకాలు పూర్తి కావడంతో యజమాన్యం ఆ గనులను దశల వారీగా మూసేసింది. అనంతరం 2012లో జేకే-5 ఉపరితల గని ప్రారంభించింది. ప్రస్తుతం ఆ గనిలో బొగ్గు నిల్వలు అడుగంటాయి. అక్కడ ఉన్న కార్మికులను బదిలీ చేసి యంత్రాలను ఇతర ఏరియాలకు తరలించారు. కార్మిక వర్గం తీవ్ర సంక్షోభంలో ఉంది. నూతన గని ఏర్పాటయ్యే వరకు ఇక్కడే ఉంటామనుకున్న శాశ్వత కార్మికులు గని మూతడటంతో సందిగ్ధంలోకి వెళ్లారు. ఉపాధి కోల్పోయిన ఒప్పంద కార్మికులు కూలీలు మారారు. వలస వెళ్లి పనులు చేసుకుంటున్నారు.

నూతన జేకే కోల్‌మైన్ గని ఏర్పాటైతేనే ఇల్లెందు భవిష్యత్తుకు మనుగడ ఉంటుంది. గని ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు వచ్చినా యాజమాన్యం ప్రారంభించకపోవడంపై కార్మిక సంఘాలు, ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్యాకేజీలపై కొరవడిన స్పష్టత**

నూతన గని ఏర్పాటు చేసే విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ పంచాయతీల్లో సింగరేణి, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సుమారు 164 మంది నిర్వాసితులను గుర్తించారు. కానీ వారికి చెల్లించే ప్యాకేజీలు, నష్టపరిహారాలపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటివరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదు. కొందరు రైతులు జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. తమకు తగిన నష్టపరిహారం చెల్లిస్తేనే గని ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఖాళీ చేస్తామని చెబుతున్నారు. ఈ పరిస్థితులను గమనిస్తే గని ఏర్పాటుకు ఇంకా కొన్ని నెలలు పట్టే అవకాశం లేకపోలేదని తెలుస్తుంది.


గని ఏర్పాటుకు గతంలో అటవీ, పర్యావరణ శాఖల నుంచి అన్ని రకాల అనుమతులు ఇచ్చారు. ఇంకా ఓ భాగంలో 17.50 హెక్టార్లకు అటవీశాఖ అనుమతి రావాల్సి ఉంది. పార్ట్-1, పార్ట్-2 అనుమతులు వచ్చాక గని ఏర్పాటు పనులు ప్రారంభిస్తాం. వీసం కృష్ణయ్య, సింగరేణి ఏరియా జీఎం

# 'గెల'గలలా.. విలవిలలా!

అశ్వారావుపేట : ఆయిల్ ఫెడ్ ముందస్తు ప్రణాళిక లోపంతో వచ్చే ఏడాది మొక్కలకు ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. రాష్ట్రంలో 3 లక్షల పైచిలుకు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సగం తోటలు విస్తరించాయి. అగ్రభాగం భద్రాద్రి జిల్లాది. అందులోనూ అశ్వారావుపేట నియోజకవర్గం ముందు వరుసలో ఉంది. ఈ ఏడాది అత్యధికంగా అశ్వారావుపేటలో తోటల విస్తీర్ణం పెరగగా అంతేస్థాయిలో దమ్మపేట, ములకలపల్లి మండలాలున్నాయి. అశ్వారావుపేట కేంద్రీయ నర్సరీలో మొక్కలు నిండుకున్నాయి. రెండు నెలలుగా సిద్దిపేట, జనగాం, తొర్రూరు, మహబూబాబాద్, రంగనాయకసాగర్ నర్సరీల నుంచి తెప్పిస్తున్నారు. వచ్చే ఏడాది మరో లక్ష ఎకరాల్లో తోటలు విస్తరించాలని ఉద్యానశాఖ భావిస్తోంది. రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నర్సరీల్లో 17 లక్షల మొక్కలు అందుబాటులో ఉండగా, మరో 5 లక్షలు ప్రైవేటు కంపెనీల నర్సరీల్లో ఉన్నాయి. అవి చాలా వరకు ఏపీలోని రాయలసీమ జిల్లాలకు తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నర్సరీల్లో సుమారు 10 లక్షల మొక్కలు 40 నెలల పైబడి ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలినవి 2024లో విత్తినవి ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 17 లక్షల మొక్కలతో 29,825 ఎకరాల్లో తోటలు వేయొచ్చు. సిద్దిపేట, జనగాం నుంచి వచ్చినవి వచ్చినట్లే రైతులకు సరఫరా చేస్తున్నారు.

**ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో పెరిగిన డిమాండ్**

అటవీ హక్కుల పత్రాలు పొందిన పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు డిమాండు పెరిగింది. వీటిలో ఇందిర సౌరగిరి జల వికాస్ ఆధ్వర్యంలో బోర్లు, విద్యుత్తు మోటార్లు, విద్యుత్తు సౌకర్యం లేనిచోట సోలార్ విద్యుత్తుతో ఆయిల్‌పామ్ సాగు జోరందుకుంది. ఇప్పటికే పోడు భూముల్లో బోర్లు విస్తృతంగా వేశారు. వేలాది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టడంతో కొరత ఏర్పడింది. విత్తనాల కోసం



కోస్టారికా, మలేషియా లాంటి దేశాలకు ఇండెంట్ పెట్టలేదని తెలిసింది.

**15 లక్షల మొక్కలకు ఇండెంట్ పెడతాం**

**జంగా రాఘవరెడ్డి, ఛైర్మన్, సుధాకరరెడ్డి, జీఎం**

రాష్ట్రంలో వచ్చే ఏడాది మొక్కల కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో 15 లక్షలకు విదేశాల నుంచి ఆర్డర్ పెట్టనున్నాం. పొట్టి రకాల మొక్కలకు పెట్టాలనుకోవడంతో కొంత ఆలస్యం అయింది. వచ్చే ఏడాది మొక్క అడిగిన ప్రతి రైతుకూ అందించేందుకు క్వారంటైన్ పరిశీలన అనంతరం ఆర్డర్ పెట్టనున్నాం. ముందుగా 15 లక్షలు, ఆ తరువాత మరో 10 లక్షల మొలకల కోసం ఆర్డర్ పెట్టనున్నాం.

# నామపత్రాలకు వేళాయె!

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కీలక ఘట్టానికి తెరలేసింది. నోటిఫికేషన్ వెలువడనుంది. అనంతరం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఇందుకు షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం వెల్లడించారు. సెలవు రోజులు మినహా మిగిలిన పనిదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. కార్యాలయంలో నేరుగా లేదా.. డిజిటల్ విధానంలో దాఖలు చేసే అవకాశం కల్పించారు.

ఇదీ పరిస్థితి..!.. భారాసకు చెందిన జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య సునీత ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ బరిలో ఉన్నారు. భాజపా అభ్యర్థిని సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. ప్రధాన పార్టీల నామినేషన్ తేదీలు ఇంకా ఖరారు కాలేదు.

**ఇవీ మార్గదర్శకాలు**

25 ఏళ్లు నిండిన పౌరులు నామినేషన్ వేయొచ్చు. నామినేషన్ పత్రం ఫారం 2బీ, అఫిడవిట్ ఫారం 26 ఇవ్వాలి. జాతీయ, రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల తరఫున పోటీ చేసే వారికి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన ఒక పౌరుడు ప్రతిపాదించవచ్చు. ఇతర అభ్యర్థులకు పది మంది అవసరం. అభ్యర్థి స్వయంగా లేదా.. ప్రతిపాదకుల్లో ఒకరు వచ్చి దాఖలు చేయవచ్చు.

డిజిటల్ నామినేషన్‌ను %https://encore.eci.gov.in% ద్వారా దాఖలు చేయొచ్చు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న ప్రింటెడ్ హార్డు కాపీని అందజేయాలి. నియమాలు: నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేస్తారు. అదీ మూడు వాహనాలకే పరిమితం. అభ్యర్థి సహా అయిదుగురు వ్యక్తులను మాత్రమే ఆర్వో కార్యాలయం లోపలికి అనుమతిస్తారు. షేక్‌పేట తహసీల్దారు కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు. నియోజకవర్గంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

నోటిఫికేషన్, నామినేషన్‌ల స్వీకరణ నేటి నుంచి

చివరి తేదీ: 21

పరిశీలన: 22

ఉపసంహరణ గడువు: 24

ఎన్నికలు: నవంబరు 11

ఓట్ల లెక్కింపు: 14

# ముందుచూపు.. గాంధీకి కొత్త రూపు

హైదరాబాద్: గ్రామాల నుంచి వచ్చిన రోగులు గాంధీ లేదా ఉస్మానియా ఆసుపత్రిలో అడుగుపెడితే అంతా అయోమయం.. ఎక్కడ ఏ విభాగం ఉంటుందో చెప్పేవారే ఉండరు. ఎక్కడా బోర్డులు కన్పించవు. సిబ్బందిని అడిగినా.. తమకు తెలియదనే సమాధానం వస్తుంటుంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ ఆసుపత్రులకు బ్రాండింగ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత గాంధీ ఆసుపత్రిని తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కేరళలోని ప్రభుత్వ ఆసుపత్రులను అధికార బృందం పరిశీలించి అనుసరణీయ విధానాలు గుర్తించింది.

**ఇలా చేయనున్నారు...**

గాంధీ ఆసుపత్రికి నిత్యం అయిదారు వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి విభాగానికి దారిచూపేలా, రాత్రి సమయంలోనూ స్పష్టంగా కన్పించేలా బోర్డులు ఏర్పాటు చేస్తారు.

ఆసుపత్రి వాతావరణం చూస్తే కొందరు మానసిక ఆందోళనకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో బ్యూటిఫికేషన్ చేపట్టనున్నారు. పచ్చిక బయళ్లతోపాటు, కళాకృతులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు.

చదువు రానివారైనా సులువుగా చేరుకోవడానికి వీలుగా ప్రతి విభాగానికి ప్రత్యేక రంగు లైట్లను ఏర్పాటు చేస్తారు. ప్రధాన ప్రవేశ ద్వారం వద్దే వీటి గుర్తులు ఉంటాయి.

రోగులకు నాణ్యమైన సేవలందించేలా, వారు నిరీక్షించే ప్రాంతంలో కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యంతో పాటు శుభ్రమైన మరుగుదొడ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. సేవల్లో నాణ్యత పెంచేలా శిక్షణ ఇవ్వనున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించకుండా.. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ఓపీ చీటీ పొందేలా సాంకేతికతను వినియోగించనున్నారు. ఆరోగ్యశ్రీకి వెంటనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడనున్నారు. దివ్యాంగులకు ప్రత్యేక వీల్‌ఛైర్లు కేటాయించి, మరింత మంది పేషెంట్ కేర్ సిబ్బందిని నియమించనున్నారు.

ఆసుపత్రికి ఏటా 30 శాతం రోగులు పెరుగుతున్నా.. నర్సింగ్, పారామెడికల్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పెరగడం లేదు. విడతల వారీగా నియామకాలు చేపట్టనున్నారు.

# ఆదాయం పెంచేలా చెత్త సేకరణ

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్, అదనపు కట్టడాల మదింపు, వాణిజ్య సముదాయాలను గుర్తించి పన్ను మదించడం వంటి వైపు చర్యలు తీసుకుంటుండగా.. తాజాగా వాణిజ్య ప్రాంతాల్లో చెత్త సేకరణను ప్రైవేటుకు అప్పగించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ మాదిరిగా దుకాణాల నుంచి చెత్తను తీసుకెళ్లడానికి ప్రైవేటు ఏజెన్సీకి టెండర్ ద్వారా అప్పగించారు. గతేడాది జరిగిన పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానం చేశారు.

**ఏటా రూ.60 లక్షల ఆదాయం**

నివాసిత ఇళ్ల నుంచి కొన్నేళ్లుగా చెత్త సేకరణకు నెలవారీ రుసుం వసూలు చేస్తుండగా.. అదే విధానాన్ని వాణిజ్య సంస్థలు, దుకాణాలకు వర్తింపజేయనున్నారు. వాణిజ్య సంస్థల ద్వారా వచ్చే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు టెండర్ నిర్వహించారు. తద్వారా ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం రానుంది.బల్దియాకు నాలుగు ట్రాక్టర్లు, 16 మంది కార్మికులు పని చేస్తుండగా ఏడాదికి రూ.40 లక్షల ఖర్చు అవుతుంది. ఆ మొత్తాన్ని యూజర్ ఛార్జీల చొప్పున వసూలు చేస్తుండగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చెత్తసేకరణను ప్రైవేటుగా అప్పగించేలా గతంలోనే వివరాలను సేకరించారు. ప్రస్తుతం వస్తున్న రూ.60 లక్షల ఆదాయానికే టెండర్ దక్కించుకున్నారు. కార్మికులు, నాలుగు ట్రాక్టర్ల సేవలను ఇతర డివిజన్ అవసరాలకు వినియోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది.

**టవర్ సర్కిల్ నుంచే ప్రారంభం** టెండర్ దక్కించుకున్న సంస్థ మూడు రోజులుగా తమ వాహనానికి చెత్త ఇవ్వాలని, మూడు డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని, యూజర్ ఛార్జీలతో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ఆటో ద్వారా టవర్‌సర్కిల్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్నారు. వచ్చే నెల 1 నుంచి పూర్తి స్థాయిలో అమలుకానుంది. ఆ తర్వాత నగరవ్యాప్తంగా కేటాయించిన ఏరియాల్లోంచి చెత్తను తరలిస్తారు. ప్రైవేటు సంస్థ ద్వారా చెత్తను సేకరించి యూజర్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. చెత్త వేసినా, వేయకపోయినా దుకాణం నుంచి నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తారు.

# నమోదు 57శాతమే..



కొత్తగూడెం: జిల్లాలో పంట నమోదు కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్(వానాకాలం) సీజన్ ముగింపు దశకు వచ్చినా.. వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు కాకిలెక్కలతో సరిపెడుతున్నారనే విమర్శలున్నాయి. రైతులు ఎన్ని ఎకరాల్లో ఏ పంటలు సాగు చేశారనే వివరాలను సకాలంలో నమోదు చేసి ప్రభుత్వానికి పంపిస్తే.. అందుకనుగుణంగా ఎరువుల పంపిణీ, కొనుగోళ్ల ప్రక్రియ ఇబ్బందులు లేకుండా పూర్తవుతాయి. కొన్నిచోట్ల పంట కోతలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఆ పరిస్థితి కనిపించటం లేదు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5,08,604 ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు గుర్తించారు. వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓ) ఇప్పటి వరకు 2,90,325 ఎకరాల్లో సాగైన పంటలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు (57 శాతం). ఇంకా 2,18,278 ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది.

**ఎందుకీ జాప్యం..**

అత్యధికంగా సాగయ్యే పత్తి పంట కొనుగోళ్లకు ఓ వైపు అధికారులు సిద్ధమవుతుండగా.. మరోవైపు ఇంకా 68,472 ఎకరాల్లో వివరాలను నేటికీ నమోదు చేయకపోవడం గమనార్హం. వరి, మొక్కజొన్న పంటల వివరాల నమోదు సైతం ఇదేవిధంగా ఉండటంతో పంట విక్రయ సమయంలో తమకు మద్దతు ధర దక్కక ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 67 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో 67 మంది ఏఈఓలున్నారు. మిగిలిన జిల్లాల్లో ఏఈవో పరిధిలో 5వేల ఎకరాల సాగు భూమి ఉండగా.. ఇక్కడ 10వేల ఎకరాలకుపైగా భూమి ఉన్న క్లస్టర్లు 20 పైచిలుకు ఉన్నాయి. దీంతో నమోదులో జాప్యం చోటుచేసుకుంటోంది. క్లస్టర్ల విభజనలో ఏకరూపకత లేదు. కొత్తగూడెం మండలంలో సుమారు 300 ఎకరాల పంట భూములుంటే కొమరారం క్లస్టర్‌కు వచ్చేసరికి 29వేల ఎకరాలున్నాయి.

అధికారిక లెక్కల్లోకి రాకున్నా కొత్తగా పట్టాలిచ్చిన పోడు భూములనూ క్రాప్ చేయాల్సి ఉంది.

యూరియా పంపిణీలో ఇబ్బందులతో చాలా రోజులపాటు ఏఈవోలు దృష్టి సారించలేదు. రైతువేదికల్లో తమ సమక్షంలోనే ఎరువులు పంపిణీ చేయాల్సి వచ్చింది.

యాప్ అందజేతలో నెల రోజులు ఆలస్యమైంది.

కొంతమంది ఏఈవోలు వివరాల నమోదులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలు లేకుండానే ప్రక్రియ పూర్తి చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

'ఏటా ఖరీఫ్ సీజన్ మొదలైన వెంటనే ఏఈఓలకు పంట నమోదు యాప్‌ను అందించేవారు. ఈసారి నెల రోజులు ఆలస్యం కావడంతో క్రాప్ బుకింగ్‌లో కొంత వెనకబడ్డాం. ఈ నెలాఖరు నాటికి పంట నమోదు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.' బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

## పత్తి కొనుగోళ్లకు సీసీఐ సై

ఖమ్మం : భారత పత్తి సంస్థ(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు లక్ష్మీబాయి, అదనపు సంచాలకుడు లక్ష్మణుడు.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులు ఎంఏ అలీం, నరేందర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, ఇతర మార్కెట్ల కార్యదర్శులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో పంట నమోదు దాదాపు కొలిక్కి రాగా భద్రాద్రిలో 70శాతం వరకు పూర్తయ్యింది.

కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ కోసం ప్రతి వ్యవసాయ మార్కెట్లో ప్రత్యేకంగా ఉద్యోగిని ఏర్పాటు చేస్తారు. యాప్‌పై అవగాహన లేని రైతులకు అధికారులు తమ ఫోన్ ద్వారా స్లాట్ బుక్ చేయాలి.



స్లాట్ బుక్ చేయని రైతుల నుంచి సీసీఐ ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి కొనుగోలు చేయదు. సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌లో తమ పేరు నమోదైనదీ లేనిదీ ఏఈవోల ద్వారా రైతులు ధ్రువీకరించుకోవాలి. కౌలు రైతులు కూడా పంటను సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. వీరి వివరాలను ఏఈవోలు సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. ఖమ్మం జిల్లాలో 9, భద్రాద్రి జిల్లాలో ఆరు జిన్నింగు మిల్లుల వ్యాపారులు టెండర్లలో పాల్గొన్నారు. సోమవారం ఖరారు కానున్నాయి. తర్వాత వ్యాపారుల వివరాలు సీసీఐ బ్రాంచి మేనేజర్‌కు తెలియచేస్తారు. సీసీఐ అధికారులు మిల్లుల జాబితాను పంపిన వెంటనే కలెక్టర్ నోటిఫై చేస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసి ఉభయ జిల్లాల్లో దీపావళి తర్వాత సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## తొమ్మిదేళ్లు.. ఏవీ వసతులు?

వీర్నపల్లి : ఈ చిత్రంలో కనిపిస్తోంది వీర్నపల్లి తహసీల్ కార్యాలయం. ఇప్పటికీ మూడుసార్లు అద్దె భవనాల్లోకి ఈ కార్యాలయాన్ని మార్చారు. నివాసయోగ్యమైన గదుల్లో కార్యాలయ నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఇంటికి వినియోగించే వంట గదిలో రికార్డులు భద్రపర్చాల్సిన పరిస్థితి. హాల్‌లో భూముల రిజిస్ట్రేషన్‌లు, కంప్యూటర్‌లతో సిబ్బంది పనిచేయాలి. ఎక్కువ సంఖ్యలో జనాలు వస్తే కనీసం కార్యాలయంలో వేచి ఉండే పరిస్థితి లేదు.

ఎమ్మార్సీ భవనంలో తాత్కాలికంగా మండల పరిషత్తు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయిదేళ్లుగా ఇదే భవనంలో కార్యాలయం కొనసాగుతోంది. అధికారులు, సిబ్బందికి వేర్వేరుగా గదులు లేవు. పాఠశాలలు, రైతు వేదికల్లో సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేయాల్సి రావడం ఇబ్బందులకు అద్దం పడుతోంది.

పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో జిల్లాలో వీర్నపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేయగా.. ఆరు అటవీ గ్రామాల ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. తొమ్మిదేళు పూర్తయినా ఇప్పటికీ పక్కా భవనాలు మంజూరు కాలేదు. ఫలితంగా అరకొర అద్దె గదుల్లోనే అధికారులు కొలువు చేయాల్సిన పరిస్థితి ఉంది. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

**అద్దె భవనాలే దిక్కు**

మండలం ఏర్పడిన తర్వాత తాత్కాలికంగా పాఠశాల గదుల్లో తహసీల్, మండల పరిషత్తు కార్యాలయం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ భవనంలో పోలీసు స్టేషన్‌కు ఇచ్చారు. అయితే పాఠశాల పునర్నిర్మాణంలో భాగంగా కార్యాలయాలను అద్దె భవనాల్లోకి తరలించారు. పక్కా భవనాల నిర్మాణానికి రెవెన్యూ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో అటవీశాఖకు చెందిన 12 ఎకరాల భూమిని కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని భావించినా అది ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇటీవల పోలీసు స్టేషన్‌కు భూమిపూజ చేసిన నిర్మాణం పునాదికి నోచుకోలేదు. కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సైతం భూమిపూజ




చేసినా ఇప్పటికీ నిర్మాణం ప్రారంభించలేదు. మండల పరిషత్తు, తహసీల్ కార్యాలయాల మంజూరు ఊసే లేదని ప్రజలు వాపోతున్నారు.

**అన్నీ అపరిష్కృతంగానే..**

వీర్నపల్లి, మద్దిమల్ల, రంగంపేట, కంచర్ల, వన్‌పల్లి, గర్జనపల్లి గ్రామాల పూర్తిగా అడవీ ప్రాంతంలో ఉంటాయి. ఇక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటకు చేరుకోవాలంటే జనాలు నానా ఇబ్బందులు పడేవారు. ఇది గుర్తించిన అప్పటి సర్కారు జిల్లాల ఏర్పాటులో భాగంగా వీర్నపల్లికి మండల హెూదా కల్పించారు. సుమారు 16 వేల పైచిలుకు జనాభా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మండలంలో గ్రామాల సంఖ్య 17కు పెరిగింది కానీ.. చాలా గ్రామాల్లో ఇప్పటికీ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. మెజారిటీ గ్రామాలకు కనీసం గ్రామ పంచాయతీ కార్యాలయాలు అందుబాటులోకి రాలేదు. గ్రామాల్లో మురుగు కాలువాల దుస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

# మరమగ్గం.. కొత్తమార్గం



సిరిసిల్ల : సిరిసిల్ల వస్త్రోత్పత్తులు నాణ్యతతో పోటీపడుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక మరమగ్గాలున్న జిల్లాలో దశాబ్దాలుగా ముతకరకం వస్త్రోత్పత్తులకే పరిమితమయ్యారు. 2017 నుంచి క్రమంగా మార్పు మొదలైంది. మరమగ్గాల వస్త్రోత్పత్తులు కొత్త మార్గంలో పయనిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బహిరంగా మార్కెట్లో లభించేవి.. అందులో మహిళలు ధరించే చీరలు 80 శాతం సూరత్‌లో తయారైనవే. కారణం అక్కడి ఆధునిక మర మగ్గాలు, నాణ్యమైన నూలు వినియోగం. సిరిసిల్లలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంలో వెనుకబడటంతో వస్త్రోత్పత్తుల్లో ప్రయోగాల ఊసే లేకుండా పోయింది.

**ట్విస్టింగ్ నూలు ఏమిటంటే..**

ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రంలోని మహిళా సంఘాలకు పంపిణీ చేసే 64 లక్షల ఏకరూప చీరలతో మార్పు మొదలైంది. పాలిస్టర్‌లో 50 శాతం ట్విస్టింగ్ నూలు వినియోగించాలని నిబంధన. నాణ్యమైన, తేలికపాటి మంచి స్టేపుల్ ఉన్న పాలిస్టర్ నూలును యంత్రాలపై ట్విస్టింగ్ చేస్తారు. ఇలా చేయడం వల్ల నూలు దృఢత్వం పెంచి, మృదువుగా మారి వస్త్రం ఆకర్షణీయంగా తేలికగా ఉంటుంది. ఏకరూప చీరల్లో 50 శాతం ట్విస్టింగ్ నూలు మాత్రమే వాడారు. ఇదే 100 శాతం వాడితే పాలిస్టర్ వస్త్రోత్పత్తుల్లో అద్భుతాలు సృష్టించొచ్చు. ఇది సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొత్త అయినప్పటికీ ప్రభుత్వ ఆర్డర్లు కావడంతో ఉత్పత్తిదారులు ఆకలింపు చేసుకునేందుకు సమయం పట్టింది. నైపుణ్యం, నాణ్యత, నవ్యతలతో జిల్లా సూరత్, షోలాపూర్ వంటి వస్త్రోత్పత్తి నగరాల సరసన చేరేందుకు ఎంతో సమయం పట్టకపోవచ్చు.

**పరిశ్రమ సామర్థ్యాలపై సంతృప్తి**

జిల్లాలో చీరల ఉత్పత్తికి మొత్తం రూ.232 కోట్లు కేటాయించారు. 30 వేల మరమగ్గాల్లో కేవలం 10 వేల మరమగ్గాలపైనే ఏకరూప చీరలను ఉత్పత్తి చేశారు. కారణం కొత్తరకం తెలుపు నూలు, పగలు మాత్రమే ఉత్పత్తికి అవకాశం ఉండటంతో చాలా వరకు ఆసక్తి చూపలేదు.

ఇటీవల మంత్రి సీతక్క పరిశ్రమలో వస్త్రోత్పత్తులను పరిశీలించి, స్వయంగా కార్మికులతో మాట్లాడారు. జిల్లా వస్త్రపరిశ్రమ శక్తి సామర్థ్యాలను నేరుగా పరిశీలించి సంతృప్తి చెందారు. దీంతో గురువారం చీరల చెల్లింపులకుగాను రూ.50 కోట్లు విడుదల చేశారు. పెట్టుబడికి ఇబ్బంది ఉన్న 50 మ్యాక్స్ సంఘాలకు ప్రభుత్వమే నూలు బ్యాంకు ద్వారా నూలు సరఫరా చేసింది. తొలివిడత రూ.23 కోట్లు విడుదల చేసింది. చీరలకు 70 శాతం చెల్లింపులు జరిగాయి. ఇప్పటికీ 85 శాతం చీరల ఉత్పత్తి పూర్తయింది.

ఈ నెల 15లోపు లక్ష్యం పూర్తిచేసి, నవంబరులో రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది. త్వరలోనే రెండో చీరలకు ఆర్డర్లు ఇవ్వనున్నారు.

**రూ.50 లక్షలతో యంత్రం ఏర్పాటు**

నూలును ట్విస్టింగ్ చేసే యంత్రాలు జిల్లాలో లేవు. రూ.50 లక్షలతో ముంబయి నుంచి యంత్రాలను కొనుగోలు చేసి తీసుకొచ్చాను. జిల్లాలో ప్రైవేటు వస్త్రోత్పత్తులకు మీటరుకు గరిష్ఠంగా రూ.8.50 నుంచి రూ.9.20 బహిరంగ మార్కెట్లో ధర లభించేది. ట్విస్టింగ్ నూలుతో మీటరుకు సగటున రూ.28 ధర లభిస్తుంది. పెరిగిన నాణ్యతను ప్రైవేటు మార్కెట్‌కు అన్వయించుకుంటే జిల్లా పరిశ్రమకు తిరుగుండదు. వేముల దామోదర్, యజమాని

# సర్కారు భవనాలపై సౌర కాంతులు



కరీంనగర్ : సహజ వనరుల వినియోగం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుదుత్పత్తిని పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. జల, థర్మల్ విద్యుత్తు ఖర్చుతో కూడుకోవడంతో సోలార్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇదివరకు విద్యుత్తు బిల్లులు చెల్లించడం ప్రభుత్వ కార్యాలయాలకు ఇబ్బందిగా ఉండేది. ఈ సమస్యను అధిగమించడానికి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పంచాయతీ కార్యాలయం నుంచి మొదలు జిల్లా సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్తు ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఈ విషయంపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ భవనాలను గుర్తించి వాటి సమాచారం పంపించాలని ఆదేశించారు.

**నత్తనడకన నివేదికలు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,226 గ్రామ పంచాయతీలు, 61 మండలాలున్నాయి. వీటితోపాటు పురపాలికలు, నగరపాలక సంస్థలు, జిల్లా కేంద్రాలు ఉన్నాయి. వీటన్నిటి పరిధిలో పోలీస్‌స్టేషన్లు, పంచాయతీ కార్యాలయాలు, ఎంపీడీవో, రెవెన్యూ, వ్యవసాయ, విద్య, అటవీ, ఆరోగ్య, కలెక్టరేట్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఇలా సుమారు 2500పైగా ఉంటాయి. సొంత భవనమున్న ప్రతి ప్రభుత్వ కార్యాలయం వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాల్సి ఉండగా, ఆ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పలు శాఖల అధికారులు స్పందించడం లేదని సమాచారం. ఇప్పటి వరకు రెడ్కో అధికారుల ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన 1,191 సర్కార్ భవనాల వివరాలు మాత్రమే ప్రభుత్వానికి చేరాయి. ఆయా శాఖల అధికారులు, పంచాయతీల కార్యదర్శులు స్పందించి వారి పరిధిలోని ప్రభుత్వ భవనాల వివరాలు పంపించాలని రెడ్కో అధికారులు కోరుతున్నారు. వివరాలను %kmnr@tgredco.telangana.gov.in% పంపించాలని రెడ్కో మేనేజర్ మునీందర్‌రెడ్డి కోరారు.

# కల్లాల్లో ఆనందం

నల్గొండ : అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయి. సరైన స్థలాలు లేక పొలాల్లో, రోడ్లపై ధాన్యాన్ని రైతులు ఆరబెడుతూ ఇబ్బంది పడుతున్నారు. దీన్ని నివారించేందుకు ధాన్యంతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టేందుకు కల్లాలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. తెలంగాణలో పంట ఉత్పత్తుల ఆరబోత కోసం రాష్ట్ర ప్రభుత్వం వినతి మేరకు 2021-22లో కేంద్రం అనుమతించింది. ఏడాది తర్వాత కల్లాల నిర్మాణాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఏడాది క్రితం పనులకే నిధులు మంజూరు కాగా.. మిగతావారికి బిల్లులు రాలేదు.

ఎస్సీ, ఎస్టీలకు రూ.80 వేలు, ఇతరులకు రూ.70 వేల చొప్పున ఇచ్చారు. కేవలం ఏడాది మాత్రమే నిధులు కేటాయించి తర్వాత నిలిపివేయడంతో ఉమ్మడి జిల్లాలో 90 శాతం రైతులు నిర్మించుకోలేకపోయారు. ఫలితంగా ధాన్యం రాసులు రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి.



రాత్రిపూట వాహనచోదకులు వడ్ల కుప్పలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. తేమ శాతం వచ్చేందుకు రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు నిరీక్షించాల్సి వస్తుంది. అక్కడ కూడా స్థలం లేకపోవడంతో కుప్పలుగా పోసి ఉంచుతున్నారు.

అధికారులు ఉమ్మడి జిల్లాలో ఈ పథకం కింద రూ.24 కోట్ల చెల్లింపులు చేశారు. కల్లాలు నిర్మించుకున్న వారు చాలామంది ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా కల్లాల నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇవ్వడంతో బిల్లులు రానివారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

**12,195 కల్లాల నిర్మాణానికి అనుమతి**

రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఉపాధి హామీ పథకం కింద రైతులు తమ వ్యవసాయ పొలాల్లోనే కల్లాలను నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 12,195 కల్లాలు మంజూరయ్యాయి. రూ.99.32 కోట్లు కేటాయించారు. రూ. 56.87 వేల వ్యయంతో 50 చ.మీ.లు, రూ.68 వేలతో 60 చ.మీ.లు, రూ. 85 వేలతో 75 చ.మీ.లు.. ఇలా మూడు రకాలుగా 12,215 కల్లాలు నిర్మించడానికి రూ.99.32 కోట్లు నిధులు కేటాయించింది. 5,327 కల్లాల నిర్మాణం పూర్తైంది. నల్గొండ జిల్లాలో పీఏపల్లి, తిప్పర్తి నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, కట్టంగూర్, మునుగోడు, మాడ్గులపల్లి మండలాల్లో పదుల సంఖ్యలో నిర్మాణాలు పూర్తి చేశారు. మిగతా మండలాల్లో అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

# చెరువు కట్ట.. పడాలి అక్రమాలకు అడ్డుకట్ట

వెల్దుర్తి : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెరువు కట్టపై ఉన్న దారులు ప్రమాదకరంగా మారాయి. రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం ధర్మాజిపేటలో చెరువు కట్టపై ఉన్న దారిలో బైక్‌పై వెళుతుండగా, నలుగురు కుటుంబ సభ్యులు ప్రమాదవశాత్తు చెరువులోకి దూసుకు వెళ్లడంతో ముగ్గురు సురక్షితంగా బయటపడగా, 9నెలల చిన్నారి మృతి చెందింది. ఇటువంటి ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి.. వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ వద్ద చెరువుకట్టపై ఉన్న రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఒక వైపు చెరువు, మరో వైపు 20 అడుగుల లోతు ఉన్న పొలాలు ఉన్నాయి. మానేపల్లి వద్ద కూడా చెరువుకట్టపైనే రోడ్డు ఉంది. ఈ మార్గాల్లో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వెల్దుర్తి నుంచి మెదక్ వెళ్లే మార్గంలో ఉప్పులింగాపూర్ వద్ద హల్దీవాగుపై వంతెన ఉంది. ఈ వంతెనకు రెండు వైపుల రక్షణ గోడలు లేవు. టేక్మాల్ మండల పరిధి సాలోజిపల్లి వద్ద రహదారిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. మెదక్-బొడ్మట్‌పల్లి రహదారి పై టేక్మాల్ పెద్ద చెరువు బ్యాక్ వాటర్ రహదారి వరకు వస్తుంది. మరో వైపు వరద చెరువులోకి పారుతోంతి. రహదారిపై వంతెన నిర్మించారు. వంతెనకు ఇరు వైపులా రక్షణగోడలు తొలగడంతో ప్రమాదకరంగా ఉంది. మనోహరాబాద్ మండలం దండుపల్లి నుంచి వర్గల్‌కు వెళ్లే రహదారికి ఇరువైపులా చెరువు ప్రమాదకరంగా ఉంది. దారిపై ఉన్న కల్వర్టు కుంగిపోయింది. పరికెండుకు వెళ్లే రహదారిపై ఉన్న పుర్లకుంట



నిండి నీరంతా రహదారిపై నుంచి పారుతోంది.

తూప్రాన్ మండలం వెంకటరత్నాపూర్ వెళ్లే దారిలో చెరువు ఉంది. ఏడాది కిందట దాతర్‌పల్లికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై వెంకటరత్నాపూర్ వెళ్తుండగా, అదుపుతప్పి చెరువులో పడిపోయాడు. రెండు రోజుల అనంతరం మృతదేహంపైకి తేలింది. నిత్యం రోడ్డుపై రాకపోకలు చేసేందుకు ప్రజలు జంకుతున్నారు. రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

చేగుంట, నార్సింగి మండలాల్లో చెరువు కట్టలపైనే దారులు ఉన్నాయి. నార్సింగిలో 44వ జాతీయ రహదారి క్యాసంపల్లి చెరువు కట్టపైనుంచి వెళ్తుంది. నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలో చెరువు ఉంది. చేగుంట నుంచి రెడ్డిపల్లికి ఒకే వరస దారి ఉంది. ప్రమాదకరంగా ఉండడంతో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది.

## ఖాళీగా షెడ్లు.. ఇరుకుగా రోడ్లు

కరీంనగర్: జిల్లాలోని నగర, పురపాలికల్లో వీధివ్యాపారుల కోసం సౌకర్యాలు కల్పించి 'ఆత్మనిర్భర్' నింపాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. రహదారులపై చిరు వ్యాపారం సాగించకుండా షెడ్లు నిర్మిస్తున్నా వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. రోడ్లే అడ్డాలుగా మలుచుకోవడం, ఉన్న చోటనే వాటిని నిర్మించాలని కోరుతుండటంతో ప్రాంతాల్లో స్థలం దొరకడంలేదు.

**నెరవేరని ప్రభుత్వాల లక్ష్యం**

వీధివ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కింద రుణాలు ఇస్తుండగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పక్కా అడ్డాలు లేకపోవడంతో రోడ్ల మీద దుకాణాలకు ఎదురుగా కూర్చొని అమ్ముతుండగా ప్రైవేటు దుకాణాల యజమానులు అద్దె వసూలు చేస్తున్నారు. పురపాలికలు చూపించే షెడ్లలోకి వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ వారు వెళ్లడంలేదు. పథకం లక్ష్యం నెరవేరడంలేదు.

**అయిదు చోట్ల ఖాళీ**

పండ్ల మార్కెట్‌కు బస్టాండ్ వెనక రూ.17 లక్షలతో వెండర్ జోన్



ఏర్పాటు చేస్తే అక్కడికి వెళ్లకపోవడంతో ఇతరులకు కేటాయించారు. రూ.30 లక్షలతో ఇందిరానగర్‌లో నిర్మించగా ఒకరిద్దరు మినహాయించి వ్యాపారులు ఎవరూ ఉండటం లేదు.

రూ.23 లక్షలతో చైతన్యపురిలో నిర్మించగా ఒక్కరూ ఉండటం లేదు. బ్యాంకుకాలనీ రహదారిపై దుమ్ము, ధూళిలో కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. రూ.25 లక్షలతో హౌసింగ్‌బోర్డుకాలనీలో మార్కెట్ నిర్మించగా అది నిరుపయోగంగా ఉంది. వెంకటసాయి థియేటర్ ఎదురుగా, పాతబజారులో కూర్చొనే వీధివ్యాపారులకు దీనిని నిర్మించారు. శ్రీనగర్, సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా ఉదయం ఒకరిద్దరు ఉంటున్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా వీధి వ్యాపారం చేస్తున్నారు.

**ఇలా చేస్తే ప్రయోజనం**

ఏ ప్రాంతం వారిని ఆ ప్రాంతంలోనే ఖాళీగా ఉన్న మార్కెట్లు, షెడ్లలోకి పంపించాలి. రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారులు అడ్డాలు పెట్టకుండా కట్టడి చేయాలి. నాలుగు చక్రాలు, తోపుడుబండ్లను కూడా అదే ప్రాంతానికి తరలించాలి. దీ రహదారులపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు దొరకకపోతే ప్రజలు కూడా షెడ్ల వద్దకు వస్తారు.

## దెబ్బతిన్న వంతెన.. నరకయాతన

ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల-సిద్దిపేట జిల్లాల సరిహద్దు గ్రామాలైన మోహినికుంట-రాజక్కపేట మధ్యనున్న వంతెన అంచు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం మీదుగానే రెండు జిల్లాల వాహనదారులు సిద్ధిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు ముందుకు సాగేలా చొరవ చూపాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

**రూ.1.80 కోట్ల నిధులు మంజూరు**

రాజక్కపేట కొత్తచెరువు నుంచి వంతెన కిందుగా వాగు ద్వారా నీరు మోహినికుంట, మద్దికుంట చెరువు నిండుకొని.. ముస్తాబాద్ చెరువుల్లోకి చేరుతాయి. అయితే ఇరుగ్రామాల మధ్యనున్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎంఆర్‌ఆర్ (మెయింటెనెన్స్ రూరల్ రోడ్డు) ద్వారా దాదాపు రూ.1.80 కోట్లు వరకు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత అధికారులు మాత్రం పనుల వివరాలను వెల్లడించడంలేదు. వంతెన మరమ్మతుల కోసం నిధులు విడుదలయ్యాయా లేదా నూతన వారధి నిర్మాణానికి మంజూరయ్యాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**కోతకు గురైన వారధి రోడ్డు**

నిత్యం లింగన్నపేట నుంచి చిన్నచీకోడ్, మద్దికుంట, మోహినికుంట గ్రామాలతోపాటు సిద్ధిపేట జిల్లా రాజక్కపేట పరిసర గ్రామాల ప్రజలు



ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తాత్కాలిక రోడ్డు కోసం వేసిన పైపులు అక్కడే నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇరు జిల్లాల వాహనదారులు కోరుతున్నారు.

**పనులు జరిగేలా చూడాలి**

మెర్గు లింగం, మోహినికుంట

రెండు జిల్లాలకు చెందిన వందలాది వాహనదారులు ఈ రోడ్డు మీదుగా తక్కువ దూరంతో వెంకట్రావుపల్లె మీదుగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. వెంటనే పనులు జరిగేలా చూడాలి.

**గుత్తేదారుకు సూచిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఎంఆర్‌ఆర్ కింద నిధులు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. పనులు చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచిస్తాం.

సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

## రూ.15కోట్లు వెచ్చించినా నిరుపయోగమే!



సిరిసిల్ల : జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం రూ.15 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టిన కొత్త చెరువు కట్ట (మినీ ట్యాంక్‌బండ్) ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. నిర్వహణ కొరవడి క్షేత్ర స్థాయి పరిస్థితి అధ్వానంగా మారడంతో సందర్శకులు అటువైపు వెళ్లాంటేనే భయపడుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

గతంలో ఈ ప్రాంతం విద్యుత్తు దీపాల వెలుగుల్లో జిగేల్‌మనగా.. పట్టణ ప్రజలు పిల్లాపాపలతో సేదతీరేందుకు వచ్చేవారు. వేసవికాలంలో చెరువు కట్టపై ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని విద్యుత్తు తీగలు కాలిపోయాయి. కొంతవరకు మరమ్మతులు చేసినా రాత్రి సమయాల్లో పలుచోట్ల అంధకారం నెలకొంటోంది. కట్టపై చూపరులను ఆకట్టుకునేలా సిరిసిల్ల - కరీంనగర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కట్టపై వివిధ ఆకృతులను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక పిచ్చిమొక్కల మధ్య అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పాదచారులు వెళ్లేవైపు పాముల పుట్టలు ఏర్పడ్డాయని సందర్శకులు చెబుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన కొత్త చెరువు ట్యాంక్‌బండ్ ముఖద్వారం ఈదురుగాలులకు కిందపడిపోయింది. రెండో గేటు ఇటీవల ఊడి కిందపడినా సరి చేయలేదు. గతంలో చెరువులో గుర్రపుడెక్క పెరిగితే నెలపాటు కృషి చేసి యంత్రం సాయంతో తొలగించారు. మళ్లీ ఇప్పుడు గుర్రపుడెక్క పెరగడంతో నీటి శాతం తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు.

చెరువులో సందర్శకుల షికారు కోసం రెండు పడవలు ఏర్పాటు చేశారు. పడవలను నడిపించేందుకు ఇద్దరు పురపాలిక సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శిక్షణ నిమిత్తం పంపించారు. వారు శిక్షణ పూర్తి చేసుకొని వచ్చినా పడవలను చెరువులోనే వదిలేయడంతో మరమ్మతులకు గురయ్యాయి. చెరువు కట్టపై పచ్చదనం చూపించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ రైలు ఏర్పాటు చేసి కొంతకాలం నడిపించారు. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 చొప్పున టికెట్ ధర నిర్ణయించి వారానికి మూడు రోజులు నడిపించారు. నిర్వహణ కొరవడటంతో ఆ రైలు ప్రస్తుతం మూలకు చేరింది. మరమ్మతుకు రూ.1.50 లక్షలు అవుతుందని చెబుతున్నారు. మినీ ట్యాంక్‌బండ్‌పై నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకొని అందుబాటులోకి తేవాలని సందర్శకులు కోరుతున్నారు.

## ఇసుక.. అధికారులకు మస్కా



శంకరపట్నం : వాల్టా చట్టం ప్రకారం జల వనరుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించొద్దు. కానీ జిల్లాలో చాలా చోట్ల ఈ దందా దర్జాగా కొనసాగుతోంది. గ్రామాల్లోని వాగులు ఇందుకు వేదికలుగా మారుతున్నాయి. పొక్లెయిన్ యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పడితే చాలు తవ్వకాలు మొదలుపెడుతున్నారు. ఇలా ఇసుకాసురులు అధికారుల కళ్లను కప్పి యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. శంకరపట్నం మండలంలోని గద్దపాక వాగు నుంచి మండలంలోని సగం గ్రామాలకు ఇసుక రవాణా చేస్తున్నారంటే వ్యాపారం ఏ మేర సాగుతుందో చెప్పవచ్చు. అర్కండ్ల, కేశవపట్నం, తాడికల్, మక్త, ఎరడపల్లి గ్రామాల్లోని వాగుల్లో తవ్వకాలు చేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. అక్రమ తవ్వకాలతో వాగుల్లో పెద్ద గొయ్యిలు దర్శనమిస్తున్నాయి. వానాకాలంలో సైతం నీటి ప్రవాహం తగ్గితే చాలు యథావిధిగా తవ్వుతూ సొమ్ము చేసుకొంటున్నారు. శంకరపట్నం మండలం గద్దపాక వాగు నుంచి అధికంగా తవ్వకాలు చేస్తూ మండలంలోని సగానికి సగం గ్రామాలకు రవాణా చేస్తున్నారు. సగటున రోజుకు పది నుంచి ఇరవై ట్రాక్టర్లలో నెలకు సుమారు 300 టన్నులు తరలిస్తున్నారు.

ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.2000 వరకు సొమ్ము చేసుకుంటున్నారు. వాగులే కాకుండా చెక్‌డ్యాం ప్రాంతాల నుంచి దొడ్డు ఇసుక తరలిస్తున్నారు. కేశవపట్నం వాగు నుంచి సమీప గ్రామాలకు రవాణా చేస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకొని, పోలీస్ స్టేషన్ వెనకాల వాగులనూ వదలడంలేదు. బయానా గుట్ట ప్రాంతంలో నిల్వలు డంపు చేస్తున్నారు.

రవాణా సాఫీగా సాగేలా రహస్యంగా మట్టి దారులను అభివృద్ధి చేసుకొంటున్నారు.

కరీంపేట్ గ్రామంలో ప్రధాన కాలువ యూటీ(అండర్ టన్నెల్) వద్ద నుంచి ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. ఎరడపల్లి, ముత్తారం, తాడికల్, వంకాయగూడెం వాగుల వద్ద నిత్య దందాగా మారింది.

ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో నీటి నిలిపివేత తర్వాత.. అందులో నిలిచిన ఇసుకను సైతం వదలకుండా.. ఆదాయం గడిస్తున్నారు.

అర్కండ్ల వాగుతోపాటు చెక్‌డ్యాం నుంచి సేకరించి.. ఖాళీ ప్రదేశాల్లో డంపులు చేసి.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి తవ్వకాలను అడ్డుకొని భూగర్భ జలాలు కాపాడాల్సిన అవసరముంది.

## కాగితాల్లో కనపడరు!

కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ పేరొందిన ఆస్పత్రిలో 36 మంది వివిధ విభాగాల సిబ్బంది రోగులకు సేవలందిస్తున్నారు. ఈ ఆస్పత్రి ఏర్పాటు సమయంలో కేవలం 12 మంది వివరాలు మాత్రమే వైద్యారోగ్యశాఖకు ఇచ్చారు. ప్రస్తుతం అందుకు మూడింతల సిబ్బంది వివిధ పనులు చేస్తున్నారు. వీరి వివరాలు సంబంధిత అధికారులకు ఇవ్వాలనే ఆలోచన ఆస్పత్రి యాజమాన్యం చేయలేదు. ఎప్పటికప్పుడు ఆస్పత్రులను పర్యవేక్షించిన అధికారులు పట్టించుకోవడం లేదు.



నాలుగు జిల్లాల పరిధిలో చిన్న, పెద్ద ప్రైవేటు ఆస్పత్రులన్నీ కలిపి 986 ఉన్నాయి. ఇందులో అధికారిక లెక్కల ప్రకారం 8వేల మందికి పైగా పని చేస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవంగా 12 వేల మందికి పైగా ఉంటున్నట్లు సమాచారం. చిన్న ఆస్పత్రిలోనే అటెండర్లు, స్టాఫ్‌నర్స్, వార్డుబాయ్, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్, సహాయకులు, వాచ్‌మెన్, టెక్నీషియన్ తదితర పోస్టుకిద్దరు చొప్పున లెక్కేసినా 16 మంది ఉంటారు. కానీ అధికారుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం సగటున 8 మంది మాత్రమే పని చేస్తున్నారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో సిబ్బంది లెక్కాపత్రం విషయంలో ఉమ్మడి జిల్లాలో గందరగోళమనే పరిస్థితి నెలకొంది. ఇటీవల కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో ఇంటర్మీడియట్ చదివిన వ్యక్తి ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా పని చేస్తూ జ్వరంతో వచ్చిన యువతిపై అత్యాచారం చేసిన సంఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. సంఘటన జరిగి 10 రోజులు దాటినా ఇప్పటి వరకు ఏ ఒక్క ఆస్పత్రి నుంచి సిబ్బంది వివరాలు పక్కాగా సేకరించే దిశగా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. ముఖ్యంగా కరీంనగర్‌లో అన్ని ఆస్పత్రులకు తాఖీదులు ఇచ్చి పక్కాగా సమాచారం, సిబ్బంది విద్యార్హతలు తెలుసుకుంటామని చెప్పిన అధికారులు ఆ తరువాత ఆ విషయాన్నే మరిచారు. ఇక సిబ్బందిలో చాలామంది తప్పుడు ధ్రువీకరణలతో విధుల్లో ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలాచోట్ల గతంలో పనిచేసిన అనుభవాలతోనే కొత్త ఆస్పత్రుల్లో చేరుతూ సేవలందిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాల తీరు ఇలా..**

సిబ్బందికి తక్కువ వేతనాలిస్తూ వారి వివరాలు కార్మికశాఖకు, ఆరోగ్యశాఖకు తెలియజేయడం లేదు.

ఒకచోట తీసేసినవారి పూర్వాపరాలు తెలుసుకోకుండా విధుల్లో చేర్చుకుంటున్నారు. విద్యార్హతల పత్రాలు కొన్నిచోట్ల సేకరించడం లేదు. అనుభవం, బయోడేటానే చూస్తున్నారు. ఈపీఎఫ్ సహా ఇతర సంక్షేమాలు సిబ్బందికి వర్తింపజేసే ఆస్పత్రులు తక్కువే. జీతం తక్కువ ఇస్తుండటంతో రోగుల వద్ద కింది స్థాయి సిబ్బంది డబ్బులడుగుతున్నారు.

పరిసరాల శుభ్రతను కొన్ని ఆస్పత్రులు పట్టించుకోవడం లేదు.

కొన్నిచోట్ల రోగులు, కుటుంబీకులతో దురుసుగా మాట్లాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకునేవారు లేరు.

## చకచకా విద్యుత్తు పనులు

ధర్మపురి : ధర్మపురి పురపాలికలో దశాబ్దాలుగా పలు విద్యుత్తు సమస్యలు నెలకొనగా వీటిని పరిష్కరించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇటీవల ధర్మపురి పట్టణానికి చెందిన వివిధ రకాల విద్యుత్తు తీగలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలు ఇతరత్రా అంశాలపై మంత్రి లక్ష్మణ్‌కుమార్ విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రూ.1.16 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించగా నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

**ప్రధాన వీధుల్లో త్రీఫేజ్**

పురాతన విద్యుత్తు తీగలు, తరచూ కోతుల బెడద వెరసి విద్యుత్తు సరఫరాలో పలు సమస్యలు నెలకొంటున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు దీనిపై సర్వే చేపట్టారు. ప్రస్తుతం 15 స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల పక్కన వేలాడే విద్యుత్తు తీగలు తొలగించి నూతన తీగలను ఏర్పాటు చేశారు. చిన్న వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్లను కేటాయించారు. ఆయా పనులు వేగంగా కొనసాగు



తుండగా.. ప్రధాన వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతోంది.

**పరిష్కరించే దిశగా చర్యలు**

శివారు కాలనీల్లో ఇంకా విద్యుత్తు లోవోల్టేజీ సమస్యలు నెలకొని ఉండగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో నిర్మాణంలోని అదనపు విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 8 మీటర్ల విద్యుత్తు స్తంభాలు 111, తొమ్మిది మీటర్ల స్తంభాలు 500 మంజూరు చేశారు. ధర్మపురి నుంచి కమలాపూర్‌కి వెళ్లే మార్గంలో రహదారి పక్కన విద్యుత్తు త్రీఫేజ్ లైన్లు ఏర్పాటు చేశారు. 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

**అభివృద్ధి దశలో ఉన్నాయి**ధర్మపురి పట్టణంలో మెరుగైన విద్యుత్తు సేవలకు ప్రభుత్వానికి రూ.1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగా ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో పట్టణంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో సమస్యలు తొలగిపోనున్నాయి. - రవి, ఏఈ, ధర్మపురి

## పత్తిపాకకు మోక్షం

పెద్దపల్లి : జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పత్తిపాక జలాశయం నిర్మాణానికి ఎట్టకేలకు కార్యాచరణ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జలాశయం(పత్తిపాక) డీపీఆర్(ప్రాజెక్టు నిర్మిత ప్రాంతం నైసర్గిక స్వరూపం, సర్వే నివేదిక) కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.10 కోట్లు విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన ఈ జలాశయం నిర్మాణం జరిగితే పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురితోపాటు చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అయితే ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు కోసం రైతుల ఎదురుచూపులు త్వరలో ఫలించనున్నాయి.

**ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోత..**

పత్తిపాక జలాశయం ప్రతిపాదిత స్థలం మూడువైపులా గుట్టలతో ప్రాజెక్టు నిర్మాణానికి అత్యంత అనుకూలమైందని నీటిపారుదలశాఖ అధికారులు గతంలో గుర్తించారు. 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 400 ఎకరాల అటవీభూమి, 1,300 ఎకరాల రెవెన్యూ భూమి సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులోకి ఆరు లింకుల ద్వారా నీటిని పంపిస్తారు. ఇందు కోసం మేడారం జలాశయం నుంచి దేవికొండ వరకు ఇదివరకే లిఫ్ట్ పనులు జరిగాయి. దేవికొండ నుంచి పత్తిపాక జలాశయానికి లిఫ్టు ద్వారా, గ్రావిటీ కాలువ ద్వారా రెండు విధాలా నీటిని పంపించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టు నీటిని నేరుగా కాకతీయ కాలువలోకి పంపించి రేవెల్లి సమీపంలో హెడ్ రెగ్యులేటర్ ద్వారా డి-83, నుంచి డి-94 కాలువల వరకు నీరందిస్తారు.

**చివరి ఆయకట్టుకు తొలగనున్న కష్టాలు**

కొన్నేళ్లుగా జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడటం, నీటి కోసం ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. జిల్లాలో ప్రధానమైన డి-83, డి-86 కాలువల ద్వారా పంట పొలాలకు సాగు నీరు చేరుతుంది. డి-83 ద్వారా పెద్దపల్లి, ధర్మారం, రామగుండం, మంథని, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు డి-86 ద్వారా సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు సాగునీరు అందుతుంది. చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలలో మరో 10 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరందుతుంది.

## విశిష్టతల సమాహారం.. వెయ్యేళ్ల వైభవం

మంథని పశ్చిమాభిముఖ ఆలయం.. ధ్వజ స్తంభం లేని మందిరం.. హనుమంతుడు ద్వార పాలకుడిగా ఉన్న క్షేత్రం.. ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా విరాజిల్లుతోంది మంథనిలోని శ్రీ భిక్షేశ్వరాలయం.. పూర్వం మంత్రపురిగా పిలిచిన మంథనిలో కాకతీయుల కాలంలో నిర్మించిన అయిదు శివాలయాల్లో ఈ దేవస్థానం ఒకటి. దాదాపు వెయ్యేళ్ల కిందట ప్రతాపరుద్రుడి పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి. శ్రీ భిక్షేశ్వరాలయంలో గణపతి, అయిదు పడగల నాగదేవత, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి. పానవట్టం లేకుండా దక్షిణామూర్తి(లింగం), తపస్సు చేస్తున్న రూపంలో అన్నపూర్ణాదేవి, పశ్చిమాభిముఖంగా శ్రీ భిక్షేశ్వరుడు(శివుడు) దర్శనమిస్తారు. పశ్చిమాభిముఖంతో ఉన్న శివాలయాలు ఖజూరాలోని ఖండలీయ మహాదేవ, నేపాల్‌లోని ఖాట్మండ్‌లోని పశుపతినాథ్ ఆలయాలతో పాటు తెలంగాణలో మంథనిలో మాత్రమే ఉన్నాయి. గర్భగుడిలోని లింగం(శ్రీ భిక్షేశ్వరుడు)పై బ్రహ్మసూత్రం కనిపిస్తుంది. ఆలయాన్ని స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల భక్తులు దర్శించుకుంటారు. దక్షిణామూర్తి విగ్రహం(లింగం) తమిళనాడులోని చిదంబరంతో పాటు మంథనిలోనే ఉంది. దాదాపు 900 ఏళ్లుగా ఆలయానికి ధ్వజ స్తంభం లేదని పూర్వీకులు చెబుతున్నారు. నిత్యం అభిషేకాలతో పాటు ప్రతి సోమవారం, శనివారం, నెలలో వచ్చే రెండు ఏకాదశులు, మాస శివరాత్రి, మహా శివరాత్రి సమయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులే స్వయంగా గర్భాలయంలోకి వెళ్లి స్వామివారిని స్పృశించి అభిషేకాలు చేసుకోవచ్చు.

చురకలు



# లక్ష్యానికి చేరువలో ఇళ్లు

నక్కపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల ఇళ్లను పూర్తి చేసి ఈ దీపావళికి సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాలో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే లక్ష్యంలో 80 శాతానికి చేరుకుంది. పండగలోగా మరింత సాధించడానికి యంత్రాంగం కృషి చేస్తోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ గృహ నిర్మాణం, పీఎంఏవై కింద పేదల ఇళ్ల నిర్మాణాలకు సహకారం అందుతోంది. గత ప్రభుత్వం ఆర్భాటంగా మొదలు పెట్టి గాలికొదిలేసిన ఇళ్లను పూర్తి చేయించే బాధ్యత తీసుకుంది. వివిధ స్థాయిల్లో నిలిచిన ఇళ్ల పనులను పూర్తి చేసి, పేదల సొంతింటి కల నెరవేర్చేలా ముందుకు వచ్చింది. ఈ క్రమంలోనే నిర్మాణాలను కొనసాగించలేని నిరుపేద వర్గాల కోసం అదనంగా ఆర్థిక సాయం ప్రకటించింది. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్టీల్లో బాగా వెనుకబడిన



వర్గాలకు రూ.లక్ష చొప్పున ఇస్తోంది.

జిల్లాలో 13 వేలకుపైగా ఇళ్లను నిర్మించాల్సి ఉండగా, అదనపు సాయం తోడ్పాటుగా ఉండటంతో పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే 80 శాతం పూర్తవగా, దీపావళి నాటికి మరింత పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగవంతమయ్యేలా చూస్తున్నారు. జిల్లాలో తొలి ఐదు స్థానాల్లో అనకాపల్లి, నాతవరం, నక్కపల్లి, కె.కోటపాడు, మాకవరపాలెం, రోలుగుంట మండలాలు ఉన్నాయని గృహ నిర్మాణ సంస్థ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు.

జిల్లా సమాచారం
నిర్మించాల్సినవి: 13,687
పూర్తయినవి: 10,882
వివిధ దశల్లో ఉన్నవి: 2,805

# మధ్యతరగతికి బాసట!

ఒంగోలు : మధ్యతరగతి ప్రజలు సొంతిల్లు సమకూర్చుకునేవిధంగా ప్రభుత్వం ఎన్టీఆర్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేసే ఆలోచన చేసింది. తక్కువ ధరకు ఇంటి స్థలాలను పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. టౌన్‌షిప్‌లను అన్ని రకాల వసతులు కల్పించి నివాసయోగ్యంగా తీర్చిదిద్దనున్నారు. ఇటీవల నిర్వహించిన ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒనుడా) సమావేశంలో ఇవి ప్రధానం గా చర్చకు వచ్చాయి.జిల్లాలో నాలుగు చోట్ల 45 ఎకరాల్లో టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఎంపిక చేసిన పట్టణాల సమీపంలో స్థలాల సేకరణపై దృష్టిసారించారు. చాలావరకు ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నారు. ఇలా సేకరించిన భూముల్లో లేఅవుట్ వేసి వాటిని వంద గజాలకు పైబడి మూడు కేటగిరీల్లో ప్లాట్లుగా విభజించనున్నారు. మార్కెట్, రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం ప్లాట్ల ధర నిర్ణయించనున్నారు. రూ.18 లక్షల ఆదాయ పరిమితిలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకునే అప్పట్లో నిబంధన విధించారు. ఆదాయ పరిమితి ఎత్తేయాలని తరువాత వినతులొచ్చాయి. లేఅవుట్‌ల్లో రహదారులు, డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీరు సదుపాయాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయనున్నారు. ప్రైవేటు లేఅవుట్‌తో సమానంగా సౌకర్యాలు కల్పించనున్నారు. ధర మాత్రం మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా చూస్తారు. ఈ ప్లాట్లను లాటరీ విధానంలో గానీ, వేలం గానీ నిర్వహించి కేటాయిస్తారు.



**స్థలాల ఎంపికలో యంత్రాంగం**

ప్రభుత్వ స్థలాలు పట్టణాలకు దూరంగా ఉండడం సమస్యగా మారింది. మార్కాపురం పట్టణానికి సంబంధించి రాయవరం, బోడపాడు ప్రాంతాల్లో స్థలాలను రెవెన్యూ శాఖాధికారులు పరిశీలించారు. ఇవి అనుకూలంగా లేకపోవడంతో పక్కన పెట్టారు. పొదిలికి సంబంధించి ఒంగోలు రోడ్డులోని కాటూరివారిపాలెం వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఇప్పటికే చూశారు. స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 7న ఒనుడా ఛైర్మన్ షేక్ రియాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్టీఆర్ టౌన్‌షిప్‌లకు ప్రాధాన్యం గుర్తించి ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించడంతో కదలిక వచ్చినట్లయింది. భూసేకరణ విషయమై ఇప్పటికే పలు స్థలాలను పరిశీలించామని, నివాసానికి యోగ్యంగా ఉన్న భూములను ఎంపిక చేస్తామని ఒనుడా వైస్ ఛైర్మన్, జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు.

# కమీషన్‌కు ఆశపడితే కటకటాలే

చిత్తూరు : మీరేం చేయాల్సిన పనిలేదు. బ్యాంకు ఖాతా వివరాలు, వాటి లాగిన్ ఐడీలు ఇస్తే చాలు లావాదేవీలు జరిపినందుకు నెలవారీగా కమీషన్లు ఇస్తాం. లేకపోతే మీ పేరుతో ఖాతాలు తెరిచి మేం వాడుకుంటాం. కష్టపడకుండా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గం..! ఇలాంటి బూటకపు మాటలతో సైబర్ నేరగాళ్లు అమాయకుల్ని పోలీసు కేసుల్లో ఇరికిస్తున్నారు. ఇటీవల నిందితుల్ని అరెస్టు చేసినప్పుడు ఎక్కువ మంది బ్యాంకు ఖాతాలు ఇచ్చిన వారే ఉంటున్నారు. పోలీసులు అరెస్టు చేశాక లబోదిబోమంటున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఇతరుల (మ్యూల్స్) బ్యాంకు ఖాతాలు వినియోగిస్తున్నారు.

**ఇవీ జాగ్రత్తలు** సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా సందేశాలు పంపిస్తూ బ్యాంకు ఖాతాల వివరాలకు వల వేస్తుంటారు. కమీషన్లు ఇస్తామని ఆశపెడితే నమ్మొద్దు.గుర్తుతెలియని లేదా తెలిసిన వ్యక్తులకైనా బ్యాంకు ఖాతా లాగిన్‌ఐడీ వివరాలు ఇవ్వొద్దు.కొందరు నేరగాళ్లు కూలీలు, పేదల పేరుతో సేవింగ్స్, కరెంటు ఖాతాలు తెరుస్తున్నారు. వ్యక్తిగత గుర్తింపు పత్రాలు ఇవ్వొద్దు.

జిరాక్సు సెంటర్లు, ఇతర ప్రాంతాల్లో ఆధార్, పాన్ నకలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.ఒకవేళ మోసపోతే

మన ప్రమేయం లేకుండా బ్యాంకు ఖాతాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే ఆలస్యం చేయకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలిబ్యాంకు అధికారులను సంప్రదించి సమస్యను వివరించాలి.1930 టోల్‌ఫ్రీ నంబరు, %www.cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

# పడకలు లేక.. పడుకోలేక



తిరుపతి : పేదల సంజీవని రుయా ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం (ఈఎండీ, అత్యవసర విభాగం)లో ఒక్కోసారి పడకలు చాలడం లేదు. ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు, గొడవల్లో గాయపడ్డ వారు, ప్రైవేటు ఆసుపత్రులు చేర్చుకోని వారు ఇక్కడికే వస్తుంటారు. ఎమర్జెన్సీ వార్డులో 24 పడకలు, 6 పడకల ట్రయాజ్ మొత్తం కలిపి 30 మాత్రమే ఉన్నాయి. మంచాలు చాలక ఒక్కో పడకపై ఇద్దరిని పడుకోబెట్టి చికిత్స అందించాల్సిన పరిస్థితి. కూర్చోలేక.. పడుకునే పరిస్థితి లేక అల్లాడిపోతున్నారు.

**ఏం చేయాలి..?**

అత్యవసర విభాగానికి వచ్చే రోగులకు మొదటి గంటలో పరీక్షలు.. వైద్య నిర్ధారణ జరగాలి.

తర్వాత చికిత్స అందించి ఇంటికి పంపడమో.. ఐసీయూకు మార్చడమో.. ఆయా విభాగాల వార్డులో చేర్చుకోవడమో జరగాలి.

**ఏం జరుగుతోంది..?**

ఈఎండీ, ఐసీయూ వార్డుల్లో ఉంటున్న రోగులను సమయానికి సంబంధిత వార్డులకు పంపించడంలో జాప్యం జరుగుతోంది. : దీంతో తరువాత వచ్చే రోగులతో పడకలు పంచుకోవాల్సి వస్తోంది.

విస్తరణలో జాప్యం


పడకల కొరత తీరాలంటే అత్యవసర విభాగం విస్తరణే పరిష్కారం. రూ.70 కోట్లతో నిర్మిస్తున్న 24/7 అక్యూట్ కేర్ సెంటర్ నిర్మాణం పనులు నిధుల లేమితో పూర్తి కాలేదు. 2023 ఫిబ్రవరి నాటికే ప్రారంభించాల్సి ఉన్నా.. ఇప్పటికీ మరో రూ.20 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నర్సింగ్ హాస్టల్ సమీపంలో నిర్మిస్తున్న సీసీఎం బ్లాక్ నిర్మాణం పూర్తయ్యింది. రూ.2 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ నిధులు మంజూరైనా ఉపశమనం లభిస్తుంది.

**కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం**

అక్యూట్ కేర్ సెంటర్, సీసీఎం బ్లాక్ భవనాలను మరో ఆరు నెలల్లో అప్పగిస్తామన్నారు. అప్పటివరకు ఏపీఎంఎస్ఐడీసీ నిర్మించిన ఇంజినీరింగ్ భవనాన్ని అత్యవసర రోగులకు కేటాయించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.డాక్టర్ కె.రాధ, ఎంఎస్, రుయా

ఎక్కడెక్కడి నుంచి వస్తారు: రాయలసీమతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాలు రోజుకు అవుట్ పేషెంట్లు: సుమారు 1600
ఇన్‌పేషెంట్లు: 1200
అత్యవసరవిభాగానికి వచ్చేవారు 200 మంది
ఎమర్జెన్సీవార్డులోపడకలు 30

# భవితకు సాంకేతిక భరోసా!



తిరుపతి : మీకు.. సాంకేతికత పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టాలని ఉందా.. ఇందుకు మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. తిరుపతిలోకి ఎస్వీయూ ఆవరణలో ఏర్పాటైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) కేంద్రానికి వెళ్లిపోవడమే. మరి ఇంకేమీ ఆలస్యం చేయకుండా ఏం చేయాలో తెలుసు కుందామా..

**కోటి మందికి తర్ఫీదు ఇచ్చిన సంస్థ**

నైలెట్ కేంద్రాన్ని ఏడాది కిందటే అందుబాటులోకి తీసుకురాగా, అధికారికంగా ఈ నెల 3న ప్రారంభించారు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా 55 కేంద్రాలను నెలకొల్పగా, 700 పైగా అనుబంధ సంస్థలు 9,000 ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా కోటి మందికి శిక్షణ సంస్థ ఇది. అందుకే ఎలాంటి సందేహం అక్కర్లేదు.

స్థానిక కేంద్రీయ, తిరుపతిలో 4, రేణిగుంటలో 2 పాఠశాలల విద్యార్థులకు ఏఐ నేర్పిస్తోంది.

**ప్రస్తుత కోర్సులు**

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 'ఓ' లెవెల్
కంప్యూటర్ హార్డ్‌వేర్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ 'ఓ' లెవల్
ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ ఫర్ స్మార్ట్ సిటీ అప్లికేషన్స్
ఇంట్రడక్షన్ టు ఆర్టిఫిషియల్ అప్లికేషన్స్

ప్రారంభం కానున్నవి..
ఇంట్రడక్షన్ టు వీఎల్ఎస్ఐ టెక్నాలజీ
రియల్ టైం ఆపరేటింగ్ సిస్టం
కోర్సు ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్
కోర్సెస్ ఆన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ (సి, సిం౦, పైథాన్, జావా తదితరవి)

**శిక్షణ ఇలా..**

పాలిటెక్నిక్, ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయా కోర్సుల్లో తర్ఫీదు ఇస్తున్నారు.

కోర్సుల వ్యవధి 60 గంటలు, 90 గంటలు, 15, 30, 45, 90 రోజులు ప్రారంభం కానున్నవి..

**త్వరలో ఆఫ్‌లైన్‌లో..**ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. త్వరలో ఆఫ్‌లైన్ విధానంలో ప్రారంభించనున్నాం. రేణిగుంట విమానాశ్రయం వద్ద 15 ఎకరాల స్థలాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడ అధునాతన వసతులతో నిర్మాణాలు చేపట్టనున్నాం. ఎస్వీయూలోని ఓ తాత్కాలిక భవనంలో కేంద్రాన్ని కొనసాగిస్తున్నాం. శశికుమార్ గేర, కేంద్రం డైరెక్టర్

# వ్యవసాయ పరిశోధన కేంద్రాలు అలంకారప్రాయమేనా?



రాయదుర్గం : వ్యవసాయంలో సాంకేతిక, నాణ్యతాపరమైన సమస్యలు అధిగమిస్తూ.. రైతులకు సేవలు అందించాలనే లక్ష్యంతో వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ పరిశోధన కేంద్రాలు (అగ్రి టెస్టింగ్ ల్యాబ్) అలంకార ప్రాయంగా మారాయి. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రూ.58 లక్షల వ్యయంతో వీటిని పూర్తి చేసినా.. సిబ్బంది నియామకంలో అలసత్వం కారణంగా కేంద్రాలు నిరుపయోగంగామారాయి. రబీ, ఖరీఫ్ పంటల సాగు చేసే సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు నాణ్యతను పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల్లో అవగాహన పెంచడం లేదు.

**క్షేత్రస్థాయిలో అవగాహన కరవు**

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాల నాణ్యత, పశువుల పేడ, చర్మ సంబంధ వ్యాధులు, ఇతర పరీక్షలన్నీ ఉచితంగా చేయాలి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నమూనాలు పరీక్షించడం మినహా.. స్థానిక రైతులకు సంబంధించిన నమూనాల సేకరణ, పరీక్షలు నేటికీ అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. రైతులకు ఇక్కడ ఏఏ సేవలు అందుతాయో అవగాహన లేదు.

**కేంద్రాల తీరిది**

రాయదుర్గంలో 2021లో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఐదేళ్లుగా సిబ్బంది కొరతతో సేవలు అందలేదు. ఫలితంగా రూ.లక్షల విలువైన పరికరాలు దుమ్ము పడుతున్నాయి. విత్తనాలు, ఎరువుల నమూనాలు నిల్వ చేసే ర్యాక్‌లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ఉరవకొండలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండటం లేదు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇక్కడ అందడం లేదు. ఈ కేంద్రంలో ముగ్గురికి ఇద్దరు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు.

కళ్యాణదుర్గంలో మూడేళ్ల కిందట ల్యాబ్‌ను ప్రారంభించినా నేటికీ రైతులు ఇక్కడికి వచ్చిన దాఖలాలు లేవు. అధునాతన పరికరాలన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ పరీక్షలు చేసేందుకు రసాయనాల కొరత ఉంది.

182 నమూనాలు పరీక్షించాం

– శేఖన్న, అగ్రిల్యాబ్, ఏవో, రాయదుర్గం

కేంద్రానికి వచ్చిన ప్రతి నమూనాలను పరీక్షిస్తున్నాం. గతేడాదిగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 182 నమూనాలు పరీక్షించి ఫలితాలు చెప్పాం. అధికారుల పర్యవేక్షణతో రైతులు నేరుగా కేంద్రాలకు నమూనాలు తీసుకొచ్చినా పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తాం.

# నిఘా నేత్రం... జరభద్రం!

ఒంగోలు : నేరాల నియంత్రణ, పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. సంచలనాత్మక కేసులను ఛేధించడంలో పోలీసులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఈ క్రమంలో తమ వ్యక్తిగత అవసరాలకు వ్యాపారులు, గృహావసరాల కోసం వినియోగిస్తున్న కెమెరాల కోణంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా మరింత ప్రయోజనకరంగా ఉండేవిధంగా మార్పులు చేస్తున్నారు. తద్వారా ఎక్కడైనా, ఏదైనా నేరం జరిగితే దాన్ని సత్వరం ఛేధించేవిధంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కెమెరాల కోణంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 5,722 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఒంగోలు నగరంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాలైన మార్కాపురం, గిద్దలూరు, దర్శి, కనిగిరి, చీమకుర్తి, పొదిలితో సహా కీలకమైన మండల కేంద్రాలు, కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటిని పోలీసుశాఖ నిఘా కోసం ఏర్పాటు చేయగా, వాణిజ్య సముదాయాలు, వ్యాపార కేంద్రాలు, రద్దీ కూడళ్లు, ప్రాంతాలు, స్వీయరక్షణ కోసం గృహాల్లో పలువురు వీటిని ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని కీలక పట్టణాల్లో ఏర్పాటు చేసిన 502 కెమెరాలు జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమై ఉంటాయి. ఇక్కడి సిబ్బంది వీటిలో నమోదవుతున్న దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. ఎక్కడైనా, ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే క్షేత్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తారు.

కెమెరాల కోణం మార్పు ద్వారా..

తమ వ్యక్తిగత భద్రత కోసం ఏర్పాటు చేసుకునే కెమెరాల్లో ఎక్కువ శాతం తమ దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో ఏం జరుగుతోందో



తెలుసుకునే విధంగా ఎక్కువ మంది కెమెరాలు ఏర్పాటు చేసుకుంటారు. అదే సమయంలో తమ ప్రాంతంలోనే రహదారులను కవర్ చేసేలా ఏర్పాటు చేస్తున్నవి చాలా తక్కువ. పలుచోట్ల నేరాలు జరిగిన సమయంలో ఆయా ప్రాంతాల్లోని కెమెరాలను పరిశీలిస్తే, అవి రోడ్లను కవర్ చేయకపోవడంతో నేరస్థులను గుర్తించి పట్టుకోవటానికి కాస్త కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయా కెమెరాల యాంగిల్‌ను కాస్త మార్చి రోడ్డు సైతం కవర్ అయ్యేలా చేయడం ద్వారా మరింత ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లాలో వెయ్యిదాకా కెమెరాల కోణాలను మార్చారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే మార్చనున్నారు.

# పునాదులు దాటని టమాటా పరిశ్రమ

కర్నూలు : జిల్లాలో టమాటా రైతులను ఆదుకోవడానికి పత్తికొండ నియోజకవర్గం కనకదిన్నె గ్రామంలో చేపట్టిన 'సమీకృత టమాటా ప్రాసెసింగ్ పరిశ్రమ' పునాదులకే పరిమితమైంది. శంకుస్థాపన చేసి 7 నెలలైనా పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. జిల్లాలో సుమారు 7,900 హెక్టార్లలో టమాటా సాగవుతోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోయి రైతులకు నష్టాలు మిగులుతున్నాయి. వారిని ఆదుకునేందుకు పరిశ్రమే దిక్కని నాయకులు భావించారు. వైకాపా అధ్యక్షుడు జగన్ పరిశ్రమ ఏర్పాటుకు 2017 నుంచి హామీ ఇస్తూ వచ్చి.. చివరికి 2023లో వివాదాస్పద భూమిలో శంకుస్థాపన చేశారు. భూ వివాదం కారణంగా అది ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కనకదిన్నెలో 2.50 ఎకరాలను కేటాయించింది. ఈ ఏడాది మార్చిలో రూ.11 కోట్ల అంచనాతో పనులు మొదలుపెట్టింది. ఆగస్టు నుంచి చేతికొచ్చే పంటను పరిశ్రమకు అందించాలనుకుంది. రాష్ట్ర వాటా నిధులతో భూమి కేటాయించి, పునాదులు వేయించింది. కేంద్ర వాటా నిధులు రాకపోవడంతో ప్రాజెక్టు



ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. జాప్యం వల్ల నిర్మాణం వ్యయం పెరిగి.. రూ.15.50 కోట్లకు చేరేలా ఉందని గుత్తేదారు సంస్థ అధికారులకు ప్రతిపాదన పంపింది.

**నిత్యం 60 టన్నులు**

పరిశ్రమతో రోజుకు 60 టన్నుల టమాటాలు శుద్ధి చేయడం.
250 టన్నుల సరకు నిల్వకు శీతల గిడ్డంగుల నిర్మాణం.
32 మందికి ప్రత్యక్షంగా, వంద మందికి పరోక్ష ఉపాధి.
రోజుకు 10–15 టన్నుల టమాటా గుజ్జు, 2–3 టన్నుల టమాటా కెచప్, పచ్చళ్ల తయారీ యూనిట్లు ఏర్పాటుకు ప్రణాళికలు.

# చెత్త ఎత్తాలంటే కష్టమే

కదిరి: మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు కరవయ్యాయి. ఇంటింటి చెత్తసేకరణ, వీధులను ఊడ్చటం, డ్రైనేజీల్లో మురుగు తొలగింపు వంటి పనులకు రక్షణ సామగ్రి లేదు. ప్రజారోగ్యానికి తమ ఆరోగ్యం పణంగా పెడుతున్నట్లు స్వచ్ఛ సైనికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌శాఖ ఏడాదికోసారి కార్మికులకు గ్లౌజులు, గన్‌బూట్లు, సబ్బులు, నూనె, రేడియం జాకెట్లు ఇవ్వాల్సి ఉంది. వాటిని సమకూర్చటాన్ని విస్మరించారు. కొన్ని మున్సిపాలిటీల్లో పరికరాలను కార్యాలయాలకే పరిమితం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే మున్సిపల్ ఆస్తి కాబట్టి ఆఫీసులోనే ఉండాలంటున్నారు. కార్మికులు మాత్రం పాదరక్షలు, తొడుగుల్లేకుండా హానికారక వ్యర్థాలను తొక్కుతూ, చేతులతో ఎత్తుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ వస్తు సామగ్రిని సమకూర్చాలని కార్మికులు కోరుతున్నారు. ధర్మవరంలో పారిశుద్ధ్య కార్మికులకు గన్‌బూట్లు గ్లౌజులు, సబ్బులు, నూనె, రేడియం జాకెట్లు తదితర వస్తు పరికరాలు ఇచ్చి రెండేళ్లవుతోంది. తర్వాత ఎలాంటి సామగ్రి సమకూర్చలేదు. విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసన్ దృష్టికి తీసుకెళ్లగా గుత్తేదారులతో మాట్లాడి త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు. కదిరి మున్సిపాలిటీలో గ్లౌజులు, గన్‌బూట్లు ఆఫీసులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రక్షణ పరికరాలు పదిలంగా పెట్టి, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌బాబును సంప్రదించగా బూట్లు, గ్లౌజులు ఉన్నాయి. వాటిని కార్మికులకు ఇచ్చినా ఉడుకు అని వేసుకోవటం లేదని చెప్పారు.

జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో పాతబడిన దుస్తులతోనే కార్మికులు చెత్తను వాహనాల్లోకి ఎత్తుతున్నారు. ఏడాదిగా కంపాక్టర్లు మూలనపడ్డాయి. సరైన వస్తు సామగ్రి లేక పారిశుద్ధ్య కార్మికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ విషయంపై కమిషనర్ క్రాంతికుమార్ స్పందిస్తూ సామగ్రి తెప్పించాం. కార్మికులు అందించి సమస్య లేకుండా చూస్తామన్నారు.

# అటు భాగ్యనగరం.. ఇటు బెంగళూరు

కోవెలకుంట్ల : జాతీయ రహదారి 167–కె పనులు వేగంగా జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు జాతీయ రహదారి (167–కె) నిర్మాణంలో భాగంగా నాలుగో ప్యాకేజీ పనులు ప్రారంభయ్యాయి. నంద్యాల పట్టణ సమీపంలోని రైతు నగరం నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరడమే కాకుండా నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లా వాసులు హైదరాబాద్ (భాగ్యనగరం) వెళ్లేందుకు 70 కి.మీ. దూరం తగ్గుతుంది. నంద్యాల జిల్లా వాసులు బెంగళూరు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

- రైతునగరం–నొస్సం: 62.01 (కి.మీ)
- రెండు వరుసలుగా విస్తరణ: రూ.691.81 (కోట్లు)
- వంతెనలు: పెద్దవి (2), చిన్నవి (13), కల్వర్టులు (143)

ఆరు మండలాలు..22 గ్రామాలు

నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లో 486 ఎకరాలు సేకరించారు. కానాల,



గోస్పాడు, జొలదరాశి, కోవెలకుంట్ల, నొస్సం గ్రామాలకు బైపాస్ నిర్మించనున్నారు. మార్గమధ్యలో నొస్సం దగ్గర రైల్వే ట్రాక్‌పై రోడ్ ఓవర్ బ్రిడ్జి, అల్లూరు వద్ద పాలేరు వాగుపై, రూపనగుడి చెరువు వద్ద భారీ వంతెనలు నిర్మించాల్సి ఉంది.

రహదారి నిర్మాణానికి రైతుల నుంచి 313 ఎకరాలు సేకరించారు. ఇందుకు రూ.115 కోట్లు కేటాయించారు. రూ.110 కోట్లకు మాత్రమే అవార్డు పాస్ చేశారు. ఇప్పటి వరకు 131 ఎకరాలకు సంబంధించి రూ.32 కోట్ల పరిహారం చెల్లింపులు జరిగాయి.

**పరిహారం త్వరగా ఇవ్వాలి – ఓబులమ్మ, కోవెలకుంట్ల**

కోవెలకుంట్లలో సర్వే నంబరు–867లో రెండెకరాలు పొలం ఉంది. రోడ్డు కోసం 16 సెంట్లు తీసుకొన్నారు. సెంటుకు రూ.18,500 చొప్పున రూ.2.96 లక్షల పరిహారం రావాల్సి ఉంది. ఇప్పటి వరకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. కొందరికి ఇచ్చారు.. మరికొందరిని మరిచారు.

# ఉత్తుత్తి కేంద్రాలు.. అక్రమాలకు మార్గాలు

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లోని పంట ఉత్పత్తులు చేతికొస్తున్నాయి. పత్తి, వేరుసెనగ, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పెసర, సజ్జ తదితర దిగుబడుల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వ్యాపారులు, దళారులు ఇప్పటికే పల్లెల్లో పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. పంట ఉత్పత్తులను రైతుల పేరుమీదే ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.35 లక్షల హెక్టార్లకు పైగా పత్తి సాగైంది. పత్తి తీసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఇదే అవకాశంగా పలువురు వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. క్వింటా రూ.6–7 వేల లోపు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడులకు సంబంధించి మార్కెట్ ఫీజు (సెస్సు) ఎగ్గొడుతున్నారు. మొక్కజొన్న దిగుబడులను సైతం భారీగా కొనుగోలు చేసి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. చాలామంది దళారులు, వ్యాపారులు రైతుల పేరుతో సరిహద్దులు దాటించేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**వసూలు అంతంతమాత్రమే..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన వాటిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవు. పత్తికొండలో టమాటా క్రయవిక్రయాలు మాత్రమే జరుగుతాయి.

కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ల పరిధిలో 2025–26 సంవత్సరానికి రూ.40.40 కోట్ల సెస్సు వసూలు లక్ష్యం కాగా.. ఆగస్టు వరకు కేవలం రూ.8.53 కోట్లు మాత్రమే వసూలైంది.

నంద్యాల జిల్లాలో ఎనిమిది విపణుల పరిధిలో రూ.26.66 కోట్లు లక్ష్యం కాగా.. గడిచిన ఆరు నెలల్లో రూ.10.40 కోట్లు మాత్రమే వచ్చింది.

**చేతివాటం ప్రదర్శిస్తూ..**

కర్నూలు జిల్లాలో 7, నంద్యాల జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 24 వ్యవసాయ తనిఖీ (చెక్‌పోస్టులు) కేంద్రాలున్నాయి. వీటిల్లో మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. వారి స్థానంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులైన సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తనిఖీ కేంద్రాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. బిల్లు పుస్తకాలు వారి వద్దే ఉంటున్నాయి. నాలుగైదు లారీల వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేస్తే ఒక లారీకి మాత్రమే సెస్సు వసూలు చేస్తున్నారు. మిగిలిన లారీలను ముడుపులు తీసుకొని పంపేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది.

# జగత్ 'కంది'లీలు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలోని కందిపప్పు మిల్లుల నుంచి ప్రభుత్వానికి సరకును సరఫరా చేసినట్లు దొంగ వేబిల్లులు సృష్టించారు. పెద్దఎత్తున నిధులు పక్కదారి పట్టించారు. గత ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించి దాడులు జరిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 70 వరకు కంది పప్పు మిల్లులున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని పలు కంది పప్పు మిల్లుల నుంచి గుత్తేదారు సంస్థ ప్రతి నెలా కందిపప్పును పౌరసరఫరాల శాఖకు సరఫరా చేసే బాధ్యత తీసుకుంది. ఈ క్రమంలోనే కొందరు బినామీ సంస్థ ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. కర్నూలు జిల్లాలో 15, నంద్యాల జిల్లాలో 10 మిల్లుల ద్వారా కందిపప్పు కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో నమోదు చేశారు. వాస్తవంగా ఈ మిల్లుల్లో అసలు కొనుగోలు చేయలేదు. ఉత్తుత్తి లెక్కలు చూపి ప్రభుత్వ దస్త్రాల్లో సరకు సరఫరా చేసినట్లు చూపారు.

**రైతులకు చెల్లించినట్లు..**

కొందరు మిల్లుల యజమానులు డోన్, కోవెలకుంట్ల, ప్యాపిలి, నంద్యాల, ఆదోని, ఆలూరు, పత్తికొండ, కర్నూలు తదితర ప్రాంతాల్లోని రైతుల నుంచి కందులు కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో నమోదు చేశారు. మిల్లుల్లో మర పట్టించి ప్రభుత్వానికి సరఫరా చేసినట్లు వేబిల్లులు సృష్టించారు. ఇదే క్రమంలో ప్రభుత్వం నుంచి సొమ్మును రైతులకు చెల్లించినట్లు 'లెక్క'లు రాశారు. ఈ లావాదేవీలన్నీ వాస్తవం కాదంటూ ఇటీవల అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తేలింది.

**కట్టు కథ అల్లి..**

గత ప్రభుత్వ హయాంలో కొందరు కందిపప్పు మిల్లర్లు కట్టుకథలు అల్లారు. మిల్లుల నుంచి సేకరించిన సరకు లోడు వాహనాలు పౌరసరఫరాల గోదాములకు వస్తున్నాయని చెప్పేవారు. వాహనం గోదాముకు రావడంతో కంది పప్పు వచ్చిందనేలా 'భ్రమ' కల్పించారు. కొద్దిసేపు వాహనాన్ని ఆపి సరకు అన్‌లోడ్ చేసినట్లు చూపేవారు. సరకు సరఫరా అయిందంటూ రూ.కోట్ల విలువైన దొంగ వేబిల్లులు సృష్టించారు. ఇందులో కొందరు మిల్లర్లతోపాటు కమీషన్ ఏజెంట్లు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాత్ర ఉందన్న ఆరోపణలున్నాయి.

# అప్రమత్తత వహించు.. 'గోల్డ్'మాల్ గుర్తించు..!



విశాఖపట్నం : నగరంలోని ఓ బంగారం దుకాణంలో ఆరేళ్ల కిందట ఓ మహిళ 46 గ్రాముల గాజులు కొనుగోలు చేశారు. వాటిని తాజాగా మార్చేందుకు అదే దుకాణానికి వెళ్లగా గాజుల బరువు 40 గ్రాములే ఉండడం చూసి అవాక్కయ్యారు. మోసపోయినట్లు భావించి తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు బిల్లు పరిశీలించి దుకాణానికి అపరాధ రుసుం విధించారు. ఏడాది కిందట పాత నగరంలోని ఓ దుకాణంలో పూసలతో కూడిన ఆభరణాన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. పూసలతో కలిపి తూకం వేసి బిల్లు ఇచ్చారు. వాస్తవానికి పూసలు, బంగారం వేర్వేరుగా బిల్లులో చూపించాలి. బిల్లుల తనిఖీ సమయంలో అధికారులు మోసాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు.

ప్రస్తుతం పసిడి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పది గ్రాములు కొనుగోలు చేయాలంటే రూ.1.20లక్షకుపైగా వెచ్చించాల్సి వస్తోంది. దీనికి ఇతర రుసుములు అదనం. ఏడాది వ్యవధిలో 10గ్రాముల ధర రూ.40వేల వరకు పెరిగింది. ఈ సమయంలో తూకం వేసేటప్పుడు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ట్యాగ్ తీసి చూశారా?:** బంగారం దుకాణాల్లో ప్రతి ఆభరణానికి అది ఎన్ని గ్రాములో తెలిపే ఒక ట్యాగ్ ఉంటుంది. అది తొలగించి విలువ లెక్కించారా లేదా అనేది తనిఖీ చేసుకోవాలి. ట్యాగ్ మీద రాసున్న బరువు.. దాన్ని తొలిగించాక చూపిస్తేనే కొనాలి.

**మార్పిడి సమయంలో..:** వినియోగదారులు పాత బంగారాన్ని మార్చుకునేటప్పుడు అక్కడే కరిగించి బరువును తూసి విలువ కడతారు. తర్వాత దుకాణంలోనే మరో ప్రాంతంలో బరువును తనిఖీ చేసుకొని అనుమానం నివృత్తి చేసుకుంటే మంచిది.

**పూసలతో జాగ్రత్త..:** ఆభరణాల్లో పూసలు, ముత్యాలు, రంగురాళ్లు, పగడాలతో కూడిన డిజైన్లు ఉంటాయి. కొందరు వాటితో కలిపే బంగారం విలువ లెక్కిస్తారు. ఉదాహరణకు నల్లపూసల హారం తీసుకుంటే అందులో బంగారం విలువ, పూసల ధర వేరువేరుగా బిల్లులో చూపాలి. అలా చూపకపోతే అడిగే హక్కు వినియోగదారుడికి ఉంది.

**అనుమానం వస్తే తనిఖీ చేయొచ్చు..:** బంగారం కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. తూనిక యంత్రాల్లో అనుమానం ఉంటే తనిఖీ చేయమనే హక్కు ఉంది. మాకు ఫిర్యాదు చేసినా వారి ముందే పరిశీలన చేయిస్తాం. అధికారులను బృందాలుగా నియమించి బంగారం దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నాం. థామస్ రవికుమార్, డిప్యూటీ కంట్రోలర్, తూనికలు కొలతలశాఖ

మోసపోయినట్లు గుర్తిస్తే 1967 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

# ప్రకటనలు బారెడు.. ఆదాయం మూరెడు



విశాఖపట్నం : జీవీఎంసీకి ప్రకటన బోర్డుల ద్వారా వచ్చే ఆదాయానికి గండికొట్టి..గుత్తేదారుకు లబ్ధి చేకూరేలా పలువురు అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. 635 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన విశాఖ నగరంలో ప్రకటనల బోర్డులకు మంచి గిరాకీ ఉంది. పక్కా ప్రణాళికతో సాగితే వీటిని జీవీఎంసీకి మంచి ఆదాయ వనరుగా మార్చవచ్చు. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

**ఏళ్లుగా మారని తీరు:** నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి పదేళ్ల కిందట ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందుకుగానూ రహదారి మధ్యలో ఒక పోల్‌పై ప్రకటనల బోర్డులు (కాంటీలీవరు) ఏర్పాటు చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని తెలిపింది. ఈ మేరకు 30 ప్రాంతాల్లో ఓ సంస్థ ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీనిపై ఓ పోటీ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. నిబంధనల ఉల్లంఘన చోటుచేసుకోవడంతో టెండరు ద్వారా అప్పగించాలని న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

**జీవీఎంసీకి రూ.కోట్ల నష్టం..:** న్యాయస్థానం ఆదేశాల మేరకు బోర్డులు పెట్టిన సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టారు. తర్వాత టెండరు ద్వారా అప్పగించాల్సిన బోర్డులను గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ గుత్త సంస్థకు నామినేషన్‌పై కేటాయించారు. ఇప్పటికీ ఆ సంస్థే కొనసాగు తుండటంతో జీవీఎంసీ ఏటా రూ.7కోట్ల వరకు ఆదాయం కోల్పోతోంది. పలువురు అధికారులు ముడుపులు తీసుకుంటూ టెండర్లు వేయనీయడం లేదని సమాచారం.

2025–2026 ఆర్థిక సంవత్సరానికి ప్రకటన (కాంటీలీవరు) బోర్డులకు టెండర్లు పిలవకుండా పాత సంస్థనే కొనసాగిస్తున్నారు. వీటి ద్వారా ఏడాదికి రూ.10కోట్ల నుంచి నుంచి రూ.12కోట్ల వరకు ఆ గుత్త సంస్థకు ఆదాయం వస్తోందని అంచనా. అయితే కేవలం రూ.20లక్షల నుంచి రూ.40లక్షలకు నామినేషన్ పద్ధతిపై ఇవ్వడానికి సిద్ధమవడం గమనార్హం.

**చర్యలు తీసుకుంటాం:** కాంటీలివర్లను నామినేషన్‌పై ఏటా 10శాతం ధరను పెంచి ఇస్తున్నాం. కొన్నింటిని జీవీఎంసీ ఆధీనంలో ఉంచి ప్రభుత్వ ప్రకటనలు వేస్తున్నాం. ఇంకా ఆదాయం వచ్చే మార్గాలుంటే ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. మీనాకుమారి, నగర ప్రణాళికాధికారిణి

# ఆక్రమణల'వంక' చూడరు



ఎమ్మిగనూరు : తక్కువ ధరలకు స్థలాలు వస్తుండటంతో పలువురు కొనుగోలు చేశారు. వంకల్లో ప్లాట్లు వేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇదే కొనుగోలుదారులకు శాపంగా మారింది. భారీ వర్షాలు పడిన సమయంలో కాలనీలను నీరు ముంచెత్తుతోంది.

నమ్మి మోసపోయి..ఎమ్మిగనూరు పట్టణంలోని తిరుమల్ నగర్ కాలనీలో 40 అడుగుల వెడల్పు ఉన్న వంకను చాలావరకు చదును చేసి ఆక్రమించేశారు. ఇక్కడ సెంటు రూ.5 లక్షలకుపైగా ఉంది. వంక పొడవునా ప్లాట్లు వేయగా పలువురు వీటిని కొనుగోలు చేశారు. తిరుమల్ నగర్‌తోపాటు క్లబ్ ఏరియా, అయ్యప్ప స్వామి గుడి వెనుక భాగం, సోమప్ప నగర్ శివారు, సున్నంబట్టీ వీధి తదితర ప్రాంతాల్లో ఉన్న వంక స్థలాలను అక్రమార్కులు అమ్మేశారు. వీటిని జనం పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. స్థిరాస్తి వ్యాపారులు అమాయకులను ముంచి రూ.కోటికిపై గానే సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడితే చాలు.. ఇళ్ల మధ్యలోనే పెద్దఎత్తున నీరు నిలిచిపోతోంది. నీరు బయటకు వెళ్లే మార్గం లేక దుర్గంధం వస్తోంది.

**వర్షం నీరు ముంచెత్తి**సాయినగర్ కాలనీలో సుశీలమ్మ వంక నీరంతా స్థలాల్లో నిలిచిపోతోంది. దోమల బెడదతో జనం అల్లాడుతున్నారు. వెంకటరమణ కాలనీలో రెండు అడుగుల మేర నీరు నిల్వ ఉంటోంది. తిరుమల్ నగర్, వెంకటసాయి గుడి సమీపం, అన్నమయ్య కూడలి, సోమప్ప నగర్, శాంతి నగర్, మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీ ప్రాంతాలు నీటి మడుగులను తలపిస్తున్నాయి. కాల్వలు, వంతెనలు లేకపోవడంతో నీరు కదలక జనం ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో 25 వేల మందికిపైగా జనం నివసిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వదిలాం. వంకల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. వీటిపై విచారణ జరిపి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తాం. ఆక్రమణలపై దృష్టి పెట్టి సరిహద్దులు ఏర్పాటుచేస్తున్నాం. గంగిరెడ్డి, కమిషనర్

# రుణం.. అతివలకు ఆర్థిక బలం

పుట్టపర్తి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధుల యూనిట్ల ఏర్పాటుకు వెలుగు, పశు సంవర్ధకశాఖ సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. బ్యాంకు లింకేజీ ఆధారంగా పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్త్రీనిధి తదితర రుణాలు అందించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ప్రస్తుతం పాడి ఆవుల యూనిట్లు మంజూరు చేయనున్నారు. అన్యువల్ క్రెడిట్ లైవ్లీహుండ్ ప్లాన్ (ఏసీఎల్‌పీ) కింద జిల్లాలో 24,207 సంఘాల పరిధిలోని 1,77,040 మంది సభ్యులకు రూ.2,093 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులతో గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల తదితర యూనిట్ల ఏర్పాటుకు ఎంపికలు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులకు ఆసక్తి ఉన్న యూనిట్లు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు.

**రాయితీలు ఇలా..**

జీవనోపాధి కింద అందించే రుణాల్లో రూ.లక్ష విలువ చేసే యూనిట్‌కు రూ.35వేలు రాయితీ కాగా రూ.65 వేలు బ్యాంకు రుణం



అందిస్తోంది. రెండు ఆవులు, రెండు గేదెలు, గొర్రెలు, మేకలు తదితర యూనిట్లు, షెడ్డు మొత్తం కలిపి రూ.2 లక్షలు కాగా, రూ.75 వేలు రాయితీ వస్తుంది. రూ.1.25 లక్షలు బ్యాంకు రుణం అందిస్తుంది. బేకరి, పేపరు ప్లేట్ల తయారీ కింద యూనిట్ రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుంది. వ్యవసాయ పరికరాలు, వరికోత యంత్రం తదితర వాటికి రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు రుణం అందిస్తారు. వీటికి లక్షకు రూ.35 వేలు చొప్పున రాయితీ అందజేస్తారు.

జిల్లా: శ్రీసత్యసాయి
మండల సమాఖ్యలు: 32
మహిళా సంఘాలు : 33,342
సభ్యులు: 1,77,040
రుణ లక్ష్యం: రూ.2,093 కోట్లు

# కుక్కే కదా అని వదిలేస్తే.. కరుస్తోంది!

నర్సీపట్నం: ఆ.. ఏ ముందులే. వీధి కుక్కలే కదా అని వదిలేస్తే.. వాటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఏ వీధికి వెళ్లిన పదుల సంఖ్యలో సంచరిస్తున్నాయి. వాహన చోదకుల వెంట పడుతున్నాయి. ఆహారం దొరక్క పిల్లలు, పెద్దలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల రావికమతంలో 27 మందిపై కుక్క దాడి చేయగా.. వారిలో ఐదుగురు నర్సీపట్నం ప్రాంతీయాసుపత్రిలో చికిత్స పొందారు.

1.మన్యానికి ముఖద్వారంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా నర్సీపట్నంకు చుట్టుపక్కల మండలాల నుంచి నిత్యం వేలాది మంది వస్తుంటారు. పట్టణ పరిధిలో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయి. ఇవి గుంపులుగా తిరుగుతుండటంతో వాటి బారినపడకుండా తప్పించుకు వెళ్లడం కష్టమవుతోంది. నర్సీపట్నంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రతి నెలా వంద నుంచి రెండు వందల మంది కుక్కకాటు బాధితులు ప్రాంతీయ ఆసుపత్రికి వస్తున్నారు.

2.జిల్లా వ్యాప్తంగా గ్రామ సింహాల నియంత్రణ చర్యలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. శాస్త్రీయ పద్ధతిలో వాటి సంతతి నిరోధించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. పెదబొడ్డేపల్లి పాత పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటైన శస్త్రచికిత్స కేంద్రాన్ని జిల్లాలో ఏ మండలానికి చెందిన వారైనా వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలి. ఈ కేంద్రానికి పశువైద్యుడు, సహాయకుడిని నియమిస్తే చుట్టుపక్కల పంచాయతీలు, మండల కేంద్రాలకు చెందిన అధికారులు జాగిలాల పునరుత్పత్తిని నిరోధించేలా చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది. 3.గ్రామ సింహాల సంచారంతోపాటు వాటి సంతతి వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదే. జిల్లాలో ఎక్కడా లేని విధంగా నర్సీపట్నంలో కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేకంగా కేంద్రం ఉంది. రూ. 8 లక్షల వ్యయంతో ఆపరేషన్ థియేటర్, కెన్నల్స్ ఏర్పాటు చేశారు. ఆరు నెలల కిందట 244 వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, 450 కుక్కలకు యాంటీ రేబిస్ ఇంజక్షన్లు వేయించారు. ఆ తర్వాత శస్త్రచికిత్సలు చేయకుండా కుక్కలను పట్టుకుని 15 కి.మీ. దూరంలో వదిలేయడం చేస్తున్నారు. దూరంగా తీసుకువెళ్లి వదిలేసినవి రెండు, మూడు రోజులకు తిరిగొస్తు న్నాయి. ఆరు నెలలుగా శస్త్రచికిత్సలు లేకపోవడంతో వాటి సంతతి పెరుగుతోంది. 4.చేపలు, మాంసం మార్కెట్ల వద్ద కుక్కల గుంపు ఎక్కువగా ఉంటోంది. మాంసం వ్యర్థాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి భూమిలో పాతిపెట్టాల్సి ఉండగా.. వ్యాపారులు దుకాణాల వద్ద కుక్కలకు విసిరేస్తున్నారు. సమస్యను మున్సిపల్ కమిషనర్ సురేంద్ర దృష్టికి తీసుకెళ్లగా.. పట్టణంలో పరిశీలన చేసి శస్త్రచికిత్సలు చేయాల్సిన కుక్కలను గుర్తిస్తామన్నారు. సంతతి వృద్ధి చెందకుండా చర్యలు చేపడతామన్నారు.

# పుంత రోడ్డులో ఆక్రమణలు

పాయకరావుపేట : 'ఇక్కడో స్థలం ఉండాలి. మీకెవరికైనా తెలుసా. తెలిస్తే కాస్త చెబుదురూ..' ఇదేదో సినిమా డైలాగులా ఉందనుకుంటున్నారా. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పాయకరావుపేటలో పంచాయతీ స్థలాల చిరుమానా గల్లం కావడంతో అధికారులు వెదుకులాట ప్రారంభించారు. పంచాయతీలో రికార్డులు సరిగా లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మండల స్థాయి అధికారులకు తలబొప్పి కడుతోంది. తీగలాగితే డొంక కదిలిందన్న చందంగా పంచాయతీ స్థలాల మాయంపై రోజుకో ఫిర్యాదు జిల్లా స్థాయి అధికారులకు చేరుతోంది. గత నెలలో లేఅవుట్ల అక్రమాలపైలో కథనాలు ప్రచురితమయ్యాయి. హోం మంత్రి అనిత స్పందించి విజిలెన్సు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. రాజుగారిబీడులో పంచాయతీ స్థలం చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రహరీని అధికారులు తొలగించగా.. తాజాగా మరో భూబాగోతం వెలుగులోకి వచ్చింది.

పేటలో 25 ఏళ్ల కిందట పంచాయతీరాజ్ అతిథి గృహం ఎదురుగా లేఅవుట్ వేశారు. అప్పట్లో పంచాయతీకి 520 గజాల స్థలం కేటాయించారు. దీని పక్కనే సర్వే నంబరు 131/1, 2, 3లో 150 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పుతో జాతీయ రహదారి వరకు పొడవైన పుంత ఉండేది. క్రమేణా పుంత వెడల్పు పది అడుగులకు తగ్గిపోయింది. చుట్టూ ఇళ్లు వెలిశాయి. పుంత స్థలాన్ని ఆక్రమించి నిర్మించుకున్న ఇళ్లకు పంచాయతీ అధికారులు అనుమతులు ఇచ్చేశారు.

ఇటీవల పుంత రోడ్డులో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. పుంత స్థలంలో కట్టడాలున్నట్లు గుర్తించారు. ఇక్కడ ఉండాల్సిన 520 గజాల స్థలం కనిపించలేదు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి చేరిపోయింది. రూ.కోట్ల విలువైన స్థలాలు రియల్టర్లతో కుమ్మక్కై పంచాయతీ సిబ్బంది ధారాదత్తం చేశారన్న విమర్శలున్నాయి.

చురకలు



# సెజ్‌లో కంకర కింకరులు



రాంబిల్లి : సెజ్ స్థలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతంలో ఏపీఐఐసీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆ స్థలాల్లో తవ్వకాలు జరిపితే సమాచారం ఇవ్వాలని ఆ బోర్డుపై ఏపీఐఐసీ జెడ్ఎం, డీజెడ్ఎంల చరవాణి నెంబర్లు నమోదు చేశారు. అయినా యథావిధిగా తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.

జాతీయ, అంతర్జాతీయస్థాయి పరిశ్రమలతోపాటు పలు రసాయన, ఫార్మా కంపెనీలు ఏర్పాటైన అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), నాన్ సెజ్‌లో ఖాళీగా ఉన్న స్థలాల్లో కొందరు అక్రమార్కులు దర్జాగా కంకర, మట్టిని తరలించుకుపోతున్నారు. సెలవు రోజుల్లో, రాత్రివేళ జనసంచారం లేనిచోట ఉన్న స్థలాల్లో యంత్రాలతో ఇష్టమొచ్చినట్లు తవ్వేస్తున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సెజ్ కోసం సుమారు 9,280 ఎకరాలు సేకరించారు. పరిశ్రమల కోసం సెజ్, నాన్ సెజ్‌గా విభజించి అన్ని మౌలిక వసతులతో ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఇంకా 230 ఎకరాల వరకు పరిశ్రమలకు కేటాయించని స్థలం ఉంది. ఈ లేఅవుట్‌లో ఎకరా ధర రూ. 1.50 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతటి విలువైన స్థలాల్లో కంకర, మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కంకర దొంగలు ఈ ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకొని తవ్వకాలు చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో కొన్నిచోట్ల ఏపుగా కంచె చెట్లు పెరిగిపోవడంతో రహదారులపై వెళ్లేవారికి కంకర తరలించే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంది. దీంతో అవకాశం కుదిరినప్పుడల్లా తవ్వేస్తున్నారు. అయిదు రోజుల క్రితం దీనిపై సమాచారం అందడంతో స్థానిక పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకున్నారు. కంకర, మట్టి తవ్వకాలపై పోలీసులు, ఏపీఐఐసీ అధికారులు నిఘా ఉంచినట్లు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**నిఘా ఉంచాం :** సెజ్, నాన్ సెజ్ ఖాళీ స్థలాల్లో గతంలో తవ్విన గుంతలే ఉన్నాయి. భద్రతా సిబ్బందితో నిరంతరం నిఘా కొనసాగుతోంది. మట్టి, కంకర అక్రమంగా తవ్వి తరలించేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో మట్టి తవ్విన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. సెజ్‌లో ప్రస్తుతం ఎక్కడా ఎటువంటి తవ్వకాలు జరగడం లేదు.
– కె.సూర్యనారాయణ, ఏపీఐఐసీ, డీజడ్ఎం

# నాడి పట్టి.. నడక నేర్పి

కర్నూలు :ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు చెందిన నాగమ్మ (72)కు గత నెల 22న కాలు.. చేయి పడిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే సర్వజన వైద్యశాలలోని న్యూరో ఐసీయూలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేసి వారం పాటు చికిత్స అందించారు. ఆరోగ్యం కొంతమేర కుదుటపడింది. దీంతో ఆమెను జనరల్ వార్డుకు మార్చారు. మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆమెకు వైద్యం చేశారు.

నేటి ఆధునిక సమాజంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పలువురు పక్షవాతం బారిన పడుతున్నారు. నరాల సమస్య, స్పాండిలోసిస్, సయాటిక తదితర వాటితో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సిందే. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇలాంటి బాధితులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉంచి రోగులకు సేవలందిస్తున్నారు.

న్యూరో ఫిజీషియన్ విభాగంలో ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. మిగతా రోజుల్లో అత్యవసరమైనవారికి వార్డు వద్ద ఓపీ సేవలు అందిస్తారు. కాలు.. చేయి పడిపోయినవారికి అత్యవసర విభాగంలో ప్రాథమిక చికిత్స చేసి న్యూరో ఫిజీషియన్ విభాగంలోని ఐసీయూలో వైద్య సేవలందిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాక వివిధ ప్రాంతాల నుంచి ప్రతి నెలా 1,500 నుంచి 2 వేల వరకు ఓపీ ఉంటుంది. ఐసీయూతోపాటు వార్డుల్లో ప్రతి నెలా 150 మంది రోగులకు చికిత్స అందిస్తుంటారు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. లేకున్నా కార్పొరేట్ సేవలు అందిస్తున్నారు.

**పది పడకలతో ప్రత్యేక వార్డు**

వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు న్యూరో ఫిజీషియన్ విభాగానికి నిత్యం వస్తుంటారు. రెండేళ్ల కిందటి వరకు ఈ విభాగానికి ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) అందుబాటులో ఉండేది కాదు. జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు రోగులను ఏఎంసీలో చేర్చుకొని చికిత్స అందించేవారు.

ప్రస్తుతం 10 పడకలతో ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) ఏర్పాటు చేశారు. ఫలితంగా బాధితులకు సాంత్వన లభించింది. రక్తపోటు ఎక్కువై కాలు.. చేయి పడిపోయినవారు.. పక్షవాతంతో బాధపడేవారు, మెదడులో కణితులు ఉన్నవారికి న్యూరో ఐసీయూ విభాగంలో వైద్యం అందిస్తున్నారు. ఉత్తమ సేవలు అందుతుండటంతో ఇక్కడ చికిత్స పొందుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఉత్తమ సేవలందిస్తున్నాం న్యూరో ఫిజీషియన్ విభాగంలో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) పెట్టిన తర్వాత చికిత్స పొందేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నాం. డీఎం విద్యార్థులు అందుబాటులో ఉండటంతో రోగులకు 24 గంటలపాటు ఉత్తమ సేవలు వైద్యం అందిస్తున్నాం.
డా.శ్రీనివాసులు, న్యూరో ఫిజీషియన్ విభాగాధిపతి

# ఎర్రమట్టి.. కొల్లగొట్టి

కుందుర్పి: కుందుర్పి మండలంలో పలుచోట్ల సహజసిద్ధంగా ఏర్పడిన ఎర్రమట్టి కొండలను కొందరు ఆదాయార్జనే ధ్యేయంగా పొక్లెయిన్లు, జేసీబీ యంత్రాల సాయంతో కొల్లగొడుతున్నారు. ఈ మట్టిని ఎక్కువగా నూతన గృహ నిర్మాణాల్లో బేస్‌మట్టం, పూడికకు వినియోగిస్తుంటారు. వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు సైతం భూమిలో సత్తువకు ఈ మట్టిని వాడుతుండటంతో అధిక డిమాండు ఏర్పడింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**రాత్రిళ్లు కొనసాగుతున్న తవ్వకాలు**మహంతపురం– బెస్తరపల్లి గ్రామాల మధ్య ఉన్న మట్టికొండను నిత్యం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ జేసీబీ సాయంతో తవ్వించి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బెస్తరపల్లి సమీపం నుంచి కర్ణాటకకు కూడా దీనిని రవాణా చేస్తున్నట్లు ఆ ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కుందుర్పి



నుంచి అపిలేపల్లికి వెళ్లే పూలదిబ్బను(ఎర్రమట్టి దిబ్బ) గతంలో అక్రమార్కులు అనేకచోట్ల తవ్వించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన దారికి ఆనుకుని ఉన్న ఈ మట్టిదిబ్బల తవ్వకాన్ని అధికారులు గుర్తించి నిలిపివేయడంతో అక్రమార్కులు వారి పంథా మార్చుకున్నారు. రాత్రుళు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేస్తున్నారు. కుందుర్పి నుంచి బొమ్మాజిపల్లికి వెళ్లే దారి పక్కనున్న నిమ్మాజిగుట్ట రాతిబండ వరకూ మట్టిని ఇప్పటికే తవ్వేశారు.

**సిబ్బందితో నిఘా పెడతాం :** తిప్పేస్వామి ఉప తహసీల్దార్, కుందుర్పి కొండల్లోని ఎర్రమట్టి అక్రమ తవ్వకాల నివారణకు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తవ్వకం దారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# రద్దీ రహదారులకు మహర్దశ

సూళ్లూరుపేట : జిల్లాలోని రహదారులు, భవనాల శాఖ పరిధిలోని రోడ్లకు మంచి రోజులొచ్చాయి. గతంలో జిల్లాలో బాగా రద్దీగా ఉండి రాకపోకలు అధిక సంఖ్యలో సాగే రహదారులను గుర్తించి, ఎన్‌డీబీ కింద ఆధునికీకరించాలని తలచారు. ఆ మేరకు నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడంలో జాప్యం చేయడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి తాజాగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టాలని నిర్ణయించింది.**హ్యామ్ అంటే?..** జిల్లాలో ఇప్పటి వరకు ఈ విధానంతో ఎక్కడా రహదారుల పనులు చేయలేదు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) విధానంలో రహదారుల నిర్మాణాల నిధుల్లో ప్రభుత్వం ముందుగా 40 శాతం భరిస్తుంది. మిగతా 60 శాతం నిధులను బ్యాంకు రుణం ద్వారా గుత్తేదారునికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటుంది. ఈ మొత్తం నిధులతో గుత్తేదారు రహదారులను బాగు చేస్తారు. రుణాన్ని ప్రభుత్వం 15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. గుత్తేదారు 15 ఏళ్ల పాటు రహదారుల నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో జిల్లాలోని సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో కొన్ని రహదారులను ఎంపిక చేశారు.

**రహదారులను పరిశీలిస్తే..** సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రహదారి పెరిమిటిపాడు వరకు రెండు వరుసలుగా ఉంది. అక్కడి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ వరకు విస్తరించేందుకు 2018లో ఎన్‌డీబీ నిధులు మంజూరు చేశారు. 2019లో టెండర్లు నిర్వహించగా చిత్తూరుకు చెందిన పీఎల్ఆర్ సంస్థ టెండరు దక్కించుకుంది. వైకాపా ప్రభుత్వంలో మంత్రులు శిలాఫలకం వేయగా అక్కడక్కడ కల్వర్టు పనులు చేసినా విస్తరణ పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి నూతన విధానంతో బాగు చేయాలని నిర్ణయించింది.

# ఘాట్‌లకు పుష్కర శోభ..!



రాజమహేంద్రవరం : రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటోంది. పుష్కరాలకు ప్రధానమైనవి ఘాట్‌లు. అఖండ గోదావరి మొదలుకుని దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, పోలవరం ఐలాండ్ ప్రాజెక్టు ఏటిగట్ల వెంబడి నదీపాయల చెంతన కొత్తగా ఘాట్‌లు నిర్మిస్తారు. పాత వాటికి మరమ్మతులు చేయటంతోపాటు అఖండ గోదావరి ఎడమ ఏటిగట్టును రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం రూ.620.97 కోట్లతో ఆయా అభివృద్ధి పనులు చేసేందుకు నియోజకవర్గాలు, మండలాలవారీగా పనులను గుర్తించారు.

**కొత్తగా 97 ఏర్పాటు..**

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని 16 నియోజకవర్గాలకు సంబంధించి 34 మండలాల్లో కొత్తగా 97 ఘాట్‌ల నిర్మాణం, 250 ఘాట్‌లకు మరమ్మతులు చేపడతారు. అఖండగోదావరి ఎడమ ఏటిగట్టును కాతేరు నుంచి బొబ్బిల్లంక, కోటిలింగాలఘాట్ నుంచి కాతేరు, బొబ్బిలంక నుంచి సీతానగరం వరకు మొత్తం 18.60 కిలోమీటర్ల పొడవునా రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు రూ.251.70కోట్ల నిధులు అవసరం ఉంటుందని ప్రతిపాదించారు. 97 కొత్తఘాట్‌ల నిర్మాణానికి రూ.91.28కోట్లు, 250 పాత ఘాట్‌ల మరమ్మతులకు రూ.277.99 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేశాం..**

గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ పరిధిలో కొత్తగా నిర్మించాల్సిన ఘాట్‌లు, ఉన్నవాటికి మరమ్మతులు చేయటంతోపాటు అఖండ గోదావరి ఎడమ ఏటిగట్టును అభివృద్ధి చేసే వంటి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఆయా ఎమ్మెల్యేలు, మంత్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి ఆయా పనులకు ప్రాధాన్యతను కల్పించాం. తయారుచేసిన ప్రతిపాదనలు జిల్లాల కలెక్టర్లకు అందజేశాం. గంగుమళ్ల శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ), గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్, ధవళేశ్వరం

# నిధులొచ్చాయ్.. పనులు చేయండి




కాకినాడ : స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘ నిధులను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా విడతల వారీగా మంజూరు చేస్తుంది. గత అయిదేళ్లలో కేంద్రం ఇచ్చిన వాటిని గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి సొమ్ము ల్లేని దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంఘ నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకే జమయ్యేలా చర్యలు చేపట్టారు. గతేడాది సెప్టెంబరు, నవంబరుల్లో నిధులు రాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి మూడోవిడత సైతం పంచాయతీలు, మండలాలు, జడ్పీలకు జమ అయ్యాయి.

**జడ్పీకి రూ.12 కోట్లు**

జిల్లా పరిషత్‌కు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి రెండో త్రైమాసిక నిధులు రూ.12 కోట్లు విడుదల అయ్యాయి. వీటిలో టైడ్ గ్రాంటు కింద రూ.7.25 కోట్లు, బేసిక్ గ్రాంటు కింద రూ.4.84 కోట్లు వచ్చాయి. టైడ్ నిధుల్లో 50 శాతం తాగునీరు, పారిశుద్ధ్యానికి ఖర్చు చేయాలి. బేసిక్ గ్రాంటుతో కార్యాలయాల నిర్వహణ, మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలి. మిగిలిన వాటిని సమగ్ర తాగునీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణకు వినియోగించాలి.

**మండలాలకు ఇలా..**

జిల్లాలో 21 మండలాలకు బేసిక్ గ్రాంటు రూ.9.40 కోట్లు, టైడ్ గ్రాంటు రూ.14.10 కోట్లు విడుదల అయ్యాయి. వీటిని తాగునీరు, పారిశుద్ధ్యం, కార్యాలయాల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులకు మార్గదర్శకాల మేరకు ఖర్చు చేయనున్నారు.

**పంచాయతీలకు రూ.24.47 కోట్లు**

ఎన్నికలు జరగని వాటికి మినహా మిగతా 375 పంచాయతీలకు రూ.24.47 కోట్లు మంజూరయ్యాయి. వీటితో అనేక పనులు చేపట్టే అవకాశముంది. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల్లో అధిక శాతం వైకాపా ఏలుబడిలోనే ఉన్నాయి. వారు గత ప్రభుత్వంలో ఒక్క పని కూడా చేయలేకపోయారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది.

**సద్వినియోగం చేసుకోండి..**

గ్రామాలు, మండలాలకు ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యాయి. వాటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నిధుల వినియోగంపై ప్రస్తుతం ఎటువంటి ఆంక్షలు లేవు. మార్గదర్శకాల మేరకు ఖర్చు చేయాలి. వీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీ సీఈవో

# మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

రాజానగరం : కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చింది. మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చుతామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. ఈ మేరకు ప్రభుత్వం కేంద్రాల స్థాయిని పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 25 కేంద్రాలకు స్థాయి పెరగనుంది. జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఏడు ఉన్నాయి. వీటి పరిధిలో 25 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్‌గా అప్‌గ్రేడ్ అయ్యాయి.

**ప్రయోజనాలు ఎన్నో** మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఇప్పటివరకు ఒక్క కార్యకర్త మాత్రమే ఉండేవారు. ప్రభుత్వం అప్పగించే సర్వేలు, ఇతర కార్యక్రమాలు నిర్వర్తిస్తూ, కేంద్రానికి వచ్చే పిల్లల ఆలనా..పాలనా, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత తదితర సేవలు ఆ ఒక్కరే చేయాల్సి వచ్చేది. ఇటువంటి సేవల విషయంలో ఇబ్బందులు తలెత్తేవి. అత్యవసరమైతే తప్ప సెలవులు ఇచ్చే వారు కాదు. ప్రస్తుతం ఈ కేంద్రాల స్థాయి పెరగడంతో కార్యకర్త జీతం రూ.ఏడు వేల నుంచి రూ.11,500లకు పెరగనుంది. అదనంగా ఆయా (సహాయకురాలు) పోస్టు వస్తున్నందున మరొకరికి ఉపాధి అవకాశం లభిస్తుంది. లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించవచ్చు. జి.గౌరి, సీడీపీఓ, రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్

# ఇగ్నోలో ఉపాధి కోర్సులు

మద్దిలపాలెం : ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రస్తుత కాలానికి, ఉపాధికి దోహదపడే సరికొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది నుంచి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇగ్నో కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా కోర్సుల్లో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు తెలిపారు.

పర్యాటక రంగానికి అనుగుణంగా బ్యాచిలర్ ఇన్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ డిగ్రీలో మూడేళ్లు కోర్సు ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. ఇంటర్ పూర్తిచేసిన వారు ఎవరైనా అర్హులే. ఆన్‌లైన్‌లో కూడా ఈ కోర్సును అందుబాటులో ఉంచారు. బీఏ ఒకేషనల్ విభాగంలో డిగ్రీ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్, హోమ్ సైన్స్ రంగం(బీఏ)లో మానవ అభివృద్ధి ఫ్యామిలీ స్టడీస్, సామాజిక వనరుల నిర్వహణ, పౌష్టిక ఆహారం, దుస్తుల తయారీ నిర్వహణ




వంటి విభిన్న శాస్త్రాల కలయికతో రూపొందించిన కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అంకుర సంస్థలు స్థాపించాలనుకునే వారికి ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి.

సోషల్ వర్కు విభాగంలో కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సోషల్‌వర్కును ప్రవేశపెట్టారు. వీటితోపాటు ఆన్‌లైన్‌లో ఎం.ఎస్.డబ్ల్యూ, మాస్టర్ ఇన్ సోషల్ వర్కు కోర్సులు ప్రారంభించారు.

వైద్య ఆరోగ్య రంగంలో ఆరు నెలల కాల వ్యవధితో నర్స్ మేనేజర్ కోర్సు, సర్టిఫికెట్ ఇన్ జరియాట్రిక్ హెల్త్ అండ్ కేర్(వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి) కోర్సు అందుబాటులో ఉంచారు.

జిల్లాలో గాజువాక ఎంవీఆర్, ప్రభుత్వ మహిళ డిగ్రీ, కేజీహెచ్ నర్సింగ్ కళాశాలల్లో, ఆంధ్రా యూనివర్సిటీలో, విశాఖ డెయిరీ పరిశ్రమలోని ఓ కార్యాలయంలో ఇగ్నో కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశాల కోసం ఈనెల 15 వరకు గడువు పొడిగించారు. ఆసక్తిగల వారు 0891–2511200 నెంబరులో, %www.ignou.ac.in% వెబ్‌సైట్‌ను సందర్శించాలని ధర్మారావు సూచించారు.

# ఆశ చూపి.. ముఖం చాటేసి!

నర్సీపట్నం : ఇంటిగ్రేటెడ్ ఫార్మర్ కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఇఫ్కో) పేరిట అనకాపల్లి జిల్లా పెదబొడ్డేపల్లిలో గత ఏడాది డిసెంబర్‌లో ఏర్పాటైన ఓ కార్యాలయం ఏడాది తిరగకముందే బోర్డు తిప్పేసింది. అధిక లాభాలొస్తాయని ఆశ చూపడంతో ముందూ వెనుకా ఆలోచించకుండా పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరకులను పొదుపు సంఘాల మహిళలకు అరువు ఇచ్చి వారపు వాయిదాలు వసూలు చేసే పద్ధతిలో ఇఫ్కో పేరిట అప్పట్లో వ్యాపారం మొదలుపెట్టారు. తొలుత నర్సీపట్నంలో కొంతమందికి అరువు పద్ధతిలో రూ.వెయ్యి విలువైన సరకులు ఇచ్చారు. వారానికి రూ.250 చొప్పున తిరిగి చెల్లించాలన్నది నిబంధన. ఈ విధానంలో వ్యాపారం చేయడం వల్ల లాభాలు బాగానే వస్తాయని, ఆసక్తి ఉన్నవారు ఎవరైనా పెట్టుబడి పెట్టవచ్చని కార్యాలయ సిబ్బంది ద్వారా ప్రచారం చేయడంతో పది మంది సుమారు రూ.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. వీరందరికీ ప్రతి నెలా రూ.5 వడ్డీ గిట్టుబాటయ్యేలా లాభాలు పంచుతామని ఆశ చూపారు.

రెండు, మూడు నెలలు గడిచినా పెట్టుబడికి అనుగుణంగా లాభాలు పంచకపోవడంతో కొందరు ఇఫ్కో యజమాని పి.శ్రీనివాసరావును నిలదీశారు. శారదానగర్‌కు చెందిన ఓ మహిళ రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. రెండు నెలలైనా లాభం ఇవ్వకపోవడంతో ఒప్పందం నుంచి తప్పుకొంటున్నట్లు చెప్పారు. ఒప్పందం రద్దయిన 45 రోజుల తర్వాత పెట్టుబడి, లాభం సొమ్ము తిరిగిస్తామని నమ్మించారు. ఆ గడువు ముగిసిపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు.శ్రీనివాసరావు ఆచూకీ లేకపోవడంతో కార్యాలయ నిర్వాహకుడు రెండు నెలల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్టుబడిదారులు ఫోన్ చేస్తే యజమాని ఇదిగో అదిగో అంటున్నారు. ఆయన ఎక్కడ ఉన్నారో కనిపెట్టేందుకు కొందరు ఆరా తీయగా తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో డి.మార్ట్ సమీపంలోని రోడ్డు నంబరు 5 బ్యాంకు కాలనీలో కార్యాలయం తెరిచినట్లు తెలిసి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. సరకులు పొందిన వారికి ఎలాంటి నష్టం లేకపోవడం, పెట్టుబడిదా రులు కొద్దిమందే ఉండటంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. నర్సీపట్నం మండలంలో మోసపోయిన వారిలో ఓ ప్రజాప్రతినిధి భర్త, ఓ సోషల్ మీడియా ప్రతినిధి, పలువురు గృహిణులు ఉన్నారు.

# కబళించి.. ఆక్రమించి

బనగానపల్లి : నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే చెరువుల్లో పూడిక పేరుకుపోవడం, ముళ్లకంపలతో నిండిపోవడం.. తూములు అధ్వానంగా ఉండటంతో రైతులు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆక్రమణలకు గురవుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవైంది. నియోజకవర్గ పరిధిలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో సుమారు 20 చెరువులు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా దద్దణాల, కుక్కలగుంట, ముక్కమళ్ల, కానాల, రామభద్రునిపల్లె, వేములపాడు, ఉప్పలపాడు, సంగపట్నం, మెట్టుపల్లె, తిమ్మనాయునిపేట చెరువులున్నాయి.

**కొద్దికొద్దిగా మాయమవుతూ..**

బనగానపల్లి మండలం బత్తులూరుపాడు పరిధిలో రాచెరువు ఉంది. సర్వే నంబరు 99 నుంచి 103 వరకు వంద ఎకరాల్లో విస్తీర్ణం ఉండాలి. పలువురు దీనిని ఆక్రమించుకోవడంతో పట్టుమని 20 ఎకరాలు కూడా కనిపించడం లేదు. గతంలో రెవెన్యూ అధికారులు 40 మందికి ఒక్కొక్కరికి ఎకరా చొప్పున చెరువుకు సంబంధించిన స్థలంలో పట్టాలిచ్చారు. మిగిలిన పొలాన్ని కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉండటంతో గతంతో ఈ చెరువును అభివృద్ధి చేసి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవుకు రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేసి నీటి కొరత లేకుండా చేయాలని నిర్ణయించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. పదేళ్ల కిందట చెరువు అభివృద్ధికి రూ.30 లక్షలు ఖర్చు పెట్టి తూములు, కాలువ పనులు చేపట్టినా ఫలితం లేకపోయింది.

**150 ఎకరాలకుపైగా ఆయకట్టు**

బనగానపల్లి పట్టణానికి 4 కి.మీ. దూరంలో కైప చెరువు ఉంటుంది. వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండాల్సి ఉంది. దీనికి ఎస్సార్బీసీ నీరు అందుతుంది. 150 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. చెరువులో నీరుంటే చుట్టుపక్కల 200 ఎకరాల్లో బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. ఇలాంటి చెరువును కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఐదేళ్ల కిందట చెరువుకు తూము, అలుగు నిర్మించి పంట కాలువలు బాగు చేశారు.

# స్వగృహమస్తు

అమలాపురం: పట్టణ పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయడమే కాకుండా కొత్తగా మంజూరు చేపడుతోంది. ప్రధానమంత్రి అవాస్ యోజన (అర్బన్) 2.0 కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణానికి రూ.2.50 లక్షలు అందజేయనున్నారు. దీనిలో రూ.1.50 లక్షలు కేంద్రం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ఉన్న మూడు పురపాలికలు, ఒక నగర పంచాయతీ పరిధిలో ప్రధానమంత్రి అవాస్ యోజన(అర్బన్) 2.0లో భాగంగా అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు అంగీకార్ పేరుతో ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. ఈ గృహాలకు పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సౌర విద్యుత్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులు స్వయంగా ఇళ్లను నిర్మించుకుంటారా.. నిర్మాణం చేపట్టి అప్పగించాలా.. అనే అంశాలపై వివరాలు సేకరిస్తారు. కొత్తగా ఇళు



లేని వారిని గుర్తిస్తే ఆ జాబితాలో చేర్చి లబ్ధిని చేకూర్చేందుకు అంగీకార్-2025 కార్యక్రమాన్ని చేపడతున్నారు.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట పురపాలికలు కాగా, ముమ్మిడివరం నగర పంచాయతీగా ఉంది. వీటి పరిధిలో మొత్తం 475 ఇళ్లు మంజూరు చేశారు. వీటిని అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 508 మంది నుంచి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**త్వరలోనే ప్రారంభం** ప్రధానమంత్రి ఆవాస యోజన (అర్బన్) 2.0 పథకంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం మంజూరైన వాటిని వారం రోజుల్లో పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుం టాం. ఇంకా 33 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి కూడా త్వరలోనే అనుమతులు వస్తాయి. నరసింహారావు, గృహనిర్మాణశాఖ పీడీ

## బీమా సఖి.. భవితకు తోడు

ముమ్మిడివరం: మహిళల ఉపాధి కల్పనకు ఉన్న అన్ని అవకాశాలను వారికి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంత అతివలకు చేయూతనిచ్చి కుటుంబాలకు ఆర్థిక చేదోడుగా ఉండేందుకు.. ఉపాధిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బీమాసఖి యోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి ఎల్ఐసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు జిల్లాలో ఏపీఎం, డీపీఎంలను నోడల్ అధికారులుగా నియమించింది.

**ప్రక్రియ ప్రారంభం**

'బీమా సఖి' మహిళల కోసం రూపొందించిన ప్రోత్సాహక పథకం. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారి నుంచి ఐఆర్‌డీఏ మార్గదర్శకాలకు అనుగుణంగా మూడేళ్ల కాల పరిమితితో జిల్లాలో 360 మందిని ఎంపిక చేయనున్నారు. నెలాఖరు నాటికి పూర్తిచేసి శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేయనున్నారు. తర్వాత వీరు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

**అర్హతలు ఇవీ..**



పదోతరగతి ఉత్తీర్ణత, 18-70 సంవత్సరాల లోపు వయసు
ఎల్ఐసీ (ఏజెంట్స్) నిబంధనలు 2017 ప్రకారం అర్హతలు కలిగి ఉండాలి. జీతభత్యాలు పొందే ఉద్యోగై ఉండకూడదు. ఏదైనా వ్యాపారం, ఉపాధి ద్వారా ఆదాయం పొందేవారు అనర్హులు
ప్రీరిక్రూట్‌మెంట్ పరీక్షకు హాజరు కావాలి
మూడేళ్ల పాటు ప్రోత్సాహకం బీమా సఖులుగా ఎంపిక చేసిన వారికి తొలిఏడాది ప్రతినెలా రూ.7 వేలు, రెండో ఏడాదిలో రూ.6 వేలు, మూడో ఏడాది రూ.5 వేలు వంతున ప్రోత్సాహక నగదు అందిస్తారు. సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలి. ఎంపిక పూర్తికాగానే శిక్షణ ఇచ్చి పథకాన్ని ముందుకు తీసుకెళ్తామని డీఆర్‌డీఏ పీడీ జయచంద్రగాంధీ తెలిపారు.

**జిల్లా వివరాలు..**

డ్వాక్రా సంఘాలు: 38,279
సంఘాల్లో సభ్యులు: 3,77,254
బీమా సఖులు : 360

## నీరు లాగదు.. తీరు మారదు

మొగల్తూరు : చేలల్లో నీరు బయటకు లాగే మురుగు కాలువలు గత పాలనలో ప్రక్షాళనకు నోచుకోలేదు. వేసవి ఎండలు తలపిస్తున్నా వాటిలో నేటికీ మోకాలు లోతు నీరు నిలిచి మడుగుల్లా ఉన్నాయి. దీంతో నరసాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు ఈ ఏడాది కూడా సార్వాలో సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

దర్భరేవు డ్రెయిను.. నరసాపురం మండలం రాజుల్లంక వద్ద ప్రారంభమయ్యే దర్భరేవు డ్రెయిను సారవ, ఎల్‌బీచర్ల, పసలదీవి, రామన్నపాలెం, మొగల్తూరు, మోడి గ్రామాల పరిధిలో సుమారు 25 కిలోమీటర్ల మేర ప్రవహించి ముత్యాలపల్లి వద్ద ఉప్పుటేరులో కలుస్తోంది. దీనికి పలు ప్రాంతాల్లో ఉన్న పైపు కల్వర్టులు ధ్వంసమయ్యాయి. ఇవి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. సముద్ర పోటు, వర్షాలకు చేల్లోకి చేరిన నీరు బయటకు వెళ్లడంలేదు. వాటిని తొలిగించి వంతెనలు నిర్మించాల్సి ఉంది. కాలువ పొడవునా కిక్కిస పెరిగి అడవిని తలపిస్తోంది. దీని ఆయకట్టులో సుమారు ఆరువేల ఎకరాల వరకూ భూములు ఉన్నాయి. వాటిలో నాలుగు వేల ఎకరాలు చేలను రైతులు ఆక్వాచెరువులుగా మార్పు చేశారు. మిగిలిన రెండు వేల ఎకరాల వరిచేలకు దాళ్వాలో సాగునీరందక, సార్వాలో ముంపు ప్రభావంతో గత నాలుగేళ్లుగా అన్నదాతలు సాగు విరామం పాటిస్తున్నారు. రుస్తుంబాద.. సీతారామపురం వద్ద ప్రారంభమై లికితపూడి, సరిపల్లి వద్ద నత్తలావలోకి ప్రవహిస్తుంది. రుస్తుంబాద డ్రెయిను ఆయకట్టులో సుమారు 12 వందల ఎకరాలు ఉండగా సార్వాలో ఆ భూములన్నిటికీ సాగుకు ముందుకు రావడంలేదు.

# కర్షకులకు గట్టుకాలమే



నందికొట్కూరు : ఏదేని సంస్థను ఏర్పాటుచేయాలంటే ముందుగా ఆ గ్రామ ప్రజలతో సమావేశమవ్వాలి. కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను వివరించాలి. ఓ సౌర పరిశ్రమ ప్రాజెక్టు నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వారి పొలాల్లో కంచె ఏర్పాటు చేయడంపై రైతులు మండిపడుతున్నారు. మిడుతూరు, నందికొట్కూరు, కల్లూరు మండలాల పరిధిలోని సుమారు 4 వేల ఎకరాల్లో ఓ కంపెనీ సోలార్ ప్రాజెక్టు పనులు చేపడుతోంది. ఒక్క మిడుతూరు మండలం పైపాలెంలోనే 700 ఎకరాల సాగు భూమిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు.

**జీవం తీస్తున్నారు** పైపాలెం, నాగలూటి గ్రామాల సమీపంలో సుమారు 1,200 ఎకరాల్లో గట్టు ప్రాంతం ఉంది. దీనిపై సుమారు రూ.36 లక్షలతో ఉపాధి పనుల కింద 18 ఫారంపాండ్స్‌ను ఏర్పాటు చేశారు. ఎనిమిది కుంటలను నిర్మించారు. ఆయా గ్రామాల్లోని పశువులు, జీవాల మేతకు, నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. ప్రస్తుతం సౌర పరిశ్రమ ఏర్పాటు నేపథ్యంలో ఫారంపాండ్స్, కుంటలను ఆక్రమించారు. దీంతో పశువులు, జీవాలకు మేత కరవైంది. చివరికి రైతులు వాటిని అమ్ముకుంటున్నారు. " పైపాలెంలో గతంలో 6 వేల జీవాలు ఉండగా.. ప్రస్తుతం 1,500 ఉన్నాయి.. విధిలేక అమ్మేసుకొంటున్నారు.. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని " ఉపాధి హామీ క్షేత్ర మాజీ సహాయకుడు శివకుమార్ పేర్కొన్నారు.

**దారులు మూసేశారు**

పైపాలెం రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఉపాధి పనులతోపాటు మార్కెట్ యార్డు నిధులతో రహదారులు నిర్మించుకున్నారు. దీన్ని ఆక్రమించుకున్నారు. కేశాలు, లక్ష్మన్న పట్టా పొలాల్లో ప్రాజెక్టు పనులకు సంబంధించి పర్యవేక్షణకు ఓ పూరిల్లు వేశారు. దీనిని తొలగించాలని కోరగా కొందరు దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారు. ఇదే గ్రామానికి చెందిన నాగశేషులు, నాగేశ్వరరావుకు చెందిన పొలంలో కంచె ఏర్పాటు చేశారు. ఎల్లమ్మకు చెందిన పొలంలో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్తు స్తంభాలు బిగించారు. " రెవెన్యూ అధికారులు సాగు భూమికి పట్టా ఇచ్చారు. 40 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. ప్రస్తుతం మా పొలంలోకి రానీయకుండా చుట్టూ కంచె వేశారు. చేసేది లేక కూలీ పనులకు వెళ్తున్నట్లు రైతు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

**పొలంలో కంచె వేశారు**

నాగశేషులు, పైపాలెం

మా పెద్దల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్నాం. సాగులో ఉన్న పొలంలో సోలార్ కంపెనీవారు దౌర్జన్యంగా కంచె వేశారు. వాటిని తొలగించడం కష్టంగా ఉంది. ప్రస్తుతం పొగాకు సాగు చేస్తున్నా. పొలంలో వాహనాలను ఇష్టానుసారంగా నడపడంతో పంట దెబ్బతింది. పొలాలకు వెళ్లే రహదారిని కబ్జా చేయడమేకాక మాకు దారి లేకుండా చేశారు. మా పొలాలకు వెళ్తుంటే అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

# రైతు నెత్తిన కమీషన్ కత్తి



ఎమ్మిగనూరు : వ్యవసాయ మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు రైతు నెత్తిన తూకం భారం మోపుతున్నారు. వేరుసెనగ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు ఎమ్మిగనూరు మార్కెట్‌కు పేరుంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు మండలాలతోపాటు అనంతపురం జిల్లాలోని పలు గ్రామాలు, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల రైతులు తీసుకొస్తుంటారు. పంట ఉత్పత్తులు తీసుకొచ్చిన రైతులు దించిన కూలీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దిగుబడులు కొనుగోలు చేసి వ్యాపారులు తూకం వేసినందుకు కూలీ డబ్బులు కమీషన్ ఏజెంట్లకు చెల్లిస్తారు. అయితే కమీషన్ ఏజెంట్లు వ్యాపారులు ఇచ్చే కూలీ డబ్బుతోపాటు మళ్లీ రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

**తక్‌పట్టీలు ఇవ్వకుండా మాయ**

మార్కెట్‌లో ఈ-నామ్ విధానం ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ తక్‌పట్టీలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. తక్‌పట్టీలో కమీషన్, కూలీ తదితర అంశాలు ఉంటాయి. వాటిని ఇక్కడ ఇవ్వడం లేదు.. కమీషన్ ఏజెంట్లు చీటీలపై రాసి ఇస్తున్నారు. తక్‌పట్టీలు రైతులకు అందజేస్తే అదనపు కూలీ, అదనపు కమీషన్ స్పష్టంగా తెలుస్తుంది. దీనిపై కమీషన్ ఏజెంట్లను ప్రశ్నించే అవకాశం ఉంది.


**బహిరంగంగా దోపిడీ**

రైతు తెచ్చిన ఉత్పత్తులను కుప్పగా పోసి టెండర్‌కు పెడతారు. అధిక ధర కోట్ చేసిన వ్యాపారి రైతు సరకును తూకం వేసి కొనుగోలు చేస్తారు. మధ్యవర్తిగా కమీషన్ ఏజెంటు ఉంటారు. ఈయన వందకు 2 శాతం కమీషన్ తీసుకోవాలి. కానీ, అదనంగా మరో 2 శాతం వసూలు చేస్తున్నారు.

టెండర్‌కు పెట్టిన దిగుబడులు బస్తాల్లో నింపి తూకం వేస్తారు. సరకు కొన్న వ్యాపారి కమీషన్ ఏజెంటుకు బస్తాకు రూ.10 కూలీ ఇస్తారు. అయితే కమీషన్ ఏజెంట్లు వ్యాపారి ఇస్తున్నా కూలీతోపాటు బస్తాకు అదనంగా మరో రూ.10 రైతు నుంచి వసూలు చేస్తారు.

ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లక్ష బస్తాలకు పైగా అమ్మకాలు జరిగాయి. ఈ లెక్కన రైతు నెత్తిన రూ.10 లక్షల అదనంగా తూకం భారం పడినట్లే. " ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని" మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి పేర్కొన్నారు.

# శవాలు రోదిస్తున్నాయి..!




కొవ్వూరు : గతేడాది సెప్టెంబరు 10 అర్ధరాత్రి దేవరపల్లి మండలం చిలకావారి పాకలు సమీపంలో అదుపు తప్పిన మినీ లారీ పంట బోదెలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులోని జీడిపిక్కల బస్తాల కింద చిక్కుకుని ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను తెల్లవారుజామున కొవ్వూరు సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. శవాగారంలో రెండు ఫ్రీజర్లే ఉండటంతో మిగిలిన వాటిని భద్రపరిచేందుకు బయట నుంచి ఫ్రీజర్లు తేవాల్సి వచ్చింది. గోపాలపురం సీహెచ్‌సీ వద్ద తాత్కాలిక శవాగారం ఉంది. ఒక మృతదేహం వస్తే పరవాలేదు. రెండు, మూడు ఒకేసారి వస్తే భద్రపర్చేందుకు పరుగులు పెట్టాల్సిందే. జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో శవాగారాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి చందాన్ని తలపిస్తోంది. మౌలిక వసతుల మాట అటుంచి కనీస అవసరాల మేరకు ఫ్రీజర్లు కూడా ఉండడం లేదు. సమీపంలోని ఆసుపత్రులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల నుంచి తేవాల్సి వస్తోంది.

**ఒక్కోచోట ఒక్కోరకంగా..** అనపర్తి వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రి శవాగారంలో రెండు ఫ్రీజర్లు అవసరం కాగా ఒకటే ఉంది. అది కూడా మరమ్మతులకు గురైంది.

కొవ్వూరు 50 పడకల సీహెచ్‌సీలో రెండు ఫ్రీజర్లున్నాయి. అవి కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

కడియం 30 పడకల ఆసుపత్రిలో శవగారం లేదు.

గోపాలపురం సీహెచ్‌లో ఇటీవల తాత్కాలిక శవాగారం ఏర్పాటైనా ఫ్రీజరు లేదు. నిడదవోలు 30 పడకల ఆసుపత్రి శవాగారంలో ఒక ఫ్రీజరు ఉంది. మరొకటి అవసరం.

గోకవరం 30 పడకల ఆసుపత్రిలో ఏడాది కిందట శవాగారం నిర్మించారు. అయితే అక్కడి చేరడానికి సరైన దారి లేదు.

**8 నెలలు.. 186 మృతదేహాలు..**

ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెలాఖరు వరకు జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లోని శవాగారాలకు 186 మృతదేహాలను తీసుకొచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం..**

ఒకేసారి ఎక్కువ మృతదేహాలు వచ్చినప్పుడు ఇబ్బంది ఎదురవుతోంది. జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో శవాగారాలు, ఫ్రీజర్ల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాం. స్వచ్ఛంద సంస్థలు, దాతలను ప్రోత్సహించి సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపుతున్నాం. ఎం.పద్మ, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారిణి

# లింకు తెగిన చెరువులు

శ్రీకాళహస్తి : సోమశిల-స్వర్ణముఖి లింకు కాల్వ నీళ్లు మల్లెమడుగు, బాలాజీ జలాశయం చేర్చాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో కాల్వ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే గత ఐదేళ్లలో కాల్వతో పాటు చెరువుల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో కాల్వకు అనుబంధంగా ఉన్న చెరువుల రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం కాల్వతోపాటు చెరువుల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో కాల్వగుండా గ్రావిటీ మీద వచ్చే నీటిని నిల్వ చేయడం, ఆ నీటిని మల్లెమడుగు, బాలాజీ జలాశయానికి తరలించడం కష్టసాధ్యమే మరి. చెరువుల దుస్థితిపై ఆయకట్టు రైతులు పెదవి విరుస్తుండటం గమనార్హం.

**వ్యయం.. నిష్ఫలం**

చెరువుల్లో రివిట్‌మెంట్ ఏర్పాటు చేశాక ఏడాదికో, రెండేళ్లకొక పర్యాయం పిచ్చి మొక్కల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్) చేస్తుంటారు. ఎస్ఎస్‌కెనాల్ పనుల్లో ప్రధాన భూమికను ఏర్పేడు మండలంలోని మేర్లపాక జలాశయం చేపట్టనుంది. కాల్వకు చివరి భాగంగా ఉన్నది ఈ చెరువు మాత్రమే. దీన్ని రూ.4 కోట్లు వ్యయంతో జలాశయంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో 2019 నాటికి రివిట్‌మెంట్ పనులు పూర్తి చేశారు. వైకాపా ఐదేళ్లు రివిట్‌మెంట్‌ను పట్టించుకున్న పాపాన



పోలేదు. దీంతో మేర్లపాక చెరువు కట్ట వెంబడి చేసిన రివిట్‌మెంట్‌పై చెట్లు పెరిగాయి. రివిట్‌మెంట్ రాళ్లు ఊడిపోయాయి. ఇదే విషయమై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు జలవనరుల శాఖ అధికారులు మేర్లపాక చెరువును పరిశీలించారు. మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుపున్నారు. కాల్వల పొడవునా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఆయకట్టు రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

**సామర్థ్యం పెంపు**

రూ.450 కో ట్ల అంచనాతో సోమశిల-స్వర్ణముఖి లింకు కాల్వ పనులు ఏళ్లతరబడి కొనసాగుతూనే ఉన్నాయి. 20 15లో శ్రీకాళహస్తి మండలంలోని మామిడిగుంట, ఇలగనూరు, గుంటకిందపల్లి, ఉడమలపాడు, జింగిలిపాళెం, ఏర్పేడు మండలంలోని రాజులపాళెం, చింతలపాళెం, మేర్లపాక, మన్నసముద్రం చెరువుల సామర్థ్యం పెంచడంతో పాటు పంగూరు, మేర్లపాక చె రువులను జలాశయాలుగా అభివృద్ధి చే యాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేశా రు. రూ.40 కోట్ల వ్యయంతో ఈ చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కట్ట పటిష్ఠతకు రివిట్‌మెంట్ పనులు పూర్తిచేశారు.

# మేల్కోకుంటే ముప్పే..!

పుత్తూరు : మున్సిపాలిటీలోని ఎస్ఆర్ చెరువు కలుజు కాలువ పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో చెరువు నిండితే ఆ నీరంతా ఇళ్లలోకి ప్రవహిస్తోంది. ఏటా జెండామాను వీధి ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పుత్తూరు చెరువు నుంచి కలుజు నీరు పారే కాలువలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ కారణంగా భవానీనగర్ ప్రాంత వాసులు వర్షం పడితే కునుకు లేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి. అయితే గతేడాది ప్రధాన కాలువలో పూడిక తొలగించడం వల్ల కాస్త పర్వాలేదు.

పలమనేరు మున్సిపాలిటీలో ఎద్దుల చెరువు, కాకతోపు వీధి, ఓంశక్తి ఆలయం ప్రాంతాల్లో వర్షం వస్తే అక్కడి వాసులు ఖాళీ చేయాల్సిందే. వర్షాలు పడితే ఇక నిద్ర ఉండదు. కారణం ఆ చెరువులకు నీరు చేరే సప్లయ్ ఛానల్స్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ సమస్య పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

తిరుపతి నగరపాలక సంస్థలో ప్రధాన కాలువలు ఆక్రమించారు. దీంతో పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి. ప్రధానంగా మధురానగర్, రైల్వే కాలనీ, శివజ్యోతి నగర్, దొడ్డాపురం వీధి, రెడ్డిరెడ్డి కాలనీ, సత్యనారాయణపురం, జీవకోన, బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది.

పుంగనూరు మున్సిపాలిటీలో ఏటిగట్టుపాళ్యెం, మారుతీనగర్, కౌండిన్య కాలువ ఆక్రమణల వల్ల పలు కాలనీల్లోకి నీరు చేరుతోంది. దీంతో వర్షాకాలం వస్తే ముంపునకు గురవడం వల్ల ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, చిత్తూరు నగరపాలికలు, పుత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం, శ్రీకాళహస్తి,



వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు మున్సిపాలిటీలు ఉన్నాయి.. ఏ పురపాలక చూసినా ఇదే పరిస్థితి.. ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పరిస్థితి మెరుగుపడటం లేదు.. చిన్న చినుకుపడితే కంటిపై కునుకు లేని కాలనీలు ఎన్నో ఉన్నాయి.. గతేడాది కురిసిన వర్షాలకు పలు కాలనీలు నీట మునిగాయి.. అయినా అధికారులు ఇప్పటివరకు అక్కడి పరిస్థితిని అంచనా వేసి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.. ప్రస్తుత వర్షాలకు వీధులన్నీ జలమయం అవుతున్నాయి.

**కాలువలపైనే నిర్మాణాలు..** ఉమ్మడి జిల్లాలోని నగర పాలికలు, పురపాలికల్లో ప్రణాళికాబద్ధంగా మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టలేదు. ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించినవే నేటికీ ఉన్నాయి. దీనికితోడు పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో డ్రైన్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. దీంతో వర్షం వస్తే వీధులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ డ్రైన్లపై నిర్మాణాలు చేపట్టడంతో కనీసం ఏడాదికి ఒక్కసారి కూడా శుభ్రం చేస్తున్న దాఖలాల్లేవు. దీంతో ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వట్రపాళెం పూర్తిగా మునకకు గురవుతోంది. సాయిన గర్, గిరిజన కాలనీ, మహదేవయ్యనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. కాళంగి పరివాహక ప్రాంతంలోనూ మునక ప్రాంతాలు ఉన్నాయి.

# మత్తుకళ్ళతో మాయ చేస్తున్న బాహుబలి బ్యూటీ..

దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్, రానా కాంబినేషన్లో వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'బాహుబలి' . ఈ సినిమా ఇండియన్ సినీ రికార్డ్ లను తిరగరాసింది. ఈ సినిమాకి కొనసాగింపుగా 'బాహుబలి 2' సినిమా వచ్చి మరో రికార్డును సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన ఇండియన్ చిత్రాలలో ఒకటిగా స్థానం సంపాదించుకుంది. ఈ సినిమాలతో దర్శకుడు సంచలనం సృష్టించడమే కాదు ఇందులో నటించిన ప్రతి చిన్న జూనియర్ ఆర్టిస్ట్ కి కూడా మంచి గుర్తింపు అందించారు. ఇదిలా ఉండగా బాహుబలి సినిమాలో "మనోహరీ" అంటూ సాగే స్పెషల్ సాంగ్ కి ఏ రేంజ్ లో గుర్తింపు లభించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇందులో ముగ్గురు భామలు తమ అద్భుతమైన డాన్స్ పెర్ఫార్మన్స్ తో అందరి దృష్టిని ఆకట్టుకున్నారు.



స్కార్లెట్ మెల్లిష్ విల్సన్,మధు స్నేహ ఉపాధ్యాయ, నోరా ఫతేహి ముగ్గురు కూడా ఎవరికివారు తమ అద్భుతమైన పర్ఫామెన్స్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ పాట తరువాత ప్రముఖ హీరోయిన్ నోరా ఫతేహి పేరు బాగా మారుమ్రోగింది అని చెప్పవచ్చు. ఈ సినిమా తర్వాత స్పెషల్ సాంగ్ లకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన నోరా ఫతేహి తన అందంతో ఎప్పటికప్పుడు అభిమానులను ఆకట్టుకుంటోంది.

అందులో భాగంగానే తాజాగా సోషల్ మీడియా ద్వారా కొన్ని ఫోటోలు షేర్ చేసిన ఈమె.. ఇందులో అద్దాలు పొదిగిన డ్రెస్ లో చాలా అందంగా కనిపిస్తోంది. తాజాగా తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలను షేర్ చేసిన నోరా ఫతేహి మరోసారి తన అందంతో ఆకట్టుకుంది అని చెప్పవచ్చు. అంతేకాదు ఈమె ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు చూసి మత్తు కళ్ళతో మాయ చేస్తోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు.. ఇండియన్ సినీ నటిగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. డాన్సర్, మోడల్, సింగర్, రియాలిటీ షో జడ్జిగా కూడా పేరు దక్కించుకుంది. 2014లో హిందీ సినిమా రోర్ :టైగర్స్ ఆఫ్ ది సుందర్బన్స్ అనే సినిమా ద్వారా నటిగా ఇండస్ట్రీ రంగ ప్రవేశం చేసింది. తెలుగులో టెంపర్, కిక్ 2, లోఫర్, ఊపిరి వంటి చిత్రాలలో ఆడి పాడిన ఈమె.. బాహుబలి సినిమాలో మనోహరి పాటతో మరింత పాపులారిటీ సంపాదించుకుంది.

# షాట్ ముందు 60 పుషప్స్.. నెక్స్ట్ లెవెల్ డెడికేషన్

సిని ఇండస్ట్రీలో ఉన్న వాళ్లకు ఎలాంటి ఒత్తిడి ఉండదు. వారు లైఫ్ లో భలే ఎంజాయ్ చేస్తారు. వారికి నచ్చినట్టు ఉంటారు అని ఎన్నెన్నో అనుకుంటూ ఉంటారు. కానీ వాళ్లకుండే కష్టాలు వారికే ఉంటాయి. ఇండస్ట్రీలో ఉండటం అంతా ఆషామాషీ వ్యవహారం కాదు. దానికోసం ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుంది. నచ్చిన ఫుడ్ కడుపునిండా తినే కనీస వెసులుబాటు కూడా ఉండదు నటీనటులకు. నటీనటులు అందరూ ఎక్కువగా దీన్ని ఓ ప్రాబ్లమ్ లాగా చూస్తే కొందరు మాత్రం అది తమ బాధ్యత అనేలాగా ప్రవర్తిస్తూ సరైన ఫిట్‌నెస్ ను మెయిన్‌టెయిన్ చేస్తూ ఆడియన్స్ ను ఆశ్చర్యపరచడమే కాకుండా వారిని ఆకట్టుకుంటూ ఉంటారు. అలాంటి వారిలో నటి శ్రియా రెడ్డి కూడా ఒకరు. తన అద్భుతమైన యాక్టింగ్ తో రీసెంట్ గా ఓజి సినిమాతో ప్రేక్షకులను మెప్పించారు శ్రియా.



**ఫిట్‌నెస్ విషయంలో శ్రియాకు పవన్ నుంచి ప్రశంసలు...** సలార్, ఓజి సినిమాల్లోని తన నటనకు ఆడియన్స్ నుంచి మంచి పేరు, గుర్తింపును తెచ్చుకున్న శ్రియా రెడ్డి డెడికేషన్ తెలిస్తే ఎవరైనా షాకవ్వాల్సిందే. శ్రియా మంచి ఫిట్‌నెస్ ఫ్రీక్. శ్రియా రెడ్డి ఫిట్‌నెస్ గురించి రీసెంట్ గా పవన్ కళ్యాణ్ సైతం ప్రశంసించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రియా తన గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు.

**ఆ కాన్ఫిడెన్స్ లోపలి నుంచే రావాలి...** షాట్ కు వెళ్లే ముందు తానెప్పుడూ కొంత టైమ్ తీసుకుంటానని, ఆ టైమ్ లో రన్నింగ్ చేయడం, చిన్న చిన్న వర్కవుట్స్ చేసి, ఆ తర్వాత షాట్ కు వెళ్తానని, సలార్ షూటింగ్ చేస్తున్నప్పుడు కూడా షాట్ కు వెళ్లే ముందు ప్రతీసారి 50- 60 పుషప్స్ చేసి షాట్ కు వెళ్లేదాన్నని, అలా చేయడం వల్ల తనకు కొత్త ఎనర్జీ వచ్చినట్టు అనిపించడంతో పాటూ ఆ క్యారెక్టర్ లో తాను పర్ఫెక్ట్ గా కనిపిస్తున్నాననే ఫీలింగ్ వచ్చేదని శ్రియా చెప్పుకొచ్చారు. ఖాన్సార్ లో తాను చాలా మంది మగవాళ్ల మధ్య నిలబడాల్సి వచ్చినప్పుడు తాను పవర్‌ఫుల్ గా కనిపించాలంటే, లోపల నుంచే కాన్ఫిడెన్స్ రావాలని, అలాంటి వాటికి తాను చేసిన పుషప్స్ ఎంతో ఉపయోగపడ్డాయని ఆమె చెప్పారు. ఇదంతా విని ఆమె డెడికేషన్ కు అందరూ ఆశ్చర్యపోతున్నారు.




# ఫ్లో మిస్ చేసే సాంగ్స్ కి కోట్లు ఖర్చు ఎందుకో..?




మిగతా భాషల సినిమాల్లో ఇది జరుగుతుందా అన్నది స్పష్టత లేదు అఫ్కోర్స్ జరుగుతున్నా కూడా అది ఎప్పుడో ఒకసారి అన్నట్టు ఉంది. కానీ టాలీవుడ్ లో మాత్రం అది రిపీట్ అవుతూనే ఉంది. ఇంతకీ ఏంటి అదీ అంటే సినిమాలో కోట్లు ఖర్చు పెట్టి ఒక సాంగ్ చేయడం తీరా సినిమాలో చూస్తే ఆ సాంగ్ లేకుండా వదలడం.

అదేంటి అంటే సినిమా ఫ్లో మిస్ అవుతుంది అందుకే సాంగ్ స్కిప్ చేశామంటున్నారు మేకర్స్. ఈమధ్య ఈ కామెంట్ మరీ రొటీన్ అయ్యింది. సినిమా ప్రమోషన్స్ కోసం ముందే ఆ సాంగ్ ని రిలీజ్ చేయడం కొంతమంది ఆడియన్స్ ఆ సాంగ్ నచ్చి దాని కోసమే సినిమాకు వెళ్లడం అది సినిమాలో లేదని తెలిసి డిజప్పాయింట్ అవ్వడం జరుగుతుంది.

**ఆ సాంగ్స్ వల్ల సినిమాకు నష్టం వస్తుందా..** గేమ్ ఛేంజర్, కింగ్ డమ్ రీసెంట్ గా వచ్చిన మిరాయ్, ఓజీ సినిమాల్లో కూడా సినిమా ఫ్లోని బ్రేక్ చేస్తుందని భారీగా ఖర్చు పెట్టిన సాంగ్ ని సైతం పక్కన పెట్టారు. ఐతే ఆ సాంగ్స్ వల్ల సినిమాకు నష్టం వస్తుందా అని అనుకున్నారు కానీ ఆ సాంగ్ కోసమే సినిమాకు వచ్చిన వాళ్లు ఉంటారన్న విషయాన్ని గుర్తించట్లేదు. హిట్టైతే ఆ సాంగ్స్ ని యాడ్ చేస్తున్నారు కానీ ఫ్లాపైతే మాత్రం లైట్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ రాజా సాబ్ సినిమా కోసం కూడా యూరప్ లో రెండు సాంగ్స్ షూట్ కి చిత్ర యూనిట్ వెళ్లారు. అక్కడ కాస్ట్ లీ లొకేషన్స్ లో భారీగా ఖర్చు చేసి మరీ ఆ సాంగ్ ని చేస్తున్నారట. ఐతే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మిరాయ్ సినిమాలోనే వైబ్ ఉంది బేబీ సాంగ్ సినిమాలో స్కిప్ చేశారు. ఆ తర్వాత సినిమా సక్సెస్ అయిన వారానికి యాడ్ చేశారు. రాజా సాబ్ ఒక హర్రర్ థ్రిల్లర్ మూవీ.. ఆ సినిమాలో సాంగ్స్ అనేవి డిఫరెంట్ గా ప్లాన్ చేయాలి. ఈ విషయంలో మారుతి ఆలోచన ఏమో కానీ ఇప్పుడు ఇంత ఖర్చు పెట్టి తీసిన సాంగ్స్ సినిమాలో పెడతారా లేదా అన్న డౌట్ వస్తుంది.

**ఫారిన్ లోకేషన్స్ లో సాంగ్స్..** డైరెక్టర్ మారుతి సినిమా లెంగ్త్ ఇంకా ఏది అవసరం ఏది అనవసరం లాంటి విషయాల్లో చాలా ప్లానింగ్ తో ఉంటాడు. రాజా సాబ్ లో సాంగ్స్ అది కూడా ఫారిన్ లోకేషన్స్ లో అంటే మారుతి ఏదో గట్టిగానే ప్లాన్ చేశాడని చెప్పొచ్చు. మరి ఇంత ఖర్చు పెట్టి తీసి తీరా సినిమాలో లేకపోతే మాత్రం నిజంగానే ఆ కష్టం ఇంకా ఆ సాంగ్ కి పెట్టిన బడ్జెట్ అంతా వేస్ట్ అవుతుంది. రాజా సాబ్ మాత్రమే కాదు చేస్తున్న ఫిల్మ్ మేకర్స్ కూడా ఈ విషయంలో కాస్త జాగ్రత్త వహించాల్సిందే.

# మాస్ జాతర, కే- ర్యాంప్.. ఆడియన్స్ వాటిని రిసీవ్ చేసుకుంటారా?






టాలీవుడ్ సినిమాలు మాస్ జాతర, కే- ర్యాంప్ సినిమాలు రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకోగా.. సీనియర్ హీరో రవితేజ మాస్ జాతర మూవీ అక్టోబర్ 31వ తేదీ వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది. దీపావళి కానుకగా యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కే-ర్యాంప్ చిత్రం అక్టోబర్ 18న థియేటర్స్ లోకి రానుంది. దీంతో రెండు సినిమాల మేకర్స్.. ఇప్పటికే ప్రమోషన్స్ తో బిజీగా ఉన్నారు. వరుస అప్డేట్స్ ఇస్తూ సందడి చేస్తున్నారు. అందులో భాగంగా మేకర్స్ రిలీజ్ చేసిన కంటెంట్ లో అనేక బూతులు ఉండడం హాట్ టాపిక్ గా మారింది. సాధారణ జీవితంలో బూతులు కామన్ అయినా.. సినిమాల్లో ఎందుకు ఉపయోగిస్తున్నారని పలువురు పెదవి విరిచారు. సినీ ప్రియుల్లో బూతులు చాలా మంది యూజ్ చేస్తున్నా.. స్క్రీన్ పై వాటిని చాలా మంది రిసీవ్ చేసుకోలేరు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సినిమా చూస్తారు. కాబట్టి బూతులు ఇష్టానుసారంగా వినియోగించడం సరైన పద్ధతి కాదనే చెప్పాలి. కాబట్టి మాస్ జాతర ఓలే ఓలే సాంగ్, కే- ర్యాంప్ ట్రైలర్ లోని బూతులుపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అదంతా ఒకెత్తు అయితే.. ఇప్పుడు రెండు సినిమాల మేకర్స్ బూతుల విషయంలో సమర్థించుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. కొన్ని సినిమాల్లో ఎన్ని ఎంత డబుల్ మీనింగ్ ఉన్నా.. ఎవరూ పట్టించుకోరని డైరెక్టర్ భాను భోగవరపు వ్యాఖ్యానించారు. మాస్ జాతరలో ఉత్సవాల్లో సాధారణంగా ప్రేమగా తిట్టుకునే పదాలనే పాటలో పెట్టినట్టు చెప్పారు. పాటలోని మొదటి లైన్లపై మాత్రమే ఫోకస్ చేస్తున్నారని, కానీ తర్వాత భాగంలో ఫన్ కూడా ఉందని రవితేజ తెలిపారు. ఇంగ్లీష్ లో అసభ్య పదాలు సాధారణంగా వాడతారని, అవే తెలుగులో ఉంటే ఎందుకు ఇబ్బందని తిరిగి ప్రశ్నించారు. మరోవైపు, అబ్బవరం.. హీరో పాత్ర ఎలా ఉండబోతున్నాడో చూపించేందుకు టీజర్ లో బూతులు యాడ్ చేశామన్నారు. కానీ సినిమాలో అలాంటి పదాలు దాదాపుగా ఉండవని అన్నారు.

ట్రైలర్ విడుదలయ్యే సరికి ఈ విషయంలో పూర్తి క్లారిటీ వస్తుందని తెలిపారు. కానీ పూర్తి స్థాయిలో బూతులు లేవని చెప్పలేదు. మొత్తానికి రెండు సినిమాల టీమ్స్.. సమర్థించుకునే ప్రయత్నం చేసినా.. ఆడియన్స్ మాత్రం అంగీకరించడం కష్టం. ఏదేమైనా చిత్రాలు రిలీజ్ అయ్యాక.. ఆడియన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో వేచి చూడాలి.

# ట్రెడిషనల్ లుక్‌లో అనసూయా అందాల ఆభరణం

యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టి, ఇప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై కూడా తనదైన ముద్ర వేసుకుంటున్న అనసూయా భరద్వాజ్ ఎప్పటికప్పుడు ఫ్యాషన్ లుక్స్‌తో ఆకట్టుకుంటూనే ఉంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన సిల్క్ చెక్స్ శారీ ఫోటోలు సోషల్ మీడియాలో బజ్ క్రియేట్ చేస్తున్నాయి. నేవీ బ్లూ బ్లౌజ్, రెడ్ అండ్ యెల్లో చెక్స్ కలయికతో కూడిన శారీతో క్లాసీ లుక్‌లో మెరిసిన అనసూయ, ట్రెడిషనల్ జ్యూవెలరీతో మొత్తం లుక్‌ని హైలెట్ చేశారు. ఆమె హేర్ స్టైల్, జువెలరీ, మేకప్ కలిసి ఆమె లుక్‌కి ప్రత్యేకమైన గ్లామర్ ను తీసుకొచ్చాయి. మూడ్ అన్ స్థాపబుల్ అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్ కూడా ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంది. ఆ ఫోటోలలో కనిపించిన నేచురల్ స్మైల్, పోజ్, అట్టిట్యూడ్ అన్నీ కలిపి ఒక స్టైలిష్ వైబ్‌ను రిఫ్లెక్ట్ చేస్తున్నాయి. కెరీర్ పరంగా చూస్తే, అనసూయ తన జర్నీని టెలివిజన్ యాంకర్‌గా ప్రారంభించింది. "జబర్దస్త్", "ఢీ" వంటి షోలతో బుల్లితెర



ప్రేక్షకుల మన్ననలు పొందింది. తరువాత ఆమె సినిమా రంగంలో అడుగుపెట్టి రంగస్థలం, పుష్ప: ది రైజ్ వంటి సినిమాల్లో ముఖ్యపాత్రలు పోషించి వెర్సటైల్ యాక్ట్రెస్‌గా నిరూపించుకుంది. ఇక ఇప్పుడు ఓటీటీ, సినిమాలు, ఈవెంట్స్ ఎక్కడైనా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పాజిటివ్ రోల్స్‌తో పాటు గ్రే షేడ్స్‌లోనూ తన నటనతో దృష్టిని ఆకర్షించింది. తన ప్రతి పాత్రను డిఫరెంట్‌గా మలచుకునే అనసూయ, స్క్రీన్‌పై కూడా, స్క్రీన్ వెలుపల కూడా స్ట్రాంగ్ ప్రెజెన్స్‌ను కొనసాగిస్తోంది. మొత్తం మీద ఈ ట్రెడిషనల్ సారీ లుక్‌లో అనసూయ చూపించిన కాన్ఫిడెన్స్, గ్రేస్ సోషల్ మీడియాలో మరలా చర్చనీయాంశమైంది. ఏ లుక్ అయినా తనదైన స్టైల్లో హైలెట్ చేస్తారు అని ఎక్కువమంది పాజిటివ్ గా స్పందిస్తున్నారు.

# దర్శక, నిర్మాత నోటి దురుసుతోనే జాన్వీ కపూర్ ఎగ్జిట్?

కరణ్ జోహార్ దోస్తానా2ని ఏ మూహూర్తాన మొదలు పెట్టాడో గానీ! ఆది నుంచి అవాంతరాలు ఎదుర్కొంటన్న సంగతి తెలిసిందే. ముందుగా హీరోగా ఎంపిక చేసిన కార్తీక్ ఆర్యన్ పై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించి? అతడితో వివాదం కారణంగా అర్ధంతరంగా తొలగించడం ఎంత సంలచమైందో తెలిసిందే. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేని కార్తీక్ ని అలా తొలగించడంతో కరణ్ పై నెటి జనులు తీవ్రంగా మండిపడ్డారు. అటుపై ఆ స్థానాన్ని విక్రాంత్ మాస్సేతో భర్తీ చేసారు. అనంతరం కొన్ని రోజులకు హీరోయిన్ గా ఎంపికైన జాన్వీ కపూర్ కూడా ప్రాజెక్ట్ నుంచి మధ్యలోనే బయటకు వచ్చేసింది.

**కరణ్ తో జాన్వీ ఢీ:** ఇప్పుడా స్థానంలో మరో హీరోయిన్ నటిస్తోంది. తెలుగు నటి శ్రీలీలను ఎంపికచేసినట్లు ప్రచారంలో ఉంది. అయితే జాన్వీ ఏ కారణంగా బయటకు వచ్చింది? అన్నది మాత్రం ఇంత వరకూ తెరపైకి రాలేదు. డేట్ల సర్దుబాటు విష యంలోనే మరో సినిమాతో క్లాష్ రావడంతో బయటకు వచ్చిందన్నది ప్రాథమికంగా జరిగిన ప్రచారం. కానీ దీని వెనుక అసలు కారణం మరోటి ఉందని తాజాగా బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఆ సినిమా షూటింగ్



సమయంలో జాన్వీపై కరణ్ నోరు జారడంతోనే ప్రతిగా జాన్వీ కూడా ధీటుగా బధులిచ్చే ఎగ్జిట్ అయిందన్నది తాజా సమాచారం. దీంతో ఇప్పుడా వార్త ఆసక్తికరంగా మారింది.

**సెలబ్రిటీల్నే భయపెట్టే హోస్ట్:** జాన్వీ కపూర్ –కరణ్ జోహార్ మధ్య జరిగిన డిస్కషన్ ఏమై ఉంటుంది? అర్ధంతరంగా వదిలేసి వచ్చేంతగా కరణ్ ఏమని ఉంటాడన్నది చర్చకు దారి తీస్తోంది. అయితే కరణ్ తీరుపై గతంలో కూడా విమర్శలున్నాయి. కాఫీ విత్ కరణ్ టాక్ షోలో వివాదాస్పద ప్రశ్నలతో సెలబ్రిటీలను ఇబ్బంది పెడతాడు? అన్నది అందరికీ తెలిసిన వాస్తవం. నోటికి ఏది వస్తే అది మాట్లాడటం..అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ప్రశ్నలు అడగడం..బోల్డ్ కృశ్చనింగ్ వంటివి కరణ్ పై పెద్ద మచ్చే వేసాయి. అతడి టాక్ షోకి వెళ్లాలంటే సెలబ్రిటీలే భయపడిపోతారు? అన్న వాదాన చాలా కాలంగా ఉంది.

**రెండు చోట్లా బిజీ బిజీ:** కరణ్ నోరు అమీర్ ఖాన్, షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ లాంటి నటులు మాత్రమే మూయించగలరనే అభిప్రాయం ఉంది. ఇప్పుడా నోటి దురుసే హీరోయిన్ల ప్రాజెక్ట్ లు వదిలి పోయే వరకూ వచ్చిందా? అంటూ డిస్కషన్ షురూ అయింది. మరి ఈ ప్రచారం వెనుక వాస్తవాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ తెలుగులో పెద్దిలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే కొన్ని బాలీవుడ్ ప్రాజెక్ట్ లు చేతిలో ఉన్నాయి. కోలీవుడ్ ప్రయత్నాలు మొదలు పెట్టింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536